Postel No. MBN/08/2016-2018


పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల రోగాలకు వనమూలికలతో వైద్యంచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము
నారాయణపేట రోడ్డు,ఉట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895

# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :24 సంచిక :242 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు బుధవారం 24 డిసెంబర్ 2025 పేజీలు :12 వేల రూ5 /-

# 29 నుంచి అసెంబ్లీ..



**హైదరాబాద్, డిసెంబర్ 23:**అసెంబ్లీ సమావేశాలు ఈనెల 29 నుంచి మొదలు కానున్నాయి. సమావేశాల్లో కృష్ణా, గోదావరి జలాల అంశమే ప్రధాన అజెండా కావాలి. అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ హయాంలో జరిగిన అన్యాయాన్ని ఎండగడదాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయాల కారణంగా సాగు జలాల విషయంలో తెలంగాణ కోల్పోయిన హక్కులను ప్రజలకు తెలియజేద్దాం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అవసరమైతే సభలోనే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని అభిప్రాయపడ్డారు.పాలమూరు - రంగారెడ్డి ఎత్తుపోతల ప్రాజెక్టుపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం ఆయన మంత్రులతో సమావేశమయ్యారు. ఇటీవలి సర్పం చ్ ఎన్నికలు, వచ్చే ప్రాదేశిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, పీఏసీఎస్ ఎన్నికలు, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల షెడ్యూల్‌తోపాటు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.దాదాపు మూడున్నర గంటల పాటు అనేక అంశాలపై చర్చ సాగింది. తెలంగాణ అనుమతి లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్కడ నిర్మిస్తున్న ప్రాజెక్టులను అడ్డుకునే కార్యాచరణపై సీఎం చర్చించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకం వల్లే కృష్ణా నీటి వాటాలో అన్యాయం జరిగిందని, ఇదే విషయాన్ని సభ వేదికగా ప్రజలకు పూర్తిగా వివరించాలనే నిర్ణయం తీసుకున్నారు. పంచాయతీ ఎన్నికలు మంచి ఫలితాలనే ఇచ్చాయని, కొన్ని పొరపాట్లు వల్ల స్థానాలు తగ్గాయని సీఎం అభిప్రాయపడినట్లు తెలిసింది.వచ్చే ప్రాదేశిక ఎన్నికల్లో ఆ పొరపాట్లకు తావు లేకుండా చూసేందుకు ఎత్తుగడలు రూపొందించేందుకు సిద్ధమయ్యారని సమాచారం. పంచాయతీ ఫలితాలపై మంత్రులకు ర్యాంకులు ఇచ్చినట్లుగా తెలిసింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులదే బాధ్యత తీసుకోవాలని సీఎం సూచించినట్లుగా తెలిసింది. మండల పరిషత్‌లతో పాట్లు జడ్పీ పీఠాలను క్లీన్ స్వీప్ చేయాలని సీఎం పిలుపునిచ్చినట్లు సమాచారం.జీహెచ్ఎంసీలో మున్సిపాలిటీల విలీనం.. డివిజన్ల ఏర్పాటుపై తీసుకున్న నిర్ణయాలు, నిబంధనలు మంత్రులకు సీఎం వివరించారు. కేంద్రం వద్ద పెండింగ్ నిధుల అంశంపై ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్రానికి రావాల్సిన వాటిపై శాఖల వారిగా ఆయా మంత్రులు ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం సూచించారు.

## డుమ్మా టీచర్లకు
# రేవంత్ షాక్

### 50 మంది తొలగింపు

**హైదరాబాద్, డిసెంబర్ 23:**తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నానాటికీ దిగజారుతుంది. ఇప్పటికే ఒక్క విద్యార్థి కూడా లేని ప్రభుత్వ బడులు తెలంగాణలోనే అధికంగా ఉన్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. మరోవైపు సర్కార్ బడుల్లో విధులు నిర్వహించే కొందరు టీచర్లు వేళాపాళా లేకుండా ఇష్టారీతిన సెలవులు పెట్టడంపై రేవంత్ సర్కార్ కీలక చర్యలకు ఉపక్రమించింది. ఇకపై టీచర్లు చెప్పా పెట్టకుండా విధులకు నెల రోజులపాటు వరుసగా గైర్హాజరైతే వారి ఉద్యోగం శాశ్వతంగా తొలగించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ప్రకటన జారీ చేశారు. సర్కార్ బడుల్లోని ఎఫ్ఆర్ఎస్, మధ్యాహ్న భోజనం అమలు వంటి విషయాలపై డీఈఓలతో తాజాగా ఆన్‌లైన్‌లో



సమీక్షించారు.ఎఫ్ఆర్ఎస్ ద్వారా ఏయే స్కూళ్లలో ఉపాధ్యాయుల హాజరు ఎంత శాతం ఉందో తెలుసుకునే వెసులుబాటు ఉంది. ఈ వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నందున వాటిపై డీఈవోలు తరచూ సమీక్షించాలని విద్యాశాఖ ఆదేశించింది. ఉపాధ్యాయులు నెలరోజులపాటు ఎలాంటి అనుమతి లేకుండా విధులకు హాజరు కాకుంటే షోకాజ్ నోటీసు జారీ చేయాలని, విచారణలో రుజువైతే ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు గెజిట్‌లో ప్రచురించాలని డీఈఓలకు సూచించారు. ఒక రోజు అనధికారికంగా స్కూల్‌కి రాకున్నా ఇదే విధంగా చర్యలు తీసుకోవచ్చు. అయితే అకస్మాత్తు అనారోగ్యం, రోడ్డు ప్రమాదం వంటి సాకులతో కోర్టుల్లో కేసులు వేసే అవకాశం ఉన్నందున నెల రోజులు అనధికారిక సెలవు పెడితే షోకాజ్ నోటీసులు ఇవ్వాలని తెలిపారుకాగా గత ఆగస్టు నుంచి ఎఫ్ఆర్ఎస్ అమల్లోకి రావడంతో టీచర్లు వచ్చిన, వెళ్లిన సమయం నమోదవుతోంది. అయితే టీచర్స్ టైమింగ్స్‌పై అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. కేవలం విధులకు హాజరయ్యారా? లేదా? - మిగతా3లో

## డీ లిమిటేషన్ కు
# లైన్ క్లియర్...

**హైదరాబాద్, డిసెంబర్ 23:**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లను 300 డివిజన్లను పెంచడంపై దాఖలైన 80 పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టి వేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో జోక్యం చేసుకోలేమని తెలిపింది. అభ్యంతరాలు తెలిపేందుకు ఇచ్చిన గడువు ముగిసిందని హైకోర్టు గుర్తు చేసింది. దీంతో ప్రభుత్వం గ్రేటర్‌ను 300 వార్డులుగా విభజించడానికి అడ్డంకులు తొలగిపోయినట్లయింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని విస్తరిస్తూ, వార్డుల సంఖ్యను 150 నుండి 300కు పెంచుతూ ప్రభుత్వం డీలిమిటేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీ వార్డుల పునర్విభజన అశాస్త్రీయంగా ఉందంటూ పలువురు కోర్టును ఆశ్రయించారు. పిటిషన్లపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి, తొలుత 300 వార్డుల జనాభా వివరాలు, మ్యాప్‌లను 24 గంటల్లో పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని ఆదేశించారు. అయితే, దీనిపై ప్రభుత్వం అప్పీలుకు వెళ్లడంతో డివిజన్ బెంచ్ ఈ ఉత్తర్వులను పాక్షికంగా సవరించింది. కేవలం పిటిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేసిన వార్డులు ముఖ్యంగా వార్డు నెం. 104 - షా అలీ బండా, 134 - లంగర్ హౌజ్ వివరాలు మాత్రమే బహిర్గతం చేయాలని స్పష్టం చేసింది. వార్డుల విభజనపై ప్రజలు తమ అభ్యంతరాలను సమర్పించడానికి హైకోర్టు అదనపు సమయం కేటాయించింది. తొలుత డిసెంబర్ 17తో - మిగతా3లో




## వాజ్‌పేయి జీవితం
# స్ఫూర్తిదాయకం..

: వెంకయ్య నాయుడు



**హైదరాబాద్, డిసెంబర్ 23:** మాజీ ప్రధాని, దివంగత నాయకుడు, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయ్ జీవితం తెరిచిన పుస్తకం అని.. ప్రతి పేజీ స్ఫూర్తి దాయకం అని పేర్కొన్నారు భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు. శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధన కోసం వాజ్‌పేయ్ నిరంతరం కృషి చేశారని చెప్పారు. కేంద్ర సాంస్కృతిక శాఖ, త్రినేత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నారాయణగూడ కేశవ్ మెమోరియల్ కళాశాలలో భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, ఇతర నాయకులు ఈ కార్యక్రమంలో అటల్ బిహారీ వాజపేయి జీవితం గురించి, - మిగతా3లో

# కేసీఆర్ గేర్ మార్చారా..



## పాలమూరు జిల్లా టార్గెట్..

**హైదరాబాద్, డిసెంబర్ 23:**రేవంత్ పేరును ప్రస్తావించకుండానే..గట్టిగానే అటాక్ చేశారు కేసీఆర్. రేవంత్ సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్ నగర్‌కు చెందిన కృష్ణా జలాల వాటా, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలను సెంట్రిక్‌గా కేసీఆర్ ఇండైరెక్ట్‌గా రేవంత్ రెడ్డిపై సీరియస్ కామెంట్స్ చేశారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల డీపీఆర్‌ను కేంద్రం వెనక్కి పంపితే నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారంటూ ఫైరయ్యారు. డీపీఆర్ను వెనక్కి పంపితే భూమి, ఆకాశాన్ని ఏకం చేసి లొల్లి చేయాల్సింది పోయి ప్రభుత్వం సైలెంట్‌గా ఉందని పరోక్షంగా రేవంత్ రెడ్డిని టార్గెట్ చేశారు కేసీఆర్.పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో గ్రామగ్రామాన సభలు పెట్టి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎండగట్టి తీరుతామ్. పెద్ద ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామ్. బహిరంగ సభలకు తాను స్వయంగా హాజరవుతానంటూ..ఇక పూర్తిస్థాయిలో రంగంలోకి దిగుతానని చెప్పకనే చెప్పారు గులాబీ బాస్. ఎంతసేపు రియల్ ఎస్టేట్ దందాలే తప్ప.. వేరే ధ్యాసే లేదని రేవంత్ రెడ్డి సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ఎక్కడికక్కడ నిలదీస్తామని..అన్యాయాలపై ప్రశ్నిస్తామని హెచ్చరించారు.అయితే ఎక్కడా కేసీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి - మిగతా3లో

## మెస్సీ టూర్ లో 100 కోట్లు...
# రంగంలోకి ఈడీ

**న్యూఢిల్లీ, డిసెంబర్ 23:**అర్జెంటీనా ఫుట్బాల్ ఆటగాడు మెస్సి ఇటీవల తన గోట్ టూర్ భాగంగా ఇండియాకు వచ్చాడు. ఈ క్రమంలో కోల్ కతా లో ముందుగా పర్యటించాడు. అక్కడి సాల్ట్ లేక్ స్టేడియంలో నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల 22 నిమిషాల్లోనే మైదానం నుంచి వెళ్లిపోయాడు..



హైదరాబాదులో అతని టూర్ సజావుగానే సాగింది. ముఖ్యమంత్రి స్వయంగా ఫుట్బాల్ ఆడాడు. దీంతో సందడి వాతావరణం ఏర్పడింది. ముంబైలో కూడా నిర్వహించిన గోట్ టూర్లో సచిన్ నుంచి మొదలుపెడితే మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వరకు అందరూ - మిగతా3లో

# మూడేళ్ల ముందు నుంచే టిక్కెట్ల లొల్లి...

**మహబూబ్ నగర్, డిసెంబర్ 23:**ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని షాద్‌నగర్ బీఆర్ఎస్‌లో వర్గ విభేదాలు పీక్ లెవల్‌కు చేరాయి. కారు పార్టీలో రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరుతో క్యాడర్ రెండుగా చీలిపోయిందన్న టాక్ వినిపిస్తోంది. షాద్ నగర్ నియోజకవర్గంలో 2014, 2018లో రెండు సార్లు ఘన విజయం సాధించిన గులాబీ - మిగతా3లో



# సంపాదకీయం

## సంస్కరణల ముసుగులో పెత్తనం

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం సంస్కరణల పేరుతో వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడమే కాక, మందబలంతో ఏకచ్ఛత్రాధిపత్యం వహించింది. విపక్షాలు లేవదీసిన అభ్యంతరాలకు సరైన సమాధానాలు చెప్పడం లేదు సరికదా, చర్చకు కూడా అవకాశం లేకుండా బుల్‌డోజర్ సంస్కృతి అవలంబించింది. ఉన్నత విద్యారంగాన్ని తన గుప్పెటలో పెట్టుకోవడానికి శ్రీకారం చుట్టింది. ఆత్మనిర్భర్ భారత్ నినాదంతో ఇతర దేశాలపై ఆధారపడే దుస్థితినుంచి బయటపడాలంటూ పదేపదే ప్రబోధించే మోడీ ప్రభుత్వం బీమా, అణువిద్యుత్ రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు స్వాగతం పలకడం, ముఖ్యమైన వ్యవస్థలను విదేశాలకు తాకట్టుపెట్టడం ఈ పార్లమెంట్ సమావేశాల్లో ప్రత్యేకత. ఇది కాక యుపిఎ ప్రభుత్వ చిహ్నాలను, మహాత్మాగాంధీ పేరును పూర్తిగా చెరిపేసేందుకు చరిత్రాత్మక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసింది. ఈ పథకాన్ని తన అధీనం లోకే తెచ్చుకుని తన పెత్తనంతోనే పనులు సాగేలా మార్చుకుంది.ఈ పథకంలో 100 రోజుల పనిదినాలను 125 రోజులకు పెంచి ఉద్ధరిస్తున్నట్టు నమ్మిస్తున్నా దాని అసలు స్వరూపం వేరేగా ఉంటోంది. ఏ రాష్ట్రంలో, ఎక్కడ, ఏ పనులు చేపట్టాలో కేంద్రమే నిర్ణయిస్తుంది. ఏ రాష్ట్రానికి ఎంత బడ్జెట్ కేటాయిస్తుందో ఆ మేరకే పనులు చేపట్టాలి. అదీ కూడా అవసరం బట్టే పని కల్పన ఉంటుంది. అంటే రాష్ట్రాలకు ఇందులో ఎలాంటి స్వేచ్ఛ లేనట్టే. ఇక నిధుల వ్యయంలో ఇంతవరకు శ్రామికుల వేతనాలు పూర్తిగా, సామగ్రి వ్యయంలో 75% నైపుణ్యం, పాక్షిక నైపుణ్య కార్మికుల వేతనాల్లో 75 శాతం కేంద్రమే చెల్లించేది. కానీ ఇకనుంచి మొత్తం వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వమే 40 శాతం వరకు భరించక తప్పదు. 90ః 10 గా ఉన్న వ్యయం ఇకనుంచి 60ః40 గా ఉంటుంది. ఇంత భారీ వ్యయాన్ని రాష్ట్రాలు ఎంతవరకు భరించగలవో ఆలోచించాలి. ఈ వివాదాస్పద నిర్ణయంపై కాంగ్రెస్‌తో సహా విపక్షాలన్నీ భగ్గుమంటున్నాయి. జాతీయ స్థాయిలో వ్యతిరేక ఉద్యమానికి సన్నద్ధమవుతున్నాయి. కేంద్రం మితిమీరిన పెత్తనానికి మరో తార్కాణం ఉన్నత విద్యారంగం. ఉన్నత విద్య క్రమబద్ధీకరణ చట్టాన్ని పూర్తిగా ఏకీకృతం చేస్తూ వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ (వి బిఎస్ఎ) బిల్లును తీసుకొచ్చింది. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి), ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఇ), నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్స్ ఎడ్యుకేషన్ (ఎన్‌సిటిఇ) పర్యవేక్షణ అధికారాలన్నీ ఒకే రెగ్యులేటర్ కిందకు తెస్తూ హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఏర్పాటు చేస్తోంది. అన్ని కేంద్ర యూనివర్శిటీలు, వాటి కిందగల కాలేజీలు, విద్యామంత్రిత్వశాఖ పరిపాలన కింద గల జాతీయ ప్రాముఖ్యత గల సంస్థలన్నీ ఈ కమిషన్ కిందకే వస్తాయి. ప్రస్తుతం యుజిసి కింద లేని ఐఐటిలు, ఐఐఎంలు, ఎన్‌ఐటిలు, ఐఐఎస్‌సిలు, ఐఐఎన్‌ఇఆర్‌లు, ట్రిపుల్ ఐటిలు కూడా ఈ కమిషన్ కిందకే వస్తాయి. ఈ విబిఎస్ఎ కమిషన్‌లో తనకు అనుకూలమైన తొమ్మిది మందిని కేంద్రమే నియమిస్తుంది. ఈ బిల్లుపై రాష్ట్రాలకు ఎలాంటి హక్కులు ఉండవు. రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయాలు కూడా కేంద్ర అధిష్టానం ఆదేశాలకే లోబడాల్సి వస్తుంది. ఇక బీమా రంగంలో విదేశీ సంస్థలు పూర్తిస్థాయిలో ప్రవేశించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బీమా రంగంలో ప్రస్తుతం 74% వరకు ఉన్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 100 శాతం పెంచడానికి వీలుగా బిల్లును రూపొందించింది. జిడిపిలో 3 శాతం వాటాకు పరిమితమైన బీమారంగం ఇక నుంచి విదేశాల్లో మాదిరిగా ఆరున్నర శాతానికి చేరుతుందని ప్రభుత్వం నమ్మబలుకుతోంది. నూరు శాతం ఎఫ్‌డిఐలతో విదేశీ కంపెనీలు తక్కువ మూలధనంతో ఇకపై ఇక్కడ వ్యాపారాలు పెట్టుకోవచ్చు. ఇప్పటివరకు 65 శాతం వాటాతో అత్యంత బలంగా ఉన్న ప్రభుత్వ రంగ ఎల్‌ఐసికి ఇప్పుడు అగ్నిపరీక్షే ఎదురవుతుంది. బీమా రంగంలో వంద శాతం ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులకు తలుపులు తెరిచిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు అణుశక్తి బిల్లు రూపంలో మరో వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. అణుశక్తిని స్థిరంగా వినియోగించుకుంటూ అభివృద్ధి పథం వైపు దేశాన్ని తీసుకెళ్లడమే లక్షంగా ‘శాంతి బిల్లు’ ను ప్రవేశపెట్టినట్టు మోడీ ప్రభుత్వం ప్రకటిస్తోంది. అణు విద్యుత్ సంస్థాపిత సామర్థ్యం ప్రస్తుత 8.8 గిగావాట్లు నుంచి 2047 నాటికి 100 గిగావాట్లకు పైగా పెంపు చేయడమే లక్షంగా 2008లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం అమెరికాతో సివిల్ అణుశక్తి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. అయితే రియాక్టర్లలో ఏదైన ప్రమాదం సంభవిస్తే మానవ ప్రాణ, పర్యావరణ నష్టానికి ఆ రియాక్టర్ల సరఫరాదారు పరిహారం చెల్లించాలని సివిల్ లయబిలిటీ బిల్లు తీసుకు రాగా, అమెరికా కంపెనీలు వ్యతిరేకించడంతో బిల్లు అమలు కాలేదు. ఈ పరిహారం విషయంలో సడలింపు కల్పించి దాన్ని మోడీ ప్రభుత్వం అమలులోకి తీసుకు వస్తోంది. 1962 అణుశక్తి చట్టం, 2010 పౌర అణు నష్టపరిహార చట్టాన్ని రద్దు చేయాలనే బిల్లు లోని నిబంధనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రమాదాలు సంభవించినప్పుడు రియాక్టర్ల సరఫరాదారుల నష్టపరిహార చెల్లింపు బాధ్యత కేవలం 300 మిలియన్ డాలర్లకే పరిమితం చేయడం ప్రజలభద్రతను నిర్లక్షం చేయడమే. జపాన్‌లో పుకుషిమా, రష్యాలో చెర్నోబిల్ అణుప్రమాదాలు నేర్పిన గుణపాఠాలు ఇప్పుడు విస్మరించడం ఎవరికీ క్షేమం కాదు. నియంత్రణలన్నీ ప్రభుత్వం చేతిలోనే ఉంటాయని చెబుతున్నప్పటికీ బహుళజాతి కంపెనీలు ఎంత శక్తిమంతమైనవో భోపాల్ యూనియన్ కార్బైడ్ గ్యాస్ లీక్ ప్రమాదం సంఘటనే ప్రత్యక్ష సాక్షం. ఈ బిల్లు ద్వారా అమెరికా, ఫ్రాన్స్ వంటి విదేశీ కంపెనీలకే తప్ప భారత కంపెనీలకు ప్రయోజనం శూన్యం అన్న విమర్శలు వస్తున్నాయి.

# నేడు పెరియార్ రామస్వామి వర్ధంతి

### సామాజిక వివక్షతను, బ్రాహ్మణుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా తన జీవితకాలం మొత్తం పోరాటం చేసిన మహనీయుడు పెరియార్ రామస్వామి

భారతీయ సమాజంలో కుల వ్యవస్థ నరనరాల్లో జీర్ణించుకొని అన్ని రంగాల్లో అసమానతలు పెరగడానికి కారణమైంది. ఈ అసమానతలను రూపుమాపడానికి సాహు మహరాజ్, నారాయణ గురు, రామస్వామి పెరియర్ వంటి సామాజిక విప్లవవీరులు చేసిన త్యాగఫలితంగా భారతదేశం స్వేచ్ఛా, సమానత్వం, సామాజిక, ఆర్థిక, రాజకీయాలు పునాదులుగా ఏర్పడిన భారత రాజ్యాంగాన్ని అనుసరిస్తూనే సమసమాజ నిర్మాణానికి దోహదం చేశారు. దక్షిణ భారతదేశ ప్రజలచే ముఖ్యంగా తమిళనాడు ప్రజలచే పెరియర్‌గా తాన్ తై పెరియర్‌గా ఆత్మీయంగా పిలవబడే ఈరోడ్ వెంకట రామస్వామి 1879 సెప్టెంబరు 17న ఈరోడ్‌లో జన్మించారు. సంఘ సంస్కర్తగా, హేతువాదిగా, ఆత్మగౌరవ ఉద్యమ నిర్మాతగా ద్రావిడ ఉద్యమ సారథిగా ఆయన చేసిన సేవలకు గుర్తుగా ప్రజలు ఆయనను పెరియర్‌గా పిలుచుకునేవారు. ‘పెరియర్’ అంటే ‘పెద్ద మనిషి’ అని అర్థం.సమాజంలో ఆయన కుల, మత, వర్గ ఆధిపత్యాలపై తిరుగుబాటు చేశాడు. కుల, మత రహిత సమసమాజం కావాలని ఆయన ఆకాంక్ష. కానీ నిన్నగాక మొన్న పరువు హత్యలు ఈ దేశంలో జరిగిన తరుణంలో పెరియర్ జయంతి, వర్ధంతి లు నిర్వహించుకుంటున్నామంటే ఆయన ఆకాంక్ష ఇంకా అలాగే ఉంది. మహిళలకు సమాన హక్కులు కావాలని ఆయన కాంక్షించారు. పెరియర్ ముఖ్యంగా సమాజంలో ప్రధానంగా నెలకొని ఉన్న బ్రాహ్మణ ఆధిపత్యాన్ని ప్రశ్నించారు. దక్షిణ భారతానికి చెందిన ద్రావిడులపై ఉత్తరానికి చెందిన బ్రాహ్మణ ఆధిపత్యాన్ని సహించేది లేదని స్వీయభావన ఉద్యమాన్ని నిర్మించారు. అగ్రవర్ణాలు తమ ఆధిప త్యాన్ని కొనసాగిం చడం కోసమే ఈ దేవుండ్లు,


Periyar E. V. Ramasamy

గుడులు, గోపురాలను నిర్మి స్తూ పనికిమాలిన పురాణా లను సృష్టించారని ప్రచారో ధ్యమాన్ని సాగించడం ద్వారా ఆయన ప్రముఖ హేతువాదిగా పేరు పొందారు. హేతువాదం, ఆత్మగౌరవం, స్త్రీ హక్కులు, కుల నిర్మూలన కోసం పెరియర్ చేసిన పోరాటం అప్పటికీ, ఇప్పటికీ ఒక చరిత్రగా మిగిలిపోతుంది. మూల-ద్రావిడ వాసులైన బ్రాహ్మణేతరులను, భార తదేశానికి చెందిన బ్రాహ్మ ణులు దోపిడీ చేయడాన్ని అణివేయడాన్ని వ్యతిరేకించారు. తమిళ సమాజాన్ని విప్లవ మార్గంలో నడిపి కుల వివక్షతను తొలగిం చడానికి తీవ్రంగా కృషి చేసిన వ్యక్తిగా తమిళ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే వ్యక్తి పెరియర్ రామస్వామి. అందుకే ఆయ నను ఆధునిక కాల ప్రవ క్తగా, ఆగేయ ఆసియా సోక్రటిస్‌గా, సామాజిక విప్లవ పితామహుడిగా, అజ్ఞానం, అంధ విశ్వాసాలు, అసంబద్ధమైన అచిర వ్యవహారాల ను వ్యతిరేకించే వారిగా యునెస్కో అభివర్ణించింది. “దేవుడు లేదు, దేవుడు లేదూ, అసలు దేవుడే లేదు” అనే నినాదంతో పెరియర్ సాగించిన ఉద్యమం ప్రధానమైనది, కుల, మత వ్యత్యాసాలు కలిగిన భారతదేశం తనకు వద్దని, కుల, మత రహితమైన భారతమే తనకు కావాలని పోరాటం చేశాడు. కుల, మతాలను రాజ్యాంగం నిషేధించినప్పుడే కుల, మత రహిత సమాజం ఏర్పడుతుందని ఆయన వాధించాడు. హిందుత్వ వాదాన్ని గట్టిగా వ్యతిరేకించారు. కాబట్టే వారికి పెరియర్ అంటే గిట్టడం లేదు. పెరియర్ తన ఆశయాల సాధన కోసం 1939లో జస్టిస్ పార్టీ పెట్టారు. 1944లో జస్టిస్ పార్టీని ‘ద్రావిడ్ దార్ కళనంగా’ మార్చారు. ఈ పార్టీ సామాజికోద్యమానికే ప్రాధాన్యతని చ్చి ఎన్నికలకు దూరంగా ఉండి మరీ పోరాటం చేసింది. అంట రానితనం, కులం, వర్ణ వివక్షత తీవ్రంగా ఉన్న దేశంలో ప్రజల తో ఆత్మగౌరవాన్ని పెంపొందించడం, వారి మధ్య ఉన్న సా మాజి క ఆర్థిక సమానత్వాన్ని సాధించడం కుల వ్యవస్థను దోపిడీ మ యమైన సాంప్రదాయాలను నిర్మూలించడమే పెరియర్ ధ్వేయం. హిందూ మతం ఆపాదించిన తరతరాల బానిసత్వాన్ని వదిలించుకునేందుకు దేవుడు ఒక్కడే, మనుషులంతా ఒక్కటే అని చాటడం మంచిదని ప్రభోధించాడు. ఎప్పుడు ఆయన భావాలు, ఆలోచనలు విప్లవాత్మకమైనవిగానే ఉండేవి. దేశం కుల, మత కంపులో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో మత దురహంకారాన్ని వ్యతిరేకిస్తూ శాస్త్రీయ, హేతుబద్ధమైన జీవన విధానాన్ని అవలంభించారు.రామస్వామి పెరియార్ 1973 డిసెంబరు 24న తన 94వ ఏట మరణించారు.ఆత్మగౌరవ పోరాటాలు చేసిన దళితులు, స్త్రీలు, బడుగు, బలహీన వర్గాల కోసం తన జీవితాన్ని ధారపోసి, తన చివరి శ్వాస వరకు సమసమాజం కోసం పోరాటం చేసిన సామాజిక విప్లవకారుడు పెరియర్ రామస్వామి

# కలకలం రేపుతున్న ఎఫ్ స్టీన్ ఫైల్స్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 23:** ప్రపంచవ్యాప్తంగా ఎఫ్ స్టీన్ ఫైల్స్ ఎంతటి సంచలనం సృష్టిస్తున్నాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ వ్యవహారంలో వేలాది ఫోటోలు ఉన్నాయని.. ప్రపంచప్తంగా పెద్ద మనుషులుగా చలామణి అవుతున్న వ్యక్తులంతా ఇందులో ఉన్నారని అమెరికా మీడియాలో ప్రధానంగా వార్తలు వస్తున్నాయి. దీనికి తోడు మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ నుంచి మొదలు పెడితే.. ట్రంప్ వరకు అందరూ ఉండడంతో ఒక్కసారిగా కలకలం నెలకొంది.ఇటీవల అమెరికా మీడియాలో మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ ఫోటోలు దర్శనమిచ్చాయి. అతడితో పాటు కొంతమంది అమ్మాయిలు కూడా ఉన్నారు. కొన్ని ఫోటోలు అత్యంత దారుణంగా ఉన్నాయని.. అవి బయట పెడితే ఆ ప్రముఖుల అసలు గుట్టు బయటపడుతుందని చాలామంది అనుకున్నారు. అయితే ఇందులో కొంతమేర మతలబు చోటుచేసుకుంది. అంతేకాదు ట్రంప్ ఫోటోలు కూడా మాయమయ్యాయి. దీంతో తెరవెనక ఏదో జరిగి ఉంటుందని అందరు అనుకున్నారు. అయితే ఊహించని విధంగా సోమవారం తెల్లవారుజామున కొన్ని ఫోటోలు బయటకు



రావడంతో మరోసారి కలకలం ఏర్పడింది.ఎప్ స్టీన్ వ్యవహారానికి సంబంధించిన దాదాపు 16 ఫైల్స్ మాయమైనట్టు అంతర్జాతీయ మీడియా వర్గాలు కొద్దిరోజులుగా వ్యాఖ్యానిస్తున్నాయి. అయితే వీటిలో న్యాయశాఖ సంబంధించిన వెబ్ పేజీ నుంచి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోటో మళ్లీ ప్రత్యక్షమైంది. కొద్ది రోజులు ఈ ఫోటో మిస్ అయినట్టు అమెరికా మీడియాలో వార్తలు వచ్చాయి. ఈ ఫోటోకు సంబంధించి తాత్కాలికంగా రివ్యూ కోసమే తొలగించామని అమెరికా న్యాయశాఖ అధికారులు చెప్పడం గమనార్హం. అయితే ఆ ఫోటోలో ట్రంప్ తన భార్య మెల్లనియ, ఎప్ స్టీన్, అతడి స్నేహితురాలు గిస్లెన్ మాక్స్ వెల్ కనిపించారు.ట్రంప్ ఫోటో మాయం వెనక అమెరికాను ఆశాక అధికారులు స్పందించారు. ఈ వ్యవహారంలో ఉన్న యువతులకు సంబంధించిన గుర్తింపులు, ఇతర వ్యవహారాలు బయటికి రాకుండా ఉండడానికి చర్యలు తీసుకున్నామని.. దాని సమీక్ష కోసం ట్రంప్ ఫోటో బయటికి రాకుండా తొలగించామని అమెరికా న్యాయశాఖ అధికారులు పేర్కొన్నారు. అయితే ఇదంతా తాత్కాలికంగానే చేశామని.. ఈ కేసులో ఎవరైతే బాధితులుగా ఉన్నారో.. వారిని మాత్రమే తాము రక్షించడానికి దస్త్రాలలో సవరణలు చేస్తున్నామని వెల్లడించారు. ఈ వ్యవహారంలో ఎవరి వైపు తాము పక్షపాతం ప్రదర్శించడం లేదని.. సమరూపకంతోనే వ్యవహరిస్తున్నామని వెల్లడించారు.

# గ్రేటర్ హైదరాబాద్ వాసులకు గుడ్‌న్యూస్

**హైదరాబాద్, డిసెంబర్ 23:**హైదరాబాద్ నగర ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గించే దశగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిల్ కార్పొరేషన్ ఒక సంచలన నిర్ణయాన్ని తీసుకుంది. గత కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను బకాయిల పరిష్కారం కోసం జీహెచ్‌ఎంసీ బంపర ఆఫర్ ప్రకటించింది. నగరంలోని ప్రైవేటు, ప్రభుత్వం ఆస్తులకు సంబంధించి పేరుకుపోయిన పన్ను బకాయిలపై భారీ మినహాయింపులను కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 90 శాతం వడ్డీ మినహాయింపు: ఒకేసారి చెల్లింపుతో విముక్తి ఈ పథకం ప్రకారం ఆస్తి పన్ను బకాయి ఉన్న వినియోగదారులు తమ పెండింగ్ బకాయిలపై ఉన్న వడ్డీలో ఏకంగా 90 శాతం మినహాయింపును పొందవచ్చు. అంటే వినియోగదారులు తాము చెల్లించాల్సిన అసలు పన్నుతోపాటు కేవలం పది శాతం వడ్డీని మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. ఈ వన్‌టైమ్ సెటిల్‌మెంట్ విధానం ద్వారా వేల సంఖ్యలో ఉన్న పన్ను చెల్లింపుదారులకు గొప్ప ఉపశమనం లభించనుంది. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని రాల ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు ఈ రాయితీ వర్తిస్తుందని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. విస్తరించిన నగరానికి వర్తింపు: ఇటీవల గ్రేట్ హైదరాబాద్ పరిధిని ప్రభుత్వం భారీగా విస్తరించిన సంగతి తెలిసిందే. ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకొని ఉన్న 20 పురపాలక సంఘాలు, ఏడు నగరపాలక సంస్థలన జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తూ నోటిఫికేషన్ విడుదలయ్యింది. ఈ విలీన ప్రక్రియతో బృహత్ నగరంగా అవతరించిన హైదరాబాద్‌లో కొత్త ప్రాంతాలను కూడా ఈ ప్రాపర్టీ ట్యాక్స్ ఆఫర్ వర్తించనుంది. దీని వల్ల అటు ప్రజలకు వడ్డీ భారం తగ్గడమే కాకుండా ఇటు జీహెచ్‌ఎంసీకి భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఈ పథకాన్ని




సద్వినియోగం చేసుకోవడం ద్వారా నగర వాసులు తమ ఆస్తి పన్ను రికార్డులను క్లియర్ చేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. అప్పుల భారం లేకుండా నవ నగర నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరుతున్నారు.

# ఆర్మీ అమ్ముల పొదిలోకి ఆత్మాహుతి డ్రోన్లు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 23:** పహల్గాం ఉగ్రదాడి.. 26 మంది యాత్రీకుల కాల్చివేత.. తర్వాత భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో మన సైనిక శక్తి పాకిస్తాన్‌తోపాటు ప్రపంచ దేశాలకు తెలిసిపోయింది. భారత సైన్యం జరిపిన మెరుపు దాడి.. పాకిస్తాన్ డ్రోన్ దాడులను సమర్థవంతంగా ఎదుర్కొనడం చూపిన ప్రపంచ దేశాలు షాక్ అయ్యాయి. ఇదే సమయలో మనకు మిత్రులు ఎవరు.. శత్రువులు ఎవరు అన్నది నిర్ధారణ అయింది. దీంతో మనం మరింత సమర్థవంతంగా, శక్తివంతంగా కావాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ క్రమంలో కేంద్రం ఇప్పటికే ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా సరికొత్త ఆయుధాలు రూపొందిస్తోంది. విదేశాల నుంచి కూడా సరికొత్త టెక్నాలజీ ఆయుధాలు కొనుగోలు చేస్తోంది. తాజాగా 850 ఆత్మాహుతి డ్రోన్ల కొనుగోలు తుది దశకు చేరింది. డిసెంబర్ చివర్లో రక్షణ మంత్రిత్వ శాఖ సమావేశంలో ఆమోదం లభించనుంది. పహల్గాం దాడి తర్వాత అప్రమత్తత పెరిగిన సందర్భంలో, ఈ డ్రోన్లు ప్రాణనష్టం లేకుండా శత్రు లక్ష్యాలను నిర్మూలిస్తాయి. భవిష్యత్తులో 30 వేల డ్రోన్ల సమకూర్జన ప్రణాళికలో ఇది మొదటి దశ.నేషనల్ ఏరోస్పేస్ లేబొరేటరీస్ అభివృద్ధి చేసిన ఈ డ్రోన్లు 1,000 కి.మీ. దూరం ఎగురుతాయి. రాడార్‌లకు తప్పిపోయి లక్ష్యాలను ధ్వంసం చేస్తాయి. రష్యా%–%ఉక్రెయిన్ యుద్ధంలో ఇలాంటి ఆయుధాలు ప్రధాన పాత్ర పోషించాయి. రెండామూల ప్రపంచ యుద్ధంలో జపాన్ కామికాజే విమానాల్లా ఈ డ్రోన్లు పనిచేస్తాయి.పదాతి దళం ప్రతి ప్లాటూన్‌కు 10 డ్రోన్లతో ‘అశనీ’ దళాలు ఏర్పాటు చేయనుంది. గుంపుగా ప్రయోగిస్తూ కొన్ని నిఘా చేస్తూ, మిగతావి దాడి చేస్తాయి. పేలుడు పదార్థాలు మోసుకెళ్లి రాడార్‌లకు తప్పుకుని దాడి చేస్తాయి. అరుణాచల్ ప్రదేశ్‌లోని కమెంగ్ రంగంలో సైన్యం ప్రయోగాత్మక పరీక్షలు పూర్తి చేసింది. క్రమంగా వాయుసేన, నౌకాదళాల్లోకి తీసుకువస్తారు.ఏప్రిల్ 22 పహల్గాం దాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్ డ్రోన్లు ప్రయోగించింది. భారత్ వాటిని అడ్డుకున్నప్పటికీ, భవిష్యత్ ముప్పులను ఎదుర్కొనేందుకు డ్రోన్ శక్తి పెంచుకుంటోంది.

# జపాన్ సునామీ వాల్....

**టోక్యో, డిసెంబర్ 23:**జపాన్ పేరు చెప్పగానే మనసులో మెరిసే అత్యాధునిక సాంకేతికతలతోపాటు, విపత్తుల ముందు చూపే అసాధారణ ధైర్యం కూడా గుర్తొస్తుంది. ఈ దేశం గతంలో భూకంపాలు, సునీమాలు, అగ్నిపర్వతాల బ్లాస్టింగ్ కారణంగా అపార నష్టం చవిచూసింది. అందుకే, భవిష్యత్ ముప్పులను అడ్డుకోవడానికి అసాధారణ ప్రణాళికను అమలు చేసింది. సముద్రతీరాల్లో 395 కిలోమీటర్ల పొడవునా భారీ గోడ నిర్మించి, తమ ప్రాంతాలను మహా తరంగాల నుంచి కాపాడుకుంది.రక్షణ వ్యవస్థ కేవలం ఇంజనీరింగ్ అద్భుతం మాత్రమే కాదు, ప్రకృతి సహాయంతో ముడిపడిన సమగ్ర పరిష్కారం. గోడకు సమీపంలో 9 మిలియన్ల చెట్లను నాటి, దట్ట అడవిని సృష్టించారు. సముద్ర అలల ఉద్ధృతిని మొదట కాంక్రీట్ అడ్డుకుంటుంది, ఆ తర్వాత చెట్లు అదనపు స్థిరత్వం అందిస్తాయి. ఈ డ్యూయల్ సిస్టమ్ పర్యావరణాన్ని కాపాడుతూ, విపత్తు ప్రభావాన్ని తగ్గిస్తుంది.ఈ మోడల్ మానవులు, ప్రకృతి సమన్వయంతో విపత్తులను ఎదుర్కోవచ్చని నిరూపిస్తోంది. జపాన్ పట్టుదల, ముందుచూపు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఇలాంటి సజనాత్మక విధానాలు భవిష్యత్ రక్షణలో కీలకం. విపత్తులను ఎదుర్కోవడంలో జపాన్ వారి ప్రణాళిక మరియు పట్టుదల ప్రపంచానికే ఆదర్శం.

# కేసీఆర్ గేర్ మార్చారా..

- మొదటి పేజీ తరువాయి

పేరును పలకలేదు. రేవంత్ పేరును ప్రస్తావించకుండానే ఓ రేంజ్‌లో విమర్శలు, ఆరోపణలు చేయడం మరోసారి సమ్‌థింగ్ స్పెషల్‌గా మారింది. ఆఖరికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేరును పలికిన కేసీఆర్, రేవంత్ రెడ్డి పేరును మాత్రం పలకకపోవడం ఆసక్తికరంగా మారింది. రేవంత్ పేరును తీయకుండానే ఆయనపై కేసీఆర్ యుద్ధం ప్రకటించారన్న చర్చ సాగుతోంది.ఇక సీఎం రేవంత్ రెడ్డి యాజ్ టీజ్‌గా మాజీ సీఎం కేసీఆర్‌ను నేరుగా టార్గెట్ చేశారు. పదేళ్ల పాలనలో తెలంగాణను 8 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టిన కేసీఆర్ ఒక ఆర్థిక ఉగ్రవాది అంటూ మండిపడ్డారు. కలుగులో దాక్కున్న ఎలుకలా ఇన్నాళ్లూ మౌనంగా ఉండి.. ఇప్పుడు బయటకు వచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. దమ్ముంటే జనవరి 2న జరిగే అసెంబ్లీ సమావేశాలకు రావాలని..తెలంగాణకు ఎవరు మేలు చేశారో అక్కడే తేల్చుకుందామంటూ సవాల్ చేశారు రేవంత్.పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా కేసీఆర్ తీరు మారలేదని..కమీషన్ల కోసమే రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారంటూ దుమ్మెత్తిపోశారు. అయితే రేవంత్ రెడ్డి పేరు తీయకుండా కేసీఆర్ సీఎం సొంత జిల్లాలోని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు, కృష్ణాజలాల అంశాలను బేస్ చేసుకుని టార్గెట్ చేస్తే, సీఎం రేవంత్ రెడ్డి మాత్రం యథావిధిగా కేసీఆర్‌ను టార్గెట్ చేయడం చర్చకు దారితీస్తోంది. ఇక ఇప్పుడు కేసీఆర్ యాక్టీవ్ కాబోతుండటంతో తెలంగాణలో ఇకపై రాజకీయం రంజుగా ఉంటుందన్న టాక్ వినిపిస్తోంది.

**టార్గెట్ సాగునీటి ప్రాజెక్టులు**

గులాబీ అధినేత కేసీఆర్ మొత్తానికి ఫామ్హౌస్ నుంచి బయటికి



వచ్చారు. శనివారం రాత్రి హైదరాబాదులోని నంది నగర్ లో తన నివాసానికి వచ్చారు. చాలా రోజుల తర్వాత కెసిఆర్ బయటికి రావడంతో తెలంగాణ రాష్ట్ర రాజకీయాలలో సంచలనం నెలకొంది. కెసిఆర్ ఇప్పటికిప్పుడు బయటకు రావడం వెనుక బలమైన కారణం ఉంది.2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కేసీఆర్ బయటకు కనిపించడం అత్యంత అరుదుగా మారింది. పార్లమెంటు ఎన్నికల్లో ప్రచారం తర్వాత ఆయన వ్యవసాయ క్షేత్రానికి పరిమితమైపోయారు. గులాబీ పార్టీ పాతిక సంవత్సరాల పండుగకు ఆయన వరంగల్ నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. ఆ తర్వాత ఓ టీవీ ఛానల్ నిర్వహించిన ఇంటర్వ్యూకు కూడా హాజరయ్యారు. ఇటీవల తన మేనల్లుడు హరీష్ రావు తండ్రి చనిపోతే కేసీఆర్ బయటికి వచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో స్టార్ క్యాంపైనర్ గా కెసిఆర్ పేరు పేర్కొన్నప్పటికీ.. ఆయన బయటికి రాలేదు.తనను కలిసే నేతలతో మాత్రమే కేసీఆర్ మాట్లాడుతున్నారు. కేటీఆర్, హరీష్ రావు తో అప్పుడప్పుడు సమావేశం అవుతున్నారు.. ఎన్నికల్లో, వివిధ సందర్భాలలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాల గురించి మాత్రమే ఆయన మాట్లాడుతున్నారు. అయితే ఇన్ని రోజుల తర్వాత కెసిఆర్ బయటికి వచ్చారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులపై ప్రధానమైన చర్చ జరుగుతుందని సమాచారం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల పోలవరం నల్లమల సాగర్ నిర్మాణాన్ని ప్రతిపాదించింది. దీనిపై ప్రధానంగా చర్చ జరిగే అవకాశం కనిపిస్తోంది. గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపాదించిన పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టుపై కూడా చర్చ జరుగుతుందని తెలుస్తోంది. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు 45 టీఎంసీల కృష్ణా నీటితో సర్దుకుపోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిన తీరును గులాబీ పార్టీ తప్పుపడుతోంది. తాము అధికారంలో ఉన్నప్పుడు 90 టీఎంసీల నీటి కోసం పోరాటం చేసామని.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం 45 టీఎంసీలకు ఇలా ఒప్పుకుంటుందని గులాబీ పార్టీ ప్రశ్నిస్తోంది. ఈ వ్యవహారంపై ఉద్యమ కార్యాచరణ రూపొందించాలని గులాబీ అధినేత భావించినట్టు సమాచారం. ఉద్యమ కార్యాచరణకు సంబంధించి తేదీలను మాత్రం ప్రకటించకపోవచ్చని.. ఎందుకంటే త్వరలో స్థానిక సంస్థలకు సంబంధించిన ఎన్నికలు జరగబోతున్నాయని.. అందువల్లే పార్టీ ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది.. చాలాకాలం తర్వాత కెసిఆర్ బయటికి వచ్చిన నేపథ్యంలో రేవంత్ రెడ్డికి సవాళ్లు విసిరే అవకాశం లేకపోలేదని%‰% మరి దీనిని ముఖ్యమంత్రి ఎలా స్వీకరిస్తారో చూడాల్సి ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# మెస్సీ టూర్ లో 100 కోట్లు... రంగంలోకి ఈడీ

- మొదటి పేజీ తరువాయి

హాజరయ్యారు.కోల్ కతా టూర్ లో నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల పెను దుమారం ఏర్పడింది. దీంతో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ క్షమాపణ చెప్పాల్సి వచ్చింది. ఆ రాష్ట్రానికి చెందిన క్రీడా శాఖ మంత్రి రాజీనామా కూడా చేయాల్సి వచ్చింది. అంతేకాదు శతద్రు అనే వ్యక్తిని కూడా పశ్చిమ బెంగాల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇక్కడితోనే ఈ వివాదం ఆగిపోవడం లేదు. ఈ వ్యవహారాన్ని లోతుగా దర్యాప్తు చేస్తే దిగ్భ్రాంతికరమైన వాస్తవాలు తెలుస్తున్నాయని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన దర్యాప్తు సంస్థ చెబుతోంది. దీనికి సంబంధించి జాతీయ మీడియాలో వార్తలు కూడా వస్తున్నాయిమెస్సీ టూర్ లో భారీ కుంభకోణం చోటుచేసుకుందని తెలుస్తోంది. జాతీయ మీడియాలో వస్తున్న వార్తలు, సిట్ దర్యాప్తు జరుపుతున్న తీరు ప్రకారం దాదాపు 100 కోట్ల కుంభకోణం జరిగి ఉంటుందని సమాచారం. మెస్సీ తో ఫోటోలు దిగడం, టికెట్ల విక్రయాలలో అవకతవకలు చోటు చేసుకన్నాయని తెలుస్తోంది. ఇప్పటికే ఈవెంట్ నిర్వాహకుడు శతద్రు ను పోలీసులు అరెస్ట్ చేశారు.



అతడి ఇంట్లో సోదాలు కూడా జరిపారు. అతని ఖాతాలో ఉన్న 22 కోట్లను సీజ్ చేశారు. ప్రత్యేక దర్యాప్తు సంస్థ దీనిని లోతుగా విచారిస్తోంది. కోల్ కతా లోని శతద్రు ఇంటికి వెళ్లి చూసిన ప్రత్యేక దర్యాప్తు బృందం ఒక్కసారిగా ఆశ్చర్యపోయింది. అతడి సామ్రాజ్యాన్ని చూసి నోరు వెళ్ళబెట్టింది.దాదాపు మూడు అంతస్తులలో అతడు భవనాన్ని నిర్మించుకున్నాడు.. తన ఇంటిపై ఏకంగా అతడు ఫుట్ బాల్ మైదానాన్ని నిర్మించుకున్నాడు. అతి పెద్ద ఈతకొలను.. అన్ని రకాల సౌకర్యాలు ఉన్న కార్యాలయం.. అతడు నివసిస్తున్న ఇంట్లో ఉన్నాయని ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు గుర్తించారు..మెస్సి టూర్ ద్వారా శతద్రు బృందం భారీగా సంపాదించిందని.. 100 కోట్ల వరకు వెనకేసుకుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మెస్సి తో ఫోటో దిగడానికి పది నుంచి 30 లక్షల వరకు నిర్వాహకులు వసూలు చేశారు. మీ చెల్లింపులకు సంబంధించి అధికారికంగా ఎటువంటి లెక్కలు చూపించలేదు. టికెట్ల విక్రయాలలోను భారీ స్థాయిలో అక్రమాలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలోనే శతద్రు ఖాతాలో ఉన్న 22 కోట్లను పోలీసులు సీజ్ చేశారు. ఇంకా లోతుగా దర్యాప్తు జరిపితే మరిన్ని విషయాలు వెలుగు చూస్తాయని తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో కూడా మెస్సి పర్యటించిన నేపథ్యంలో.. ఇక్కడ కూడా అక్రమాలు జరిగి ఉంటాయని ప్రతిపక్ష గులాబీ పార్టీ ఆరోపిస్తోంది. అయితే దీనిపై కాంగ్రెస్ పార్టీ కూడా అదే స్థాయిలో విమర్శలు చేస్తోంది. అడ్డగోలుగా మాట్లాడటం గులాబీ పార్టీకి అలవాటైపోయిందని మండిపడుతోంది.

# కేసీఆర్ ప్రెస్ మీట్ తర్వాత రేవంత్ సర్కార్ డిఫెన్స్‌లో పడింది: హరీశ్

**ఇంటర్నెట్ డెస్క్:** రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్ ఇటీవల ప్రెస్ మీట్ తర్వాత రేవంత్ సర్కార్ డిఫెన్స్‌లో పడిందని ఆయన అన్నారు. '25 ఏళ్ళుగా రాజకీయాల్లో ఉన్నా. రాత్రి 9:30 గంటలకు ముఖ్యమంత్రి చిట్ చాట్ పెట్టడం నేను చూడలేదు. అందాల పోటీలు, ఫుట్‌బాల్ షోలు, గ్లోబల్ సమ్మిట్‌లు అన్నం పెడతాయా? సీఎం రేవంత్ రెడ్డికి వాస్తు భయం పట్టుకుంది. అందుకే సచివాలయానికి వెళ్లడం లేదు' అని ఆయన విమర్శించారు.ఇటీవల జరిగిన తెలంగాణా పంచాయతీ ఎన్నికల్లో.. బీఆర్ఎస్ 4 వేల సర్పంచ్ స్థానాల్లో గెలుపొందిందని హరీశ్ రావు అన్నారు. 'బీఆర్ఎస్ దెబ్బకు



డీసీసీబీలకు ఎన్నికలు నిర్వహించడం లేదు. కాంగ్రెస్ కార్యకర్తలను నామినేట్ చేయాలని చూస్తున్నారు. పోలీసులు లేకుండా ఉస్మానియాకు వస్తానని.. పోలీస్ పహారాల మధ్య ఓయూకు వచ్చారు. ఇరిగేషన్‌పై పీపీటీని స్వాగతిస్తున్నాం. పీపీటీపై అసెంబ్లీలో మాకూ అవకాశం ఇవ్వాలి. అసెంబ్లీలో మా గొంతు నొక్కడం.. మైక్ కట్ చేయవద్దు. ఎవరి వాదన నిజమో ప్రజలే తేల్చుతారు. సీపీఐ, ఎంఐఎం, బీజేపీ కంటే తక్కువ సమయం బీఆర్ఎస్‌కు ఇస్తున్నారు. బీఆర్ఎస్‌కు ప్రభుత్వం భయపడుతోంది. అవకాశం ఇస్తే.. అసెంబ్లీలో కాంగ్రెస్ సర్కార్ బట్టలు విప్పుతాం' అని కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు హరీశ్.

## సర్పంచ్ ఎన్నికలలో తనకు ఓటు వెయలేదని


# రైతు పై దాడి చేసిన కాకర్లపల్లి సర్పంచ్

**-ప్రమాణ స్వీకారం చెసి 24 గంటలు కాక ముందే రైతు పై దాడి**

**-కాకర్లపల్లి సర్పంచ్ పై చట్టపర చర్యలతో పాటు అనర్హత వేటు వేయాలి**

**-మంథని అంబేద్కర్ చౌక్ లో కాకర్లపల్లి గ్రామస్తుల ధర్నా**

**మంథని:**మొన్న జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో తనకు సపోర్ట్ చేయలేదని, ఓటు వేయలేదనే అక్కసుతో మంథని మండలం కాకర్లపల్లి గ్రామ సర్పంచ్ కన్నెబోయిన కొమురయ్య అదే గ్రామానికి చెందిన సామాన్య రైతు పర్శవెన సమ్మయ్య ను మంగళవారం ఉదయం తన పొలం వద్ద ఎవరు లెని సమయంలో దాడి చేసి వ్యవసాయ పని కోసం ఉపయోగించే పారతో కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు బాధితున్ని ద్విచక్ర వాహనంపై మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చి చికిత్స చేయించి వైద్యుల సలహా మేరకు అంబులెన్స్ లో గోదావరిఖని కి వెళ్లి స్కానింగ్ తీసుకొని వచ్చారు. గ్రామస్తులు బాధితుడు సమ్మయ్యతో కలసి మంథని మంథని పోలీస్ స్టేషన్ లొ పిర్యాదు చేశారు. అనంతరం మంథని అంబేద్కర్ చౌరస్తాలో కాకర్లపల్లి గ్రామస్తులతో కలసి బాధిత రైతు పర్శవెన సమ్మయ్య ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చెసి 24 గంటలు గడవకముందే మంగళవారం తెల్లవారు జామున ఒక సర్పంచ్ గుండా లాగా సామాన్య రైతు పై దాడి చెయ్యడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ గా సమస్యలు పరిష్కరించాల్సిన సర్పంచ్ ప్రత్యక్షంగా దాడులకు దిగడం హేయమైన చర్య అని అన్నారు. పోలీస్ అధికారులు ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి దాడికి పాల్పడిన సర్పంచి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కాకర్లపల్లి గ్రామ సర్పంచ్ గా రాజ్యాంగం ప్రకారం తన విధులు శాంతియుతంగా నిర్వహించాల్సింది పోయి రౌడీ ముఖాలగా వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. గ్రామంలో ఒక సామాన్య రైతుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఇట్టి సంఘటనపై జిల్లా కలెక్టర్ స్పందించి గ్రామ సర్పంచ్ పై అనర్హత వేటు వేసి సస్పెండ్ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. నాకు వ్యతిరేకంగా గ్రామములో పనిచేసిన నీతో పాటు అందరి అంతు చూస్తానని బెదిరింపులకు దిగుతున్నాడని బాధితుడు రైతు పర్శవెన సమ్మయ్య ఆరోపించారు.నన్ను ఎప్పటికైనా



చంపేస్తానని బెదిరించాడని ఆవేదనను వ్యక్తం చేశాడు. ఈ ధర్నా కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బూడిద గణేష్, గ్రామస్థులు మెండే రాజయ్య,ఆకుల శ్రీనివాస్, పర్శవెన గట్టయ్య,కన్నెబోయినా ఓదెలు, ఆకుల మల్లయ్య, ఆకుల సాయి, ఎలకుర్తి మహేష్ లతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

# డుమ్మా టీచర్లకు రేవంత్ షాక్

- మొదటి పేజీ తరువాయి

అన్నదే పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఇకపై టీచర్ల ఆలస్యంపై కూడా దృష్టి సారిస్తామని అధికారులు చెబుతున్నారు. మరోవైపు యేటా కొందరు టీచర్లు దీర్ఘకాలిక సెలవులపై వెళుంటారు. 6 నెలలని అనుమతి తీసుకొని రెండేళ్లైనా విధులకు రావడం లేదు. అలాంటి వారిని గత రెండేళ్లలో సుమారు 50 మందిని ఉద్యోగాల నుంచి తొలగించినట్లు విద్యాశాఖ తెలిపింది. కనీసం సెలవులను పొడిగించుకుంటామని కూడా సమాచారం ఇవ్వడం లేదని, ఇలా దీర్ఘకాలికంగా విధులకు హాజరు కానివారిని కూడా తొలగించాలని సూచించారు. కాగా ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 24 వేల పాఠశాలల్లో సుమారు 1.15 లక్షల మంది టీచర్లు విధులు నిర్వహిస్తున్నారు

# డీ లిమిటేషన్ కు లైన్ క్లియర్...

- మొదటి పేజీ తరువాయి

ముగియాల్సిన గడువును కోర్టు డిసెంబర్ 19 వరకు పొడిగించింది. ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ డీలిమిటేషన్ అనేది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, ఇందులో కోర్టుల జోక్యం పరిమితంగా ఉండాలని వాదించారు. కేంద్ర సెన్సస్ కమిషనర్ ఆదేశాల ప్రకారం డిసెంబర్ 31, 2025 నాటికి ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉందని, అందుకే వేగంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే నోటిఫికేషన్లు జారీ చేశామని, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.డీలిమిటేషన్ పై ప్రభుత్వానికి చాలా అభ్యంతరాలు వచ్చాయి. ఒకే వార్డు రెండు, మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోకి వస్తోందని కొందరు ఫిర్యాదు చేశారు. కొన్ని వార్డుల్లో 18 వేల జనాభా ఉంటే, మరికొన్నింటిలో 70 వేల వరకు ఉండటంపై కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. హయత్ నగర్ వంటి ప్రాంతాల్లో చారిత్రక కట్టడాలు ఒక వార్డులో, ఆ ప్రాంత పేరుతో ఉన్న మరో వార్డు వేరే చోట ఉండటంపై స్థానికులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ అధికారులు అభ్యంతరాలను స్వీకరిస్తూనే, మరోవైపు కోర్టు కోరిన వార్డుల మ్యాప్‌లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. డిసెంబర్ 31లోగా తుది నివేదిక సిద్ధం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. దానికి సంబంధించి కోర్టు వద్ద అడ్డంకులు అన్నీ తొలగిపోయినట్లయింది.

# మూడేళ్ల ముందు నుంచే టిక్కెట్ల లొల్లి...

- మొదటి పేజీ తరువాయి

పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైంది. గత రెండేళుగా పార్టీ వర్గ విభేదాలతో కొట్టుమిట్టాడుతోంది.



బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు, మహబూబ్ నగర్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి ఏ మాత్రం పొసగడం లేదు. అంజయ్య యాదవ్, నవీన్ రెండు వర్గాలుగా విడిపోవడంతో ద్వితీయస్థాయి నేతలతో పాటు కార్యకర్తలు అయోమయంలో పడ్డారట. అధికార పార్టీ మీద పోరాడాల్సింది పోయి..సొంత పార్టీలో ఈ కుంపటి ఏంటంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారట గులాబీ పార్టీ కార్యకర్తలుమాజీ ఎమ్మెల్యే అంజయ యాదవ్ ఈ సారి తన కుమారుడికి టికెట్ ఇప్పించుకునే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కూడా వచ్చే ఎన్నికల్లో షాద్‌నగర్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ట్రై చేస్తున్నారట. నవీన్ రెడ్డి ఎమ్మెల్యే సీటుపై కన్నేయడంతో తమ సీటుకు ఎసరు వస్తుందన్న ఆందోళనలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ వర్గం అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారట. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నవీన్ కుమార్ రెడ్డి బీఆర్ఎస్ తరపున స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా గెలవడంతో ఆయనపై బీఆర్ఎస్ అధిష్టానానికి మంచి అభిప్రాయం ఉండటంతో పాటు ఆర్థికంగా రాజకీయంగా అన్ని విధాల నవీన్ కుమార్ బలంగా ఉండటంతో స్పీడు పెంచారు. ఇదే ఇప్పుడు అంజయ్య యాదవ్ వర్గంలో ఆందోళనకు కారణమవుతోందని తెలుస్తోంది.ఎమ్మెల్సీ హోదాలో ఉన్న నవీన్ రెడ్డి..హైదరాబాద్‌లోని పార్టీ ఆఫీస్ మొదలుకొని షాద్‌నగర్ వరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ ప్రజల దృష్టిలో, అధిష్టానం దృష్టిలో పడే ప్రయత్నం చేస్తున్నారట. అంతేకాదు బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలకు షాద్‌నగర్ నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలను తరలించడంతో..కేటీఆర్ కూడా నవీన్ రెడ్డిని అభినందించారట. ఇది మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ వర్గానికి ఏ మాత్రం రుచించడం లేదంటున్నారు. అప్పటి నుంచి ఇరు వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోదన్న టాక్ వినిపిస్తోంది.లేటెస్ట్‌గా జరిగిన పంచాయతీ ఎన్నికల్లోనూ ఓ వైపు అంజయ్య యాదవ్, మరోవైపు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఎవరికి వారు సెపరేట్‌గా.. తమ వర్గానికి చెందిన అభ్యర్థులను బరిలోకి దింపి చాలా వరకు గెలిపించుకున్నారు. అయితే అంజయ్య యాదవ్, నవీన్ రెడ్డి వర్గ పోరు పార్టీకి డ్యామేజ్ చేస్తుందన్న ఆందోళన క్యాడర్ కనిపిస్తోందట. ఇంకా కొన్ని పంచాయితీల్లో గెలవాల్సి ఉన్నా అంజయ్య యాదవ్, నవీన్ రెడ్డి విభేదాలతో అధికార కాంగ్రెస్‌కు మేలు జరిగిందని అంటున్నారు. ఇక షాద్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ మద్దతుదారులుగా బరిలో నిలిచి గెలిచిన సర్పంచ్‌లను తెలంగాణ భవన్‌లో సన్మానించారు కేటీఆర్.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరు కాలేదు. అంతే కాకుండా ఈ సమావేశంలో అంజయ్య యాదవ్ మళ్లీ భారీ మెజార్టీతో గెలుస్తారని కేటీఆర్ చెప్పడంతో మళ్లీ ఆయనకే టికెట్ అని చెప్పకనే చెప్పారన్న చర్చ మొదలైంది. ఇంకా ఎన్నికలకు మూడేళ్ల సమయం ఉండగానే..మాజీ ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్సీ టికెట్ ఫైట్ ఇంట్రెస్టింగ్‌గా మారింది. అప్పటి వరకు పరిస్థితుల్లో మార్పు వచ్చి తనకే టికెట్ వస్తుందన్న ధీమాతో నవీన్ రెడ్డి ఉంటే..అధిష్టానం ఆశీస్సులు తనకే ఉన్నాయని అంజయ్య యాదవ్ చెప్పుకుంటున్నారట. మొత్తానికి షాద్‌నగర్ నియోజక వర్గంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి వర్గాల మధ్య కార్యకర్తలు నలిగిపోవాల్సి వస్తుందట. మాజీ ఎమ్మెల్యే వెంట నడవాలో..ఎమ్మెల్సీ చేపట్టిన కార్యక్రమాల్లో పాల్గొనాలో తెలియక గులాబీ పార్టీ కార్యకర్తలు సతమతం అవుతున్నారని అంటున్నారు.

# వాజ్‌పేయి జీవితం స్ఫూర్తిదాయకం..

- మొదటి పేజీ తరువాయి

ఆయన పరిపాలనా దక్షత గురించి వెంకయ్య నాయుడు కీలక ప్రసంగం చేశారు. బీజేపీకి బలమైన పునాది వేసిన వ్యక్తుల్లో వాజ్‌పేయి ముందు వరుసలో ఉంటారని కీర్తించారు. వాజ్‌పేయిని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ శిష్యుడిగా ఎంచుకున్నారని చెప్పారు. వాజ్‌పేయి పాలన అంటే సుపరిపాలన అని.. యువతకు వాజ్‌పేయ్ ఆదర్శనం అన్నారు వెంకయ్య. తాను పదవి విరమణ మాత్రమే చేశానని.. పెదవి విరమణ చేయలేదన్నారు. వాజ్‌పేయి చూపిన మార్గంలో నడుస్తున్నామా? లేదా? అనేది ప్రతీ కార్యకర్త ఆలోచించుకోవాలని సూచించారాయన. నైతిక పాలన, సామాజిక బాధ్యత, రాజ్యాంగం పట్ల అంకిత భావంతో పని చేయాలని దిశానిర్దేశం చేశారు. రాజ్యాంగం పుస్తకాన్ని పట్టుకుని తిరిగితే అంకిత భావంతో పని చేసినట్లు కాదన్నారు. రాజకీయ నాయకులకు తప్పుడు భాష మాట్లాడటం అలవాటు అయిపోయిందంటూ ప్రస్తుత నాయకుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు వెంకయ్య నాయుడు. రాజకీయ నాయకులు శత్రువులు కాదని.. కేవలం ప్రత్యర్థులు మాత్రమేనని చెప్పారు. భారత్‌ను శక్తివంతమైన దేశంగా ప్రపంచం ముందు నిలబెట్టిన వ్యక్తి వాజ్‌పేయ్ అని చెప్పారు. 'నా వల్లే చదువుకుంటున్నారు.. నా వల్లే యుద్ధాలు ఆగిపోతున్నాయని ట్రంప్ చెప్పుకోవడం ఏమాత్రం సరైనది కాదు.' అని వెంకయ్య నాయుడు అభిప్రాయపడ్డారు. 'ప్రస్తుత సమాజంలో వ్యక్తులు స్వార్థం కోసం పని చేస్తున్నారు.. వాజ్‌పేయి శాంతిని ప్రేమించే వారు.. దేశ రక్షణ విషయంలో కఠినంగా ఉండేవారు. పీవీ సంస్కరణలు తీసుకువస్తే.. ఆ సంస్కరణలను ఆచరణలోకి తెచ్చిన వ్యక్తి వాజ్‌పేయి. ఆయనను ప్రత్యర్థులు కూడా అజాత శత్రువు అని పిలిచే వారు. గ్రామీణ సడక్ యోజన ద్వారా గ్రామాల్లో రోడ్లు వేయించింది వాజ్‌పేయి.' అని చెప్పారు వెంకయ్య

వార్తాతరంగాలు
బుధవారం 24 డిసెంబర్ 2025

# యేసుక్రీస్తు ప్రేమ త్యాగం గొప్పది

-క్రీస్తు బోధనలు మానవాళి శాంతికి మూలకారకాలు

-అన్ని మతాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

-క్రైస్తవ క్యాలెండర్ ఆవిష్కరణలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**మంథని:** యేసుక్రీస్తు ప్రేమ త్యాగం గొప్పవని ఆయన బోధనలు అందరూ అనుసరించదగినవని, క్రీస్తు బోధనలు మానవాళి శాంతికి మూలకారకాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం మంథని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంథని పట్టణంలోని సీయోను ప్రార్థన మందిరం ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు బాబు మాట్లాడుతూ అన్ని మతాల వారి అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడిఉందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో పరమత సహనం పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు. క్రైస్తవ సోదర, సోదరీమణులందరికీ ముందస్తుగా క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలను మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. శాంతి, జాలి, కరుణ, దయ, ప్రేమ త్యాగం వంటి పదాలకు నిదర్శనం క్రీస్తు అని ఆయన తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో ప్రతి ఒక్కరు పండుగ జరుపుకోవాలని ఆయన సూచించారు. యేసు క్రీస్తు జన్మ పవిత్రమైనదని, క్రిస్మస్ పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్, సీయోను ప్రార్థన మందిరం పాస్టర్లు దూడ మహేష్, మంథని మార్క్, అజ్మీరా దయారాజు, కలువల శామ్యూల్, సంఘ పెద్దలు ఎంకే జోసఫ్, రామగిరి కుమార్, అందే రమేష్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్ ఘటనలను ఖండిస్తూ హిందూ సంఘాల ఆందోళన



**హైదరాబాద్:**-బంగ్లాదేశ్లో హిందువులపై జరుగుతున్న మారణహోమాన్ని ఖండిస్తూ కొత్తపేట చౌరస్తాలో బంగ్లాదేశ్ జిహాదీల దిష్టిబొమ్మ దహనం జరిగింది. హిందూ మైనారిటీలపై జరుగుతున్న మారణహోమాన్ని తీవ్రంగా ఖండిస్తూ, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, హిందూ వాహిని, స్థానిక బీజేపీ కార్పొరేటర్స్ లతో కలిపి కొత్తపేట చౌరస్తాలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బంగ్లాదేశ్లో హింసకు పాల్పడుతున్న జిహాదీ శక్తులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వారి దిష్టిబొమ్మను దహనం చేశారు. హైదరాబాద్ లో ఉన్న కేంద్ర రక్షణ రంగ సంస్థల చుట్టూ రోహింగ్యాలు అక్రమంగా వచ్చి నివాసం ఉంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వలెనే పెద్ద సంఖ్యలో అక్రమంగా వలస వచ్చి ఇక్కడ శాశ్వతంగా నివాసాలు ఏర్పరుచుకుని ఉండడం ఆందోళనకర విషయమని, కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్ధత వలనే నిఘా లేకపోవడం వలెనే అక్రమంగా వలసలు వస్తున్నారని, వారిని గుర్తించి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ వలస దారులకు అడ్డుకట్ట వేయాలని %ఎవ్రా% నాయకులు డిమాండ్ చేశారు. బాధిత హిందువులకు న్యాయం చేయాలని, అంతర్జాతీయ సమాజం వెంటనే జోక్యం చేసుకోవాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు.

## కలెక్టరేట్ లో నారి న్యాయ్ కార్యక్రమం

పాల్గోన్న మహిళా కమిషన్ చైర్ పర్సన్ శారద

**హైదరాబాద్:** హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయంలో మహిళా కమిషన్ ఆధ్వర్యంలో "నారి న్యాయ్" కార్యక్రమం నిర్వహించారు. మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ళ శారద ఆధ్వర్యంలో నారి న్యాయ్" కార్యక్రమం ఏర్పాటు చేశారు. వివిధ రకాల కేసులకు పరిష్కరించడానికి ఈ కార్యక్రమంలో సంబంధించిన అధికారులు అందరూ పాల్గొన్నారు. ఇంతకుముందు నమోదైన కేసులతోపాటు, వాకింగ్ కేసులకు సంబంధించిన వారు కూడా హాజరయ్యారు. మహిళల యొక్క ఆవేదన వారికి కావలసిన న్యాయం జరగాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ప్రతి జిల్లాలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి వారి యొక్క సమస్యలను పరిష్కరించే దిశలో వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ శారద.మహిళల సమస్యలు, పెండింగ్ లో ఉన్న ఫిర్యాదుల గురించి నేరుగా పిటిషనర్ల నుండి అర్జీలు స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదులను వివిధ పోలీస్ స్టేషన్ అధికారుల ద్వారా వెరిఫై చేసి రిపోర్టు రేపు మహిళా కమిషన్ కు తెలియజేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఎక్కువ శాతం విడాకుల కేసులు ఉన్నాయని తెలిపారు ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు,మహిళా కమిషన్ కార్యదర్శి, హైదరాబాద్ జిల్లా డి.డబ్ల్యూ.ఓ, సిడిపిఓలు, ఎస్.హెచ్.ఓ లు...వివిధ డిపార్ట్ మెంట్ ల అధికారులు పాల్గొన్నారు...

## పివీకి నివాళులర్పించిన కాంగ్రెస్ నేతలు

**హైదరాబాద్:** భారత రత్నా మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గారి 21 వ వర్ధంతి సందర్భంగా పీవీ జ్ఞానభూమి వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్,పీవీ కుటుంబ సభ్యులు, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ ,ఇతర ముఖ్య నేతలు నివాళులు అర్పించారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బహుభాషా కోవిదుడు ఆర్థిక సంస్కరణల వేత్త. ఆర్థిక అంశాల్లో భారతదేశం ఈరోజు నిలబడింది అంటే ఆయన చేసిన సంస్కరణలు నిదర్శనం. తెలంగాణ ముద్దు బిడ్డ మా హుస్నాబాద్ నియోజకవర్గ ముద్దు బిడ్డ పీవీ నరసింహారావు కి ఘన నివాళులు అర్పిస్తున్న. అయన చూపిన మార్గంలో వారి సంస్కరణలతో ప్రపంచ మాంద్యం వచ్చిన ,కరోనా లాంటి విపత్తు వచ్చిన దేశం బయటపడి స్వయంగా నిలదొక్కుకుని నిలబడింది అంటే ఆయన సంస్కరణలు స్ఫూర్తి. ఒక గ్రామీణ ప్రాంతంలో జన్మించి ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకుండా స్వయం కృషి తో నాయకత్వాన్ని ఒప్పించి మెప్పించి దేశ వ్యాప్తంగా గొప్ప నాయకుడిగా అందరికీ అందుబాటులో ఉంటూ ప్రధాన మంత్రి వరకు ఎదిగిన వ్యక్తి.. మెజారిటీ ప్రభుత్వం కానప్పటికీ 5 సంవత్సరాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం నడిపిన పీవీ నరసింహారావు గారిని కొనియాడుతున్నని అన్నారు.రాజకీయాల్లో కేంద్రంలో బీజేపీ పార్టీ చరిత్రను మరిచివేసే విధంగా జవహర్ లాల్ నెహ్రూ ,మహాత్మా గాంధీ లాంటి జాతిపిత ల పేరు చరిత్రలో లేకుండా చేసే ప్రయత్నం జరుగుతుంది..రాజకీయంగా లబ్ధి పొందాలని వల్లబ్ బాయ్ పటేల్, పీవీ నరసింహారావు లాంటి వారు పుట్టుక నుండి మరణం వరకు కాంగ్రెస్ పార్టీ లో కొనసాగిన వారిని బీజేపీ రాజకీయంగా వాడుకోవాలని చూస్తుందని అన్నారు.జీవించి ఉన్నప్పుడు చేసే రాజకీయాలు వేరు మరణించిన తర్వాత బీజేపీ ఇలాంటి రాజకీయాలు తగదు. పీవీ నరసింహారావు విధానాలు వారు చూపిన మార్గదర్శకత్వాన్ని ముందుకు తీసుకోవాలి. పీవీ నరసింహారావుకు ఘన నివాళులు అర్పిస్తున్ననని అన్నారు. .

## జనవరి 4న'సిటీ కుక్' పోటీలు

రేడియో సిటీ 91.1 ఎఫ్ఎం ఆధ్వర్యంలో వచ్చే నెల 4వ తేదీన రేడియో సిటీ సిటీ కుక్ పేరుతో వంటల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఇందుకు సంబందించిన సన్నాహక కార్యక్రమంలో భాగంగా మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని రేడియో సిటీ కార్యాలయంలో సినీ హీరో నాగశౌర్య తల్లి, ఉషా ముల్పూరి కిచెన్స్ వ్యవస్థాపకురాలు ఉషా ముల్పూరి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమం బ్రోచర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేడియో సేల్స్ హెడ్ విలాష్, ఆర్జే పోటుగాడు(దినేష్)లు మాట్లాడుతూ ఈ వంటల పోటీల్లో పాల్గొనే వారు ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని పోటీల్లో పాల్గొన్న వారందరికీ బహుమతులు అందజేయడంతో పాటు విజేతలకు ప్రత్యేక బహుమతులు అందిస్తామని వెల్లడించారు.

# కేసీఆర్ ను నమ్మేదెలా...?

**హైదరాబాద్, డిసెంబర్ 23:** బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ మళ్లీ యాక్టివ్ కానున్నారన్నది ఆ పార్టీ నేతలకే నమ్మకం కలగడం లేదు. ఎందుకంటే పార్టీ ఆవిర్భావ సభలో వరంగల్ లో ఇక జనంలోనే ఉంటానని చెప్పిన కేసీఆర్ నిన్నటి వరకూ బయటకు రాలేదు. ఇప్పుడు మరోసారి వచ్చి ఇదిగో వస్తున్నానంటే నమ్మడానికి పార్టీ నేతలు కానీ, కార్యకర్తలు కాని మానసికంగా సిద్ధంగా లేరు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో వరంగల్ లో జరిగిన పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో కూడా ఇలాగే ప్రకటన చేశారు. కానీ ఆవిర్భావ దినోత్సవాలు జరిగి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఫామ్ హౌస్ గడప దాటలేదు. వరంగల్ సభలో కూడా ఆవేశంగా ప్రకటించిన కేసీఆర్ తర్వాత అయితా పయితా లేరు. అదే విషయాన్ని ఇప్పుడు కార్యకర్తలు గుర్తుకు తెస్తున్నారు.దాదాపు చాలా రోజుల తర్వాత తెలంగాణ భవన్ కు వచ్చిన కేసీఆర్ పార్టీ నేతల సమావేశంలో ఆవేశంగా మాట్లాడారు. నల్లగొండ, మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించాలని ఆదేశించారు. అయితే ఈ మూడు సభలకు కేసీఆర్ హాజరవుతారా? లేదా? అన్నది ఇప్పటికీ అందరికీ అనుమానమే. కానీ తాను వస్తానని చెప్పి అన్ని ఏర్పాట్లు చేయమంటారు. కానీ వచ్చేంత వరకూ నమ్మకం లేదన్నది బీఆర్ఎస్ నేతల నుంచి వినిపిస్తున్న మాట. అయితే ఇక కేసీఆర్ బయటకు రాకపోతే అసలుకే ఎసరు తప్పదన్న



భయం నేతల్లో ఇప్పటికే నెలకొని ఉంది. ఇప్పటికే అన్ని ఎన్నికల్లో ఓటమి పాలయిన బీఆర్ఎస్ ఇక కేసీఆర్ బయటకు రాకపోతే మరింత క్యాడర్ నీరుగారిపోతుందని తెలుసు.బీఆర్ఎస్ వర స ఓటములతో పాటు కుమార్తె కల్వకుంట్ల కవిత ఇప్పటికే యాత్ర పేరిట జనంలోకి వెళు తున్నారు. సామాజికయాత్ర పేరుతో తెలంగాణలో పర్యటిస్తూ పార్టీ నేతలపైనే విమర్శలు చేయడాన్ని కనీసం కేసీఆర్ ఖండించకపోవడం కూడా విమర్శలకు దారి తీస్తుంది. శాసనసభ ఎన్నికల్లో ఓటమి పాలయి రెండేళ్లు దాటుతున్నప్పటికీ పార్టీ అధినేత కేసీఆర్ కార్యకర్తలను కలిసేందుకు ఇష్టపడకపోవడం కూడా పార్టీపై ఎఫెక్ట్ పడనుందని చెబుతున్నారు. కేసీఆర్ ఫాం హౌస్ వదిలి జనంలోకి రావాలని క్యాడర్ కోరుకుంటున్నారు. కానీ కేసీఆర్ ను చూస్తుంటే ఇప్పట్లో కదిలేలా కనిపించడం లేదు. మరి కేసీఆర్ మీడియా సమావేశంలో చెప్పినట్లు బయటకు వస్తారా? రారా? అన్న చర్చ పార్టీలో జరుగుతుంది.

**పొన్నం కౌంటర్**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ మీడియా సమావేశంలో కూర్చుని తోలు తీస్తామంటే ఊరుకోబోమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలోనే డీపీఆర్ వెనక్కు వచ్చిందని అన్నారు. నిజంగా నీటి పారుదల శాఖపై చర్చించాలంటే అసెంబ్లీ సమావేశాలకు రావాలని కోరారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై చర్చించడానికి తాము కూడా సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు.ప్రజలు మీ తోలు తీసినా మీలో మార్పు రాలేదన్నారు. కేసీఆర్ పాతపురాణాన్ని వల్లె వేశారన్నారు. దద్దమ్మ పాలన చేసింది తాము కాదని,మీరేనని పొన్నం ప్రభాకర్ అన్నారు. మీ హయాంలో డీపీఆర్ వెనక్కు వచ్చినప్పుడు నిద్రపోతున్నారా? అని ప్రశ్నించారు. జగన్, మోదీతో అంటకాగినప్పుడు ఏమయిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. ఇప్పటికే మీ బిడ్డ కవిత నీ తోలు తీస్తుందని మండి పడ్డారు.

# పావు వంతు లెక్చరర్లతో చదువు సాగేదెలా...

**హైదరాబాద్, డిసెంబర్ 23:** రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల పరిస్థితి దారుణంగా తయారైంది. సరిపడ బోధనా సిబ్బంది లేక సర్కారు కాలేజీల పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. ఉన్నత విద్యను ప్రభుత్వం పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఖాళీ అవుతున్న పోస్టులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు భర్తీ చేయకపోవడంతో డిగ్రీ కాలేజీల్లో బోధించే అధ్యాపకుల సంఖ్య ప్రతి ఏటా తగ్గిపోతోంది.రెగ్యులర్ అధ్యాపకులను నియ మించకుండా వారి స్థానంలో గెస్ట్, కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమించుకొని నెట్టుకొస్తున్నారు. కాలేజీల్లో సరి పడా సిబ్బంది లేకపోవడంతో తమ పిల్లలను ఆ కాలేజీల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు పెద్దగా సుముఖత చూపించడంలేదు. డిగ్రీ కాలేజీల్లోని కీలక పోస్టులైన ప్రిన్సిపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో 149 డిగ్రీ కాలేజీలుంటే, వీటిలో 4,520 పోస్టులకు పనిచేస్తున్నది మాత్రం కేవలం 1,695 మందే. 2,825 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఇందులోనూ 2,570 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉండడం గమనార్హం. ఈ 2,570 పోస్టుల్లో 50 శాతం డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా, మరో 50 శాతం జూనియర్ లెక్చరర్లను ప్రమోషన్ల ద్వారా భర్తీచేస్తారు. అంతేకాకుండా 145 ప్రిన్సిపాల్ పోస్టులకు గానూ ప్రస్తుతం పని చేస్తున్నది కేవలం 84 మందే.మిగతా పోస్టులు ఖాళీనే. ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు 133 ఉంటే కేవలం 23 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇంకా 110 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యార్థులను ఆటలు ఆడించే పరిస్థితే లేదు. లైబ్రేరియన్ పోస్టులు 133 ఉంటే, ఏకంగా 90 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. పనిచేస్తున్నది 43 మంది మాత్రమే. ఇలా ప్రధాన పోస్టుల్లో సిబ్బంది లేక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు కునారిళు తున్నాయి. ఉన్నవారినే ఇన్చార్జిలుగా పెట్టి కళాశాలలను నెట్టుకొస్తున్న పరిస్థితి ఉంది. సరిపడ అధ్యాపకులు కాలేజీల్లో లేకపోవడంతో అడ్మిషన్లు తీసుకునేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఇష్టపడంలేదు. పేరున్న మంచి కాలేజీల్లో సీట్లు నిండితున్నా మిగతా కాలేజీల్లో అయితే నిండడం కష్టంగానే మారింది. ఈ ఏడాది కాలేజీల్లో సీట్లు అంతంత మాత్రంగానే నిండాయి. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో దాదాపు 90 వేల సీట్లుంటే



51 వేల అడ్మిషన్లు మాత్రమే నిండాయి.సిబ్బంది కొరత, సరైన వసతులేకపోవడంతో ఇంటర్ తర్వాత చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ డిగ్రీ కాలేజీల్లోనే చేరుతున్నారు. ప్రైవేట్ కాలేజీల్లో దాదాపు 1.22 లక్షల మంది చదువుతున్నారు. ప్రైవేట్ వైపు విద్యార్థులు మళ్లకుండా ఉండాలంటే ప్రభుత్వం అధ్యాపక పోస్టులను భర్తీ చేయడంతోపాటు కాలేజీల్లో ల్యాబ్లు, ఇతర వసతులను కల్పించాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

# కార్పొరేషన్‌గా హైదరాబాద్ మెట్రో!

- స్వయం ప్రతిపత్తి.. నిర్వహణ, నిధులు అంతా కార్పొరేషన్‌కే
- ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ తరహాలో ఏర్పాటు
- రెండోదశకు భూసేకరణ అవసరం తక్కువే
- ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట ప్రాంతాల్లోనే 70 శాతం..
- మిగతా చోట్ల 30 శాతం సరిపోతుందంటున్న హెచ్ఏఎంఎల్

**హైదరాబాద్** : హైదరాబాద్లో మెట్రో రైలు నెట్‌వర్క్ భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో కార్యకలాపాలను సమర్థంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త అడుగులు వేస్తోంది. జీహెచ్ఎంసీ పరిధిని ఔటర్ రింగ్ రోడ్డు దాటి విస్తరించడంతో మెట్రో రైల్ నెట్‌వర్క్ ను కూడా ఆ మేరకు 400 కి.మీ మేర విస్తరించాలన్న ప్రణాళికలు ఉన్న నేపథ్యంలో మెట్రో నిర్వహణ కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, దానికి స్వయం ప్రతిపత్తి కల్పించాలని భావిస్తోంది. ఢిల్లీలో మెట్రో రైలు నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్సీ) తరహాలోనే హైదరాబాద్ మెట్రో రెండోదశ ప్రాజెక్టుకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు సమీకరించాలని చూస్తున్నాయి. మొత్తం పనులన్నీ పూర్తయ్యాక మొదటిదశ, రెండోదశను కార్పొరేషనే పర్యవేక్షించనుంది. ఇక ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రెండోదశ మెట్రో విస్తరణకు భూ సేకరణ తక్కువ అవసరమవుతుందని, హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ (హెచ్ఏఎంఎల్) వర్గాలు చెబుతున్నాయి. నాగోల్, ఎల్బీనగర్ మీదుగా విమానాశ్రయం వరకు నిర్మిస్తున్న కారిడార్‌కు, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు చేపడుతున్న మరో కారిడార్‌కు మాత్రమే 70 శాతం భూములను సేకరించాల్సి ఉంటుందని, ఇతర మార్గాల్లో 30 శాతం సరిపోతోందని చెబుతున్నాయి. మెట్రో సెకండ్ ఫేజ్‌లో భాగంగా పార్ట్-ఏ కింద ప్రతిపాదించిన 5 కారిడార్లలోని 76.4 కిలో మీటర్ల కోసం రూ.24,269 కోట్లు, పార్ట్-బీ కింద ప్రతిపాదించిన 3 కారిడార్లలోని 86.1 కి.మీ కోసం రూ.19,579 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. మొత్తం ప్రాజెక్టును 50:50 జాయింట్ వెంచర్‌గా చేపట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే నిర్ణయించాయి. మొత్తం ఎనిమిది కారిడార్లకు సంబంధించిన డిటైల్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) హెచ్ఏఎంఎల్ అధికారులు కొన్ని నెలల క్రితం కేంద్ర ప్రభుత్వానికి పంపారు. అక్కడి నుంచి అనుమతి కోసం ఎదురుచూస్తున్నారు.

**1.20 లక్షల చదరపు మీటర్లతో సెకండ్ ఫేజ్!**

ఎల్బీనగర్-మియాపూర్, జేబీఎస్-ఎంజీబీఎస్, నాగోల్-రాయదుర్గం కారిడార్లలో మొదటిదశ ప్రాజెక్టును చేపట్టిన విషయం తెలిసిందే. ప్రైవేట్ పబ్లిక్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో చేపట్టిన ఎల్అండ్‌టీకి ట్రాన్సిట్ ఓరియెంటెడ్



డెవల్‌పమెంట్ (టీఓడీ) కింద నగరంలోని వివిధ ప్రాంతాల్లో 269 ఎకరాలు కేటాయించింది. ఫలక్‌నుమా ప్యాలెస్ వద్ద ఇస్తామని చెప్పిన 57 ఎకరాలను అప్పటి ప్రభుత్వం ఇవ్వలేదు. దీంతో ఎల్అండ్‌టీ తమకు ఇచ్చిన 212 ఎకరాల్లోనే కమర్షియల్ డెవల్‌పమెంట్ చేసింది. ఇందులో భాగంగా ఆయా భూముల్లో హైటెక్ సిటీ, రాయదుర్గం, ఎర్రమంజిల్, పంజాగుట్ట, మూసారాంబాగ్‌లో ఐదుచోట్ల మాల్స్‌ను నిర్మించింది. ఇంకా కొన్నిచోట్ల ఇప్పటికీ ఖాళీ స్థలాలున్నాయి. రెండోదశలో ప్రతిపాదించిన పనులకు మొత్తం 1.20 లక్షల చదరపు మీటర్ల భూములు అవసరపడతాయని హెచ్ఏఎంఎల్ వర్గాలు చెబుతున్నాయి. ఎల్అండ్‌టీ నుంచి మొదటి దశ ప్రాజెక్టును టేకోవర్ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం దానికి ఇచ్చిన 212 ఎకరాల ఆదాయ వనరులతోనే సెకండ్ ఫేజ్‌ను పూర్తి చేయాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ఇక మెట్రో రెండోదశలో భాగంగా నాగోల్, ఎల్‌బీనగర్ మీదుగా ఎయిర్‌పోర్టు వరకు 36.8 కిలోమీటర్ల మేర ప్రతిపాదించారు. రాయదుర్గం నుంచి కోకాపేట్ నియోపోలీస్ వరకు 11.6 కిలోమీటర్ల మేర, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మేర, మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు 13.4 కిలోమీటర్ల మేర, ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు 7.1 కిలోమీటర్ల మేర చేపడుతున్నారు. జేబీఎస్ మెట్రోస్టేషన్ నుంచి మేడ్చల్ వరకు 24.5 కిలోమీటర్ల మేర, జేబీఎస్ మెట్రోస్టేషన్ నుంచి శామీర్‌పేట్ వరకు 22 కిలోమీటర్ల మేర శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి భారత్ ఫ్యూచర్‌సిటీ వరకు 40 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్నారు.

## విద్యార్థులతో విద్యార్థిని కొట్టించిన టీచర్లు



**కుత్బుల్లాపూర్:** ఏడో తరగతి విద్యార్థిపై అదే స్కూల్లో చదువుతున్న విద్యార్థులతో దాడి చేయించిన సంఘటన పేట్బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కొంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో శివరామకృష్ణ కుమారుడు సూర్య 7వ తరగతి చదువుతు న్నాడు. అతన్ని విద్యార్థులు పార్కు చేసిన సైకిళ్ల వద్దకు వెళ్లి చూసి రమ్మని ఉపాధ్యాయుడు మధు చెప్పడంతో చూసొచ్చాడు. అయితే సూర్య సైకిళ్ల వద్దకు వెళ్లి వస్తున్నాడని మరో ఉపాధ్యాయుడు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, దుండిగల్ మండల ఎంఈవో కృష్ణ వద్దకు తీసుకెళ్లాడు. ఆయన ఆగ్రహించి 10వ తరగతి విద్యా ర్థులను పిలిచి బాలుడి వీపుపై కొట్టాలని ఆదేశించారు. దీంతో వారు రెచ్చిపోయి కర్రతో విపరీతంగా దాడి చేశారు. ఈ విషయం బయట చెబితే పాఠశాల నుంచి టీసీ ఇచ్చి పంపిస్తానని హెచ్ఎం బెదిరించాడు. దెబ్బలు తట్టుకోలేక సూర్య రాత్రి నీరసంగా ఉండటంతో తల్లిదం డ్రులు గుర్తించి ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. ఈ విషయమై పాఠ శాల ప్రధానోపాధ్యాయులు కృష్ణను సంప్రదించగా తానే విద్యార్థులను పిలిపించి కొట్టుమని చెప్పా నని, కానీ అంత పెద్దగా కొడతారని అనుకోలేదని ప్రిన్సిపాల్ నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చాడు.

## ఆర్టీయే అధికారి నివాసాలపై ఏసీబీ దాడులు...



**సికింద్రాబాద్:** మహబూబ్ నగర్ అదనపు రవాణా కమిషనర్ ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు జరిపారు. అదనపు రవాణా కమిషనర్ కిషన్ నాయక్ ఇంట్లో సోదాలు జరిగాయి. బోయిన్ పల్లి లోని ఆర్ఆర్ నగర్ లో కిషన్ నాయక్ నివాసం వుంటున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల విషయంలో ఏసీబీ కేసు నమోదు చేసింది. హైదరాబాద్, మహబూబ్ నగర్,రంగారెడ్డి తో పాటు 12 చోట్ల సోదాలు ఏసీబీ అధికారులు నిర్వహించారు. కిషన్ నాయక్ తో పాటు మరో నలుగురు అధికారుల ఇళ్లలో సోదాలు జరిగాయి.

# జాతీయ గణిత దినోత్సవాన్ని కార్యక్రమంలో విద్యార్థులు





**హైదరాబాద్: (స్కై న్యూస్) డిసెంబర్ 23:**నారాయణ పాఠశాల హస్తినాపురం ఎల్బీనగర్ డివిజన్ పరిధిలో బి.యన్.రెడ్డి **నారాయణ ఉన్నత పాఠశాల, డిసెంబర్ 22** భారతీయ గణిత శాస్త్రజ్ఞుడు శ్రీ శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని, డిసెంబర్ 22, 2025న పాఠశాల ప్రాంగణంలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఎంతో ఉత్సాహంగా మరియు మేధో స్ఫూర్తితో జరుపుకున్నారు.జ్ఞానం మరియు జ్ఞానోదయానికి ప్రముఖులచే ఘనంగా దీపం వెలిగించే కార్యక్రమంతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శారద, ప్రిన్సిపాల్ అనిల్ కుమార్ వైస్ ప్రిన్సిపాల్స్ విజయ లక్ష్మి, శిల్ప, ఏడిఈ శ్రీదేవి, , ఏ.వో ఎస్. రాజేష్ మరియు కరుణాకర్ డీఎన్ జోన్ కోఆర్డినేటర్లు శరత్, గాయత్రి, ఆర్%ఎ% డి శు వరంజని %ఎ% మహేశ్వరి ప్రతినిధి, జీఎం గోపాల్ రెడ్ మరియు ఏజీఎం హేమెంబర్, ఆర్ ఐ రవి ప్రసాద్ పాల్గొన్నారు, వారు ఈ సందర్భానికి ప్రతిష్టను జోడించారు.ప్రధానోపాధ్యాయులు తమ ప్రసంగాలలో, రోజువారీ జీవితంలో గణితం యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేశారు మరియు రామానుజన్ స్ఫూర్తిదాయక ప్రయాణాన్ని నొక్కి చెప్పారు, విద్యార్థులు తార్కిక ఆలోచన మరియు సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ప్రోత్సహించారు."గణిత మానియా" అనే ప్రత్యేక విభాగం గణిత పట్టికలు, గణిత క్విజ్, గణిత కార్యకలాపాలు, గణిత రంగోలి మరియు గణిత ఫ్యాన్సీ దుస్తుల పోటీలు వంటి వివిధ ఆకర్షణీయమైన కార్యకలాపాలతో ప్రేక్షకులను ఆకర్షించింది. వివిధ తరగతుల విద్యార్థులు చురుకుగా పాల్గొని వారి సృజనాత్మకత, విశ్వాసం మరియు సంఖ్యా నైపుణ్యాలను ప్రదర్శించారు.సాంస్కృతిక కార్యక్రమంలో తరగతి 6 తరగతి – పరమానందయ్య శిష్యుల కథ మరియు తరగతి – 5వ తరగతి కృష్ణదేవరాయల స్కిట్, అలాగే తరగతి %×% మరియు తరగతి %×××% ల ఉత్సాహభరితమైన ఫ్యాన్సీ దుస్తుల ప్రదర్శనలు ఉన్నాయి, దీనికి ప్రేక్షకుల నుండి గొప్ప ప్రశంసలు లభించాయి.బహుమతి పంపిణీ కార్యక్రమంతో వేడుక ముగిసింది, ఇక్కడ విజేతలను వారి అత్యుత్తమ ప్రదర్శనలకు సత్కరించారు. గణితం కేవలం ఒక విషయం కాదు, ఆలోచనా విధానం, విద్యార్థులను ప్రేరేపించడం అనే ఆలోచనను ఈ కార్యక్రమం విజయవంతంగ చేయడం జరిగింది

# విజయవంతమైన సైన్స్ ఫెయిర్



**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 23 (స్కై న్యూస్):**జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 53వ సైన్స్ ఫెయిర్ విజయవంతం అయింది. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల నుండి 286 సైన్స్ ఎగ్జిబిట్స్ ప్రదర్శించారు. ఈ సైన్స్ పేరుకు దాదాపు పదివేల మంది విద్యార్థులు హాజరై పరిశీలించారు. సైన్స్ ఫెయిర్ ను ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి విజయుడు కలెక్టర్ బి ఎం సంతోష్ ప్రారంభించారు. పాఠశాలలో ప్రదర్శనమైన వాటిలో రాష్ట్రస్థాయి ఎంపిక జరుగుతుందని అనంతరం జాతీయస్థాయిలో ప్రదర్శనలు ఉంటాయని సైన్స్ ఫెయిర్ జిల్లా కన్వీనర్ భాస్కర్ పాపన్న తెలిపారు. గత ఏడాది ప్రదర్శించిన వాటిలో మాంటిసోరి స్కూలు నుండి జాతీయస్థాయిలో పాల్గొనడం జరిగిందన్నారు. ముఖ్యంగా వ్యర్థ పదార్థాల నుండి విద్యుత్ తయారీ సోలార్ వాడకం ప్లాస్టిక్ నిరోధం తదితర వాటిని ప్రదర్శించారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మరోసారి బాంబ్ బెదిరింపుల ఈమెయిల్



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, డిసెంబర్ 23 :-** రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మరోసారి బాంబ్ బెదిరింపుల ఈమెయిల్ రావడంతో పోలీసులు అలర్ట్ అయ్యారు తరచుగా వస్తున్న ఫేక్ బాంబ్ బెదిరింపు మెయిల్స్‌పై పోలీసులు సీరియస్ అయ్యారు ఈ ఏడాది ఒక్క శంషాబాద్ ఎయిర్‌పోర్టుకే దాదాపు 28 సార్లు బాంబు బెదిరింపులు వచ్చాయి వెంటనే అప్రమత్తమై అన్ని చెకింగ్స్ చేశాకా అది ఫేక్ మెయిల్స్‌గా భద్రత సిబ్బంది నిర్ధారించారు ఇప్పటికే బాంబ్ బెదిరింపులపై ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్‌లో 28 కేసులు నమోదు అయ్యాయి ఈ కేసులపై లోతుగా దర్యాప్తు చేసేందుకు పోలీసులు నిర్ణయం తీసుకున్నారు వీటిని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేయాలని ఆర్జీఐఏ పోలీసులు యోచిన్నట్లు తెలుస్తోంది డార్క్ వెబ్ ఉపయోగించి మరీ కేటుగాళ్లు ఈ ఫేక్ మెయిల్స్ పంపిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు దీంతో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫేక్ బాంబ్ బెదిరింపుల కేసులు బదిలీ చేయాలని ఎయిర్‌పోర్టు పోలీసులు భావిస్తున్నారు ఏది ఏమైనా పదే పదే విమానాశ్రయంలో బాంబు ఉన్నట్లు బెదిరింపు మెయిల్స్ రావడంపై ప్రయాణికులు తీవ్ర అసహనం, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు అలాంటి మెయిల్స్ పంపిస్తున్న వారిని వెంటనే పట్టుకుని తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు

# ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ వహించాలి

**మెరుగైన సమాజ నిర్మాణానికి కృషి**

**నాగర్ కర్నూల్ డిసెంబర్ 23( స్కై న్యూస్)** బాలికలు విద్యతో పాటు ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించి కోరారు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అమెరికా తెలుగు అసోసియేషన్ అధ్యక్షులు జయంత్చెర్ల మానవత ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రమ్య సౌజన్య కోరారు మంగళవారం తాడూర్ కేజీబీవీ విద్యార్థులకు పర్యావరణహిత సానిటరీ పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ మాట్లాడుతూ బాలికలు బాల్యం నుంచి యుక్త వయసులోకి అడుగుపెట్టినప్పుడు రుతు చక్రం ప్రారంభమవుతుందని శరీరంలో పలు మార్పులు చోటు చేసుకుంటాయని మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ జాగ్రత్తలు తీసుకొని సంపూర్ణ ఆరోగ్యంతో పాటు పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని కోరారు బాలికలు విద్యతో పాటు ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని చెడు అలవాట్లకు బానిసలు కాకుండా ఆకర్షణలకు లోను కాకుండా విద్యపై భవిష్యత్తు లక్ష్యాలను నిర్ధారించుకొని జీవించాలన్నారు. నాసా కిడ్స్ లో సానిటరీ నాప్కిన్సు సబ్బులు అవసరమైన సామాగ్రి పంపిణీ చేశారు ఈ సందర్భంగా దాతలను ఆయన అభినందించారు సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి




మాట్లాడుతూ ప్రభుత్వం బాలిక విద్యను ప్రోత్సహించేందుకు అనేక పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని వాటిని సద్వినియోగం చేసుకొని అన్ని రంగాలలో మహిళలు రాణించాలని ఆకాంక్షించారు. బాలికలను ప్రోత్సహించేందుకు ఆట ప్రతినిధులు ముందుకు రావడం అందుకు గ్రామీణ ప్రాంతాలలోని పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించేందుకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అమెరికా తెలుగు అసోసియేషన్ అధ్యక్షులు జయంతి చెల్లా మాట్లాడుతూ సమాజంలో బాలికల ఆరోగ్యం పై మరియు విద్యపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు మానవతా ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ రమ్య సౌజన్య మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఏకో శానిటరీ కప్స్ వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రవి నాయక్ కేజీబీవీ పర్యవేక్షణ అధికారిని శోభారాణి తాడూరు మండల విద్యాధికారి త్యాగరాజు గౌడ్ కేజీబీవీ ప్రత్యేక అధికారిని విజయ తదితరులు పాల్గొన్నారు

# యాసంగిలో కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులకు సాగునీరందిస్తాం....



**దేవరకద్ర డిసెంబర్ 23 (స్కై న్యూస్):** మహబూబ్ నగర్ జిల్లా కలెక్టరేట్ లో కోయిల్ సాగర్ ఆయకట్టు రైతులకు యాసంగిలో సాగునీరు అందించేందుకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఇరిగేషన్ శాఖ అధికారులు.అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ కోయిల్ సాగర్ ప్రాజెక్టు కింద ఆయకట్టు రైతులకు ఈ యాసంగిలో 5 విడతలుగా సాగు నీరందిస్తామన్నారు. తొలివిడత జనవరి 5వ తేదీన నీటిని విడుదల చేస్తామని తెలియజేశారు.

# మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకం పేరును కొనసాగించండి

**హైదరాబాద్( స్కై న్యూస్ )డిసెంబర్ 23** కేంద్ర ప్రభుత్వం 2005లో పెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పేరుతో పథకాన్ని కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ గాంధీ స్మారకనిది జీవీ సుబ్బారావు మరియు కార్యదర్శి కోదాటి రంగారావు ప్రకటనలు తెలియజేస్తూ మహాత్మా గాంధీ పేరుని తొలగించడం సరియైన నిర్ణయం కాదని కేంద్ర ప్రభుత్వం పునరుల ఆలోచన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు స్వాతంత్ర ఉద్యమంలో నుంచి మహాత్మా గాంధీ సేవలను కొనసాగిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలను పేరును ఉన్న వాటిని యధావిధిగా కొనసాగిస్తూ కొత్తగా ప్రవేశపెట్టి పథకాలను కూడా మహాత్మా గాంధీ పేరు పెట్టాలని వారి కోరారు కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం మహాత్మా గాంధీ పేరు తొలగించదని వారి కోరారు

# వివిధ అభివృద్ధి పనులలో పాల్గొన్న ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి



**దేవరకద్ర కొత్తకోట డిసెంబర్ 23 (స్కైన్యూస్):** కొత్తకోట మండలం సంకిరెడ్డి పల్లి గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి, సిసి రోడ్ల నిర్మాణానికి నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని కృష్ణ సముద్రం చెరువులో రాష్ట్ర ప్రభుత్వం, మత్స్య శాఖ ఆధ్వర్యంలో 100% సబ్సిడీతో చేప పిల్లలను వదిలే కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు గృహ నిర్మాణ లబ్ధిదారులు మత్స్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఎం బి సీయోను చర్చిలో క్రిస్మస్ వేడుకలు

**ఎంబి కాన్ఫరెన్స్ లోని 420 మంది సేవకులకు క్రిస్టమస్ గిఫ్టులు ప్రధానం చేశారు**



**చిన్న చింతకుంట డిసెంబర్ 23 (స్కై న్యూస్):** చిన్న చింతకుంట మండల కేంద్రము లోని ఎంబి సీయోను చర్చ్ లో ఎంబి గవర్నింగ్ కౌన్సిల్ జి సి ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.జి సి సెక్రెటరీ రూపస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జి సి, ప్రసిడెంట్ రెవ.డాక్టర్.ఐపి ఆశీర్వాదం హాజరై క్రీస్తు జన్మదిన విశిష్ట గురించి అమూల్యమైన సందేశం అందించారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపి సమావేశానికి హాజరైన ఎంబి కాన్ఫరెన్స్ లోని సేవకులు దాదాపు 420 మందికి క్రిస్మస్ గిఫ్ట్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జి సి ట్రెజరర్ టైటస్ రాజేందర్,బోర్డు ఆఫ్ ఎడ్యుకేషన్ చైర్మన్ జి.యెనా,ఎగ్జిక్యూటివ్ మెంబర్ బి.తిమోతి, ఎంఎస్.హ్యాపీ పాల్,సువార్త బోర్డు అధ్యక్ష కార్యదర్శులు రెవ.శాంతి దాత , రెవ. జేవియర్, ఎం బి డి ఓ, అధ్యక్ష కార్యదర్శులు మారాడోనా,ఎస్.శేఖర్ స్థానిక పాస్టర్ రెవ.గిద్యోన్,చైర్మన్ జి.మోష చిన్న చింతకుంట ఫీల్డ్ చైర్మన్ రెవ.ఎస్.బి.జోసెఫ్ మక్తల్ ఫీల్డ్ చైర్మన్ ఈ.ప్రసాద్ అమరచింతా ఫీల్డ్ వైస్ చైర్మన్ రెవ. సి ఏ.జెర్మియా చిన్న చింతకుంట ఎంబి సీయోను చర్చ్ నాయకులు జి. పిలొగు,జి.ప్రతాప్, ఎల్ ఎం రాజు యాకోబు,ప్రవీణ్, యూత్ నాయకులు మరియుఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోనీ వివిధ సంఘాల పాస్టర్లు నాయకులు విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని భారతరత్న పివికి ఘన నివాళి....



**నాగర్ కర్నూల్ డిసెంబర్ 23( స్కై న్యూస్)** మాజీ ప్రధాని దివంగత నేత పివి నరసింహారావు 21వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆయన విగ్రహానికి జై పరశురాం సేవా సంస్థ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ బహుభాషా కోవిదుడు అపరచానిక్యుడు పీవీ నరసింహారావు ఆధ్వర్యంలో ఉమ్మడి రాష్ట్ర అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయన ప్రధానిగా ఉన్న సమయంలో ఆర్థిక పారిశ్రామిక విదేశాంగ వ్యవసాయక రంగాలలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి ప్రపంచంలోనే దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చారని కొనియాడారు ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు పెంటమ్మరాజు జగన్మోహన్రావు వెంకటరావు మురళీధర్ రావు ప్రకాష్ వంశీమోహన్ అశోక్ తదితరులు పాల్గొన్నారు

# ఆశ వర్కర్స్ వేతనాల కోసం పి హెచ్ సి ముందు ధర్నా

**ఆశల పెండింగ్ వేతనాలు ఇవ్వాలి సి ఐ టి యు జిల్లా అధ్యక్షులు ఆర్ ఎన్,రమేష్ డిమాండ్**



**దేవరకద్ర, అమరచింత డిసెంబర్ 23 (స్కై న్యూస్):** అమరచింత మండల కేంద్రంలోని డిఎంఆర్ హాస్పిటల్ ముందు తిప్పడంపల్లి పిహెచ్సి సంబంధించిన ఆశా వర్కర్లు సిఐటియు ఆధ్వర్యంలో పెండింగ్ వేతనాలు ఇవ్వాలని పిక్సుడు వేతనం ప్రకటించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం డిఎంఆర్ హాస్పిటల్ ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా 24 డిమాండ్స్ తో కూడిన వినతి పత్రాన్ని తిప్పడం పల్లి మెడికల్ ఆఫీసర్ ఫయాజ్ కి ఇవ్వడం జరిగింది. ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ ఎన్,రమేష్ మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న లెప్రసీ డబ్బులని ఇవ్వాలని డిమాండ్ చేశారు. పల్స్ పోలియో డబ్బులు, ఎలక్షన్ డ్యూటీ డబ్బులు, నేటికీ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదని వెంటనే విడుదల చేయాలని కోరారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీని ఆశలకి 18 వేల ఫిక్స్ వేతనం ఇస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించినట్టు ఆశలకి 18,000 ఫిక్స్ వేతనం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన హామీలని నెరవేర్చకుంటే రాబోయే కాలంలో ప్రభుత్వాన్ని నడిరోడ్డుపై నిలేస్తామని హెచ్చరించారు. ఆశాల సమస్యలను పరిష్కరించకుంటే ఈనెల 27న చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు. ఈ నెల 27 లోపు ఆశాల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్ అధికార యంత్రాంగం స్పందించాలని లేదంటే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం కొనసాగుతుందని హెచ్చరించారు. కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో జిల్లా ఆశా వర్కర్లందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా ఆశా వర్కర్లకి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ జిల్లా నాయకురాలు శాంతమ్మ సత్యమ్మ నవనీత పుష్పలత, పుష్పమ్మా, గోపాలమ్మ, నిర్మల పద్మ, ఈశ్వరమ్మ, సుధా,స్రవంతి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# హిందువుల పై దాడులు చేస్తే సహించేది లేదు

**పేటలో బంగ్లాదేశ్ దిష్టిబొమ్మ దహనం**



**నారాయణపేట డిసెంబర్ 23: (స్కైన్యూస్)** ప్రపంచ దేశాల్లో ఉన్న హిందువులపై దాడులు చేస్తే సహించేది లేదని విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్ నాయకులు హెచ్చరించారు. బంగ్లాదేశ్ లో హిందూ యువకుడు దీప్ దాస్ ను కొంతమంది అకారణంగా హత్య చేసి కిరాతకతంగా లాక్కెళ్ళి చెట్టుకి వేలాడదీసి నిప్పంటించి న ఘటనను తీవ్రంగా ఖండిస్తు మంగళ వారం నారాయణపేట జిల్లా కేంద్రంలో అఖిల భారత విశ్వహిందూ పరిషత్ పిలుపు మేరకు జిల్లా విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్ ఆధ్వర్యంలో (జస్టిస్ ఫర్ బంగ్లాదేశ్ హిందూస్) అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెయిన్ చౌక్ నుంచి సత్యనారాయణ చౌరస్తా వరకు పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టి సత్యనారాయణ చౌరస్తాలో బంగ్లాదేశ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హిందువుల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరిం చారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఘటనను పరిగణలోకి తీసు కొని హిందువులపై దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సత్య యాదవ్, సురేఖ రాంబాబు, ఉమాదేవి, కడేచుర్ రజిత, డాక్టర్ మదన్మోహన్ రెడ్డి, స్వాతి, కన్న శివకుమార్, భీమ్ చంద ర్ గౌడ్, మురళి భట్టడ్, మనోహర్ ప్రసాద్ గౌడ్, గందె చంద్రకాంత్, శిరీష చెన్నారెడ్డి, పోషల్ వినోద్, సత్య రఘుపాల్, ప్రవీణ్ , కాకర్ల భీమయ్య, మిర్చి వెంకటయ్య, చంద్రశేఖర్, పోషల్ సంతోష్, సంపంగి కృష్ణ, రఘువీర్ యాదవ్, చంద్రశేఖర్, శ్రావణ్, చరణ్ రెడ్డి, నరేష్, బొంబాయి బాలాజీ, ఆకాష్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుని సన్మానించిన విద్యా ర్థులు



**నారాయణపేట డిసెంబర్ 23: (స్కైన్యూస్)** నారాయణపేట మండలం ఎక్లాశ్ పూర్ లో మంగళవారం నారాయణ పేట శ్రీ సాయి స్కూల్ విద్యార్థులు రైతును సన్మానించారు. విద్యార్థుల క్షేత్ర పర్యట నలో భాగంగా ప్రియమైన గ్రామము అనే పాఠం లోని వివిధ చేతి వృత్తుల గురించి, వారు చేసే పనుల గురించి నారాయణ పేట మండలం ఎక్లాస్ పూర్ గ్రామములో పర్యటించి చేతి వృత్తులు చేసే వారితో ఆ వస్తువులు ఎలా తయారు చేస్తారో ప్రత్యక్షంగా తెలుసుకోవడం జరిగింది.అదే విధంగా జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా లోకపల్లి లక్ష్మమ్మ దేవాలయం సమీపంలోని పొలంలో 30 సంవత్సరాల నుండి వ్యవ సాయం చేస్తున్న సంతోష్ నామాజీ అనే రైతుకు శాలు వాతో సన్మానం చేసి మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సాయిలీల, ప్రిన్సిపాల్ బాలప్ప, అమీనా,హెచ్.నర్సింహా పాల్గొన్నారు.

## అష్టాదశ శక్తిపీఠాలలో 5వ శక్తిపీఠమైన అలంపూర్ శ్రీ జోగులాంబ దేవస్థానాన్ని సందర్శించిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 23(స్కై న్యూస్):** మంగళవారం అలంపూర్ శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయాన్ని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామి మరియు శ్రీ జోగులాంబ అమ్మవారి దేవాలయాలలో భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ముందుగా దేవాలయ వేద పండితులు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు సంప్రదాయాల వాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.అనంతరం శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామిని దర్శించుకుని అభిషేకాలు,ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ కూడా చేశారు.తదనంతరం శ్రీ జోగులాంబ అమ్మవారి ఆలయాన్ని దర్శించుకొని, అమ్మవారికి విశిష్ట పూజలు అర్పించారు.వేద పండితులు ఆలయ మండపంలో గవర్నర్ కు పట్టు వస్త్రాలతో సత్కరించి ఆశీర్వచనం,తీర్థ ప్రసాదాలను అందించారు.ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, దేవాదాయ శాఖ కమిషనర్ డా.ఎస్.హరీష్,ఐ.ఏ.ఎస్.జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్,ఎస్పీ శ్రీనివాస రావు,అలంపూర్ శాసన సభ్యులు విజయుడు,రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి,గవర్నర్ సంయుక్త కార్యదర్శి జె.భవానీ శంకర్, గవర్నర్ ఏడీసీ మేజర్ అమన్ కుందూ,గవర్నర్ ఏడీసీ కాంతిలాల్ పటేల్,ఐ.పి.ఎస్, గవర్నర్ సీఎస్ఓ ఎల్.శ్రీనివాస రావు,గవర్నర్ వ్యక్తిగత కార్యదర్శి పవన్ సింగ్, డిఎస్పీ మొగలయ్య, పురావస్తు శాఖ ఇంజనీర్ కిశోర్ కుమార్ రెడ్డి,ఆర్డీవో అలివేలు, ఈ.ఓ దీప్తి,తహసీల్దార్ మంజుల, హార్టికల్చర్ అసిస్టెంట్ వేణు, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ శతవసంతోత్సవాలను ఘనంగా నిర్వహించాలి..

### 26న జిల్లా కేంద్రంలో జరిగే ర్యాలీకి పార్టీ శ్రేణునులు కదలిరావాలి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల, చంద్రగిరి




**కొత్తగూడెం డిసెంబర్ 23( స్కై న్యూస్)::** భారత కమ్యూనిస్టు పార్టీ శతవసంతోత్సవాల సందర్భంగా ఈ నెల 26న బస్తీల్లో, గ్రామాల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం శేషగిరిభవన్'లో జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శతాబ్ద కాలంగా ప్రజల హక్కుల కోసం, శ్రమజీవుల పోరాటాలకు సిపిఐ అగ్రభాగాన నిలిచిందని తెలిపారు. ఈ చారిత్రక సందర్భాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. శతవసంతోత్సవాల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలు ప్రజల భాగస్వామ్యంతో జరగాలన్నారు. సిపిఐ చరిత్ర, పోరాటాలు, త్యాగాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమం నుంచి నేటి వరకు సిపిఐ పోషించిన పాత్ర విశిష్టమైందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజా సమస్యలపై ఉద్యమాలు మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. శతవసంతోత్సవాలు కొత్త తరానికి సిపిఐ ఆలోచనా విధానాన్ని చేరువ చేసే అవకాశం అని పేర్కొన్నారు. అదేవిధంగా 26న ఓల్డ్ డిపో సెంటర్ నుంచి పోస్టాఫీసు సెంటర్ వరకు జరిగే శతవసంతోత్సవాల ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు యూసుఫ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు మాచర్ల శ్రీనివాస్, ధర్మరాజు, రమణమూర్తి, నేరెళ్ల శ్రీనివాస్, మ్రి గోపి, బోయిన విజయకుమార్, మండల రాజు, సత్యనారాయణాచారి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## మర్యాదపూర్వకంగా తాసిల్దార్, ఎస్సైని కలిసిన సర్పంచ్, ఉప సర్పంచ్ గ్రామ పెద్దలు





**చిన్నచింతకుంట డిసెంబర్ 23 (స్కై న్యూస్:** చిన్న చింతకుంట మండలం లాలుకోట గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ జై, గోపాల్, ఉప సర్పంచ్ రవికుమార్ గెలుపొందిన సందర్భంగా సిసి కుంట మండల ఎస్సై కృష్ణ ఓబుల్ రెడ్డి సీసీ కుంట మండలం తాసిల్దార్ ఎల్లప్ప ని మర్యాదపూర్వ వెళ్లి కలవడం జరిగింది. గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎన్ వెంకటేష్ అహ్మద్ గ్రామ పెద్దలు నర్సింలు శ్రీనివాసులు ఆంజనేయులు గోవర్ధన స్వామి వార్డ్ నెంబర్ కురువ సాయిలు కృష్ణయ్య రాజారెడ్డి తదితరులు శాలువాతో సన్మానం చేయడం జరిగింది.

# సింగరేణి ప్రధాన కార్యాలయము లో సింగరేణి ఆవిర్భావ దినోత్సవ ప్రధాన వేడుకలు







**సింగరేణి డిసెంబర్ 23 (స్కై న్యూస్ ):** కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయము నందు కార్పొరేట్ ఆధ్వర్యం లో మంగళవారం నాడు సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సింగరేణి డైరక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ విశిష్ట అతిధిలుగా డైరక్టర్(పి%ద%పి) కే.వెంకటేశ్వర్లు, డైరక్టర్(ఈ%ద%ఎం) శ్రీ ఎం.తిరుమల రావు విచ్చేశారు. ఎస్%ద%పిసి సిబ్బంది స్కౌట్స్ కలర్ పార్టీ వారిని వేదిక వద్దకు తీసుకొని రాగా,ముఖ్య అతిథి డైరక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ ని సింగరేణి పతాకాన్ని ఎగురవేసి అనంతరం అందరూ సింగరేణి గేయాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా డైరక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ మాట్లాడుతూ సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న కార్మికులు, సూపర్‌వైజరీ సిబ్బంది, అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, వారి కుటుంబ సభ్యులు, పాత్రికేయులు, స్థానిక ప్రజలందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. 137 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ బలంగా నిలబడడానికి కారణం ఒక్క కాలం కాదు, ఒక్క నిర్ణయం కాదు తరతరాల శ్రమ, క్రమశిక్షణ, పరస్పర నమ్మకమే సింగరేణి నిజమైన బలం. ఈ ఏడాది మనం పని చేసిన పరిస్థితులు సులభమైనవి కావు. వాతావరణ ప్రభావాలు, సాంకేతిక సవాళ్లు, మార్కెట్ మార్పులు ఇవన్నీ మన పనిని ప్రభావితం చేశాయి. అయినప్పటికీ, భద్రతను ముందుంచుకొని, అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ ముందుకు సాగేందుకు ప్రయత్నించాం.ఈ ప్రయత్నంలో ప్రతి గని కార్మికుడు, ప్రతి సూపర్‌వైజర్, ప్రతి అధికారి చూపిన బాధ్యతాభావం ప్రశంసనీయం. ఫలితాలకన్నా ముందు ఈ కట్టుబాటే మనకు ముఖ్యమైనది అని ముందుకు చూస్తే, సింగరేణి భవిష్యత్తుపై మనం ఆలోచించకుండా ఉండలేం. మారుతున్న శక్తి రంగం, మారుతున్న సాంకేతికత, మారుతున్న అవసరాలు ఇవన్నీ మన ముందున్న ప్రశ్నలు. ఈ ప్రశ్నలకు సమాధానాలు ఒకే రోజు రావు. కానీ సరైన దిశలో ప్రశ్నలు వేయడం కూడా నాయకత్వంలో భాగమేనని నేను నమ్ముతున్నాను. అందుకే ఉత్పత్తి సామర్థ్యం, సంస్థ స్థిరత్వం, భవిష్యత్తు అవకాశాలపై మనం ఆలోచన ప్రారంభించాం. ఇది ఒక ప్రయాణం తొందరపడాల్సినది కాదు, తప్పించుకోవాల్సినది కూడా కాదు.ఇప్పటివరకు సింగరేణి ప్రధానంగా తెలంగాణ అవసరాలకు సేవలందించింది. అదే మన గుర్తింపు. అయితే కాలం మారుతున్నప్పుడు, సింగరేణి తన అనుభవం, సామర్థ్యంతో మరెక్కడైనా ఉపయోగపడగలదా అన్న ప్రశ్న సహజంగానే వస్తుంది. ఈ నేపథ్యంలో, కీలక ఖనిజాలు, అనుబంధ రంగాల్లో అవకాశాలు ఉన్నాయా అనే అంశాన్ని మనం పరిశీలించడం ప్రారంభించాం. ఇవి ఇంకా ఆలోచన దశలోనే ఉన్నప్పటికీ, భవిష్యత్తును నిర్లక్ష్యం చేయకుండా ముందే సిద్ధమవ్వాలన్న భావనతోనే ఈ ప్రయత్నం.అలాగే శక్తి రంగంలో జరుగుతున్న మార్పులను గమనిస్తూ, పునరుత్పాదక శక్తి, శక్తి సామర్థ్యం వంటి రంగాల్లో సింగరేణి ఏ పాత్ర పోషించగలదో అన్న దానిపై కూడా మనం ఆలోచిస్తున్నాం. ఇవన్నీ సింగరేణి తన బాధ్యతను విస్తృతంగా అర్థం చేసుకునే ప్రయత్నాలుగా మాత్రమే చూడాలి.సింగరేణి బలం కేవలం ఉత్పత్తిలో కాదు మనుషుల్లో ఉందని, కార్మికుల భద్రత, సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి ఎప్పటికీ మన ప్రధాన ప్రాధాన్యాలే. ఇప్పటికే అమలులో ఉన్న పథకాలను మెరుగుపరచడం, పని పరిస్థితులను మరింత సురక్షితంగా చేయడం ఇవన్నీ నిరంతర ప్రక్రియలు. ప్రమాదాలను పూర్తిగా తొలగించలేకపోయినా, వాటిని తగ్గించేందుకు మనం ఎంతగా ప్రయత్నిస్తున్నామన్నదే మన నిజమైన ప్రమాణం.సామాజిక బాధ్యతలో భాగంగా, పరిసర ప్రాంతాల అభివృద్ధి, విద్య, ఉపాధి అవకాశాల విషయంలో సింగరేణి తన వంతు పాత్రను కొనసాగిస్తోంది. ఈ కార్యక్రమాలు పెద్ద ప్రకటనల కోసం కాదు నిశ్శబ్దంగా, అవసరమైన చోట, సాధ్యమైనంతవరకు ముందుకు సాగే ప్రయత్నాలుగా ఉండాలని మనం కోరుకుంటున్నాం.మహిళా శక్తి పెరుగుతున్న తీరు సింగరేణిలో కనిపించడం మనందరికీ సంతోషకరమైన విషయం. గనుల్లో, ఆపరేషన్లలో, రక్షణ బృందాల్లో మహిళల భాగస్వామ్యం. ఇది సహజంగా, క్రమంగా జరుగుతున్న మార్పు. ఇది సింగరేణి పరిణతి చెందుతున్నదానికి సూచిక.రెస్క్యూ జట్ల విజయాలు, గనుల నిర్వహణలో వచ్చిన గుర్తింపులు మనకు స్ఫూర్తినిస్తాయి. కానీ అవి మనకు తృప్తి కలిగించాల్సినవి కాదు ఇంకా మెరుగ్గా చేయాలనే గుర్తింపులుగా మాత్రమే మనం చూడాలి.మొత్తంగా చూస్తే, సింగరేణి ఈ రోజు ఒక సంధికాలంలో ఉంది. తొందరపడి పెద్ద హామీలు ఇవ్వాల్సిన అవసరం లేదు. అదే సమయంలో భవిష్యత్తును వాయిదా వేయాల్సిన అవసరం కూడా లేదు.సరైన వేగంతో, సరైన దిశలో, పరస్పర విశ్వాసంతో ముందుకు సాగితే సింగరేణి తన స్థిరత్వాన్ని కాపాడుకుంటూ కొత్త కాలానికి తగినట్టు మారగలదని నాకు నమ్మకం ఉంది. అనంతరం సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకల సంధర్భముగా కార్పొరేట్ పరిధిలోని ఉత్తమ అధికారి గా ఎంపికైన బి. శ్రీనివాస రావు, జిఎం ఎక్స్ప్లోరేషన్ నుఉత్తమ ఎన్సిడబల్యూఏ ఉద్యోగులుగా ఎంపికైన కే.వేంకటేశ్వర ప్రసాద్, సీనియర్ సిటి టెక్నీషియన్, మెయిన్ హాస్పిటల్, డి.వి.వి.నాగేంద్ర ప్రసాద్, ఫిట్టర్, సెంట్రల్ వర్క్ షాప్ లను సన్మానించారు.అనంతరం మెయిన్ ఆసుపత్రి నందు నిర్వహించిన వెల్ బేబీ షో లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు బహుమతుల ప్రధానం చేశారు.జిఎం(పర్సనల్) వెల్ఫేర్ %ద% సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమములో ముఖ్య అతిధిగా ముఖ్య అతిధిగా సింగరేణి డైరక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ విశిష్ట అతిధిలుగా డైరక్టర్(పి%ద%పి) కే.వెంకటేశ్వర్లు, డైరక్టర్(ఈ%ద%ఎం) ఎం.తిరుమల రావు, ప్రాతినిధ్య సంఘం(ఐఎన్టియూసి) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సి.త్యాగరాజన్, సింగరేణి సిఎంఓఏఐ ప్రెసిడెంట్ టి.లక్ష్మి పతి గౌడ్, కార్పొరేట్ పరిధిలోని వివిధ శాఖల జనరల్ మేనేజర్లు, వివిధ శాఖల అధిపతులు, యూనియన్ నాయకులు, ఉత్తమ అధికారి, ఉత్తమ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, వెల్ఫేర్ సిబ్బంధి, ఎస్%ద%పిసి సిబ్బంధి, సేవ సెక్రటరీలు, ఇతర అధికారులు, ఉద్యోగులు, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామాలకు విస్తరించిన బిజెపి

**పంచాయితీల్లో పెరిగిన బలం**

**తెలంగాణ లో అధికారం ఖాయం**

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే. రతంగ్ పాండు రెడ్డి**



**నారాయణపేట డిసెంబర్ 23: (స్కైన్యూస్)** రాష్ట్రంలో బిజెపి పంచాయితీ ఎన్నికల్లో భారీ విజయం సాధించిందనీ,రాబోయే. ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొత్తకాపు రతంగ్ పాండు రెడ్డి ఒక ప్రకటనలో ధీమా వ్యక్తం చేశారు.ఇద్దరు ఎమ్మెల్యేల సోతూర్లలో కాంగ్రెస్ ను ఓడించి బిజెపి ఘన విజయం సాధించిన విషయాన్ని గుర్తు చేశారు.సీఎం సొంత నియోజ కవర్గం కొడంగల్ లో సైతం పలు గ్రామాలు బీజేపీ కైవసం చేసుకుందని అన్నారు.గతంతో పోల్చితే భారీగా పెరిగిన బీజేపీ గ్రాఫ్ పెరిగిందని అన్నారు.ప్రతి గ్రామానికి బిజెపి విస్తరించిందని తెలిపారు.పదేళ్లు బి ఆర్ ఎస్ , రెండేళ్ల కాంగ్రెస్ పార్టీల పాలనను కాదని బీజేపీ కి ప్రజలు మద్దతు తెలిపారని అన్నారు.ఉమ్మడి పాలమూరులో బిజెపి బలోపేతమౌతున్నదని పేర్కొన్నారు.గతంతో పోల్చితే భారీగా పెరిగిన బీజేపీ గెలుపొందిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలు ఇందుకు నిదర్శనమని అన్నారు.ఇరవై పైగా స్థానాలలో స్వల్ప ఓట్ల తేడాతో రెండో స్థానంలో బీజేపీ బలపరిచిన అభ్యర్థులు నిలిచారని తెలిపారు పలు చోట్ల బీజేపీ మద్దతుతో గెలిచిన స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారని,రాష్ట్ర ప్రజలు బీజేపీని ప్రత్యామ్నా య శక్తిగా భావిస్తున్నారని అన్నారు.బిజెపికి గ్రామాల్లో మంచి ఆదరణ వచ్చిందని 2028 ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం అని ధీమా వ్యక్తంచేశారు. గ్రామాల అభివృద్ధి కేవలం కేంద్ర బీజేపీ సర్కార్ తోనే సాధ్యమని ప్రజలు నమ్మి బిజెపి పక్షాన ప్రజలు నిలుస్తున్నారని అన్నారు. రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ గ్రామాలకు రూపాయి నిధులు ఇవ్వలేదనీ, గత ప్రభుత్వం సర్పంచ్ లకు పెండింగ్ బకాయిలు చెల్లించలేదని. కాంగ్రెస్, బి ఆర్ ఎస్ ప్రభుత్వాల మోసాలతో ప్రజలు విసిగిపోయారన్నారు.తెలంగాణాలో డబుల్ ఇంజన్ సర్కార్ కు అవకాశం ఇచ్చేనందుకు ప్రజలు సిద్ధమౌతున్నారనీ అన్నారు.

# మీ పదేళ్ల పాలనలో ప్రజలు జాగృతమైబుద్ధి చెప్పారు...



**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 23 (స్కై న్యూస్,):** కల్వకుంట్ల కుటుంబం రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేసి మళ్ళీ జాగృతి పేరుతో కొత్త డ్రామా తెర లేపావ్.డీకే అరుణమ్మ ని విమర్శించే స్థాయి మీది కాదు లిక్కర్ రాణి కవిత.పాదయాత్రతో మీ అయ్యా (కెసిఆర్ )మెడలు వంచి జిల్లా సాధించింది.లిక్కర్ స్కామ్ లో కోట్లు దోచుకొని మహిళలకు మాయని మచ్చగా మారావ్.తన రాజకీయ జీవితంలో అభివృద్ధి ధ్యేయంగా పనిచేసిన డీకే అరుణమ్మ గారిని విమర్శించే హక్కు నీకు లేదు.గత ప్రభుత్వం ప్రస్తుత ప్రభుత్వం విద్యా వ్యవస్థ నిర్వీర్యం చేసింది. గద్వాల పట్టణంలోని డికె. బంగ్లా లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో మాజీ మున్సిపల్ చైర్మన్ టి కృష్ణవేణి మాట్లాడుతూతుమ్మిళ్ల ప్రాజెక్టు కుర్చీ వేసుకుని పూర్తి చేస్తానని మీ అయ్యా కేసీఆర్ పూర్తి చేయలేదు.కానీ మా నాయకురాలు నెట్టెంపాడు ప్రాజెక్టుతో రెండు లక్షల ఎకరాలకు నీరు అందించిన ఘనత డీకే అరుణమ్మ ది.డికె.అరుణమ్మ మంత్రిగా ఉన్నప్పుడు వేసిన రోడ్లు తప్ప గత ప్రభుత్వం ,ప్రస్తుత ప్రభుత్వం ఒక్క రోడ్డు వేసిన పాపాన పోలేదు.. పైగా రోడ్లు కంకర తేలింది రోడ్లు గుంతలమయంగా ఉన్నాయి అంటున్నారు.మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బండల పద్మావతి మాట్లాడుతూఅక్రమ ఇసుక దందా కేరాఫ్ అడ్రస్ గా కల్వకుంట్ల కుటుంబం , ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పేర్లతో అక్రమ ఇసుక దందా చేస్తున్నారు.గద్వాలకు ఐటిఐ కాలేజీ , పాలిటెక్నిక్ కాలేజీ,మండలానికి జూనియర్ కాలేజీలను,మహిలడిగ్రీ కాలేజీ, కస్తూర్బా పాఠశాల ప్రారంభించిన ఘనత డికె. అరుణమ్మ ది.టిఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క బిల్డింగ్ లు కట్టింది లేదు.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం గురుకుల భవనాలకు అద్దె కట్టలేని పరిస్థితి , విద్యార్థులు ఫుడ్ పాయిజన్ తో ప్రాణాలు వదులుతున్నారు , ఫీజు రివెంబర్మెంట్ ఇవ్వడం లేదని అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ మోర్చా అధ్యక్షురాలు సమత గౌడ్, మహిళ మోర్చా నాయకురాలు భారతి, శ్యామల భారతి తదితరులు ఉన్నారు.

## మానవత్వం చాటుకున్న జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట డిసెంబర్ 23:( స్కైన్యూస్) నారాయణ**పేట జిల్లా ఎస్పి డాక్టర్ వినీత్ మంగళవారం ఒక వృద్ధుడిని కాపాడేందుకు స్వయంగా చర్యలు తీసుకుని మానవత్వం చాటుకున్నారు.కోస్గి పట్టణ కేంద్రంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు వెళ్తున్న సందర్భంగాదామరగిద్ద దాటిన తరువాత రోడ్డుపై వెళ్తున్న ఒక ముసలి వృద్ధుడు అకస్మాత్తుగా కళ్ళు తిరిగి రోడ్డుపై పడిపోవడం గమనిం చిన ఎస్పీ వెంటనే తన వాహ నాన్ని ఆపించి అక్కడ ఎటు వంటి ఆలస్యం చేయకుండా తక్షణమే స్పందించిన ఎస్పీ తమ పోలీసు ఎస్కార్ట్ వాహనంలోనే ఆ వృద్ధుడిని సమీపంలోని ప్రభుత్వ ఆసు పత్రికి తరలించేందుకు ఆదేశా లు జారీ చేశారు.ఆసుపత్రిలో అవసరమైన చికిత్స అందేలా అధికారులకు సూచనలు ఇచ్చి ఇచ్చారు.ఎస్పి మానవత్వం, బాధ్యతా భావంతో వ్యవహరించి ప్రజల ప్రశంసలు అందుకున్నారు.భద్రతా విధులతో పాటు ప్రజల ప్రాణ రక్షణే పోలీసు శాఖ యొక్క ప్రధాన బాధ్యత అని మరోసారి చాటిచెప్పిన జిల్లా ఎస్పీ చర్యను స్థానికులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

# కిన్నెరసాని ప్రకృతి సౌందర్యాన్ని ప్రపంచానికి తెలియజేయాలి

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**పాల్వంచ డిసెంబర్ 23 ( స్కై న్యూస్ ):** కిన్నెరసాని ప్రకృతి సౌందర్యాన్ని ప్రపంచానికి తెలియజేయాలి అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు.ఏరు రివర్ ఫెస్టివల్‌లో భాగంగా మంగళవారం ఆళ్లపల్లి మండలం రాయపాడు గ్రామం నుండి మొతలగూడెం వరకు కిన్నెరసాని రివర్ వాక్ కార్యక్రమాన్ని విజజయవంతంగా నిర్వహించారు. ఉదయం 8.00 గంటలకు ప్రారంభమైన ఈ రివర్ వాక్‌లో యువత పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొని, కిన్నెరసాని నది పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, నదుల ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్వయంగా, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, యువతతో కలిసి రివర్ వాక్‌లో పాల్గొని వారితో మమేకమయ్యారు. నది తీర ప్రాంతాల వెంట సాగిన ఈ వాక్ సందర్భంగా జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి ఉన్న విస్తృత అవకాశాలు, కిన్నెరసాని నది పరిసర ప్రాంతాల సహజ సంపద, అలాగే జిల్లాలోని వివిధ పర్యాటక ప్రాంతాల విశిష్టతను యువతకు కలెక్టర్ వివరించారు. జిల్లాలో ఉన్న అటవీ ప్రాంతాలు, నదులు, జలపాతాలు, ప్రకృతి వనరులు పర్యాటకులను ఆకర్షించే సామర్థ్యం కలిగి ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ విధంగా జిల్లాలోని వివిధ పర్యాటక ప్రాంతాల ప్రత్యేకతలను యువతకు వివరిస్తూ రివర్ వాక్ కార్యక్రమం ముందుకు సాగింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కిన్నెరసాని నది జిల్లా జీవనాధారంగా ఉండటంతో పాటు పర్యావరణ సమతుల్యతకు కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. నది చుట్టూ ఉన్న పచ్చని అడవులు, సహజ వనరులు, జీవ వైవిధ్యం భవిష్యత్ తరాలకు కాపాడాల్సిన





అమూల్యమైన సంపద అని తెలిపారు. ఈ ప్రకృతి సౌందర్యాన్ని సంరక్షించుకుంటూనే దేశ విదేశాలకు పరిచయం చేస్తే జిల్లాలో పర్యాటక రంగం మరింతగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.ఏరు రివర్ ఫెస్టివల్ ప్రధాన లక్ష్యం జిల్లాలోని నదుల, పర్యావరణ పరిరక్షణతో పాటు పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడమేనని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందితే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, రవాణా, స్థానిక ఉత్పత్తుల విక్రయాల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని వివరించారు.యువత సోషల్ మీడియా, డిజిటల్ వేదికల ద్వారా కిన్నెరసాని నది ప్రకృతి అందాలు, జిల్లాలోని పర్యాటక ప్రాంతాల విశిష్టతను ప్రపంచానికి తెలియజేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఫోటోగ్రఫీ, వీడియోలు, డాక్యుమెంటరీలు, రీల్స్, బ్లాగుల ద్వారా ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేలా కృషి చేయాలని సూచించారు. అదే సమయంలో నదులను కాలుష్యరహితంగా ఉంచడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు.జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధి దిశగా, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడేలా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి యం. పరంధామ రెడ్డి, స్థానిక అల్లపల్లి మండల ఎంపీడీవో శ్రీను, తహసిల్దార్ జగదీశ్వర ప్రసాద్, ఎంఈఓ సంతా రావు, కృష్ణయ్య, గ్రామ సర్పంచ్ చిన్న పాపయ్య, పంచాయతే సెక్రెటరీ వరుణ్, టి ఎన్జీవోస్ ఉద్యోగ సంఘాల నాయకులు భార్గవ్ చైతన్య, అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ మహిధర్, నాగేంద్ర, ఆర్చెరీ కోచ్ కల్యాణ్, సైకిలింగ్ నాగేశ్వర రావు, ఉదయ్ కుమార్, టైక్వాండో రమేశ్, ఎన్సిసి, ఎన్‌ఎస్ఎస్, స్థానిక యువత, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయానికి రంగులు



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, డిసెంబర్** 23 రంగారెడ్డి జిల్లాలోని షాద్నగర్ పట్టణంలో డిసెంబర్ 23 :- రంగారెడ్డి జిల్లాలోని షాద్నగర్ పట్టణంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా జానంపేట శ్రీ లక్ష్మి వెంకటేశ్వర దేవాలయానికి ఉత్తర దర్శనము లో భాగంగా ఉత్తర దిశ దర్శనము ప్రత్యేక%శీ% ఉత్తర దిశ కు ఏర్పాటు చేసిన శంకు చక్ర మరియు హనుమాన్ గరుడ విగ్రహాలకు పెయింటింగ్ పరిగి రోడ్డులో ఏసియాన్ పెయింట్స్ ప్రొపెటర్ రాహుల్ శర్మ దాతగా వచ్చి పూర్తీగా కలర్స్ వేయడానికి ముందుకు వచ్చారు ఇందులో భాగంగా సాయి ఇశ్వర్ రెడ్డి, భూపాల్ ఒగ్గు కిషోర్ ఎంసాని శ్రీనివాస్ తోకల దామోదర్ రెడ్డి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధుల గుర్తింపు కార్యక్రమం డి ఎం హెచ్ ఓ




**పాల్వంచ డిసెంబర్ 23 (స్కై న్యూస్ ):**భద్రాద్రి, కొత్తగూడెం. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ శేఖరం బంజర యుపిహెచ్సి పరిధిలోని మంచి కంటి నగర్ ని సందర్శించడం జరిగినది.కుష్టు వ్యాధుల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా మంచి కంటి నగర్ నందు జరుగుతున్న సర్వేను పరిశీలించడం జరిగింది. అదేవిధంగా యూపీహెచ్సీని ఆకస్మిక తనిఖీని నిర్వహించి రికార్డులను పరిశీలించటం జరిగినది. వైద్య సిబ్బంది సకాలంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సమయపాలన పాటించాలని సూచించడం జరిగినది పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో యుపిఎస్సి వైద్యాధికారి డిపిఎంవో మోహన్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం

షాద్ నగర్ పట్టణంలోని చౌడమ్మ గుట్ట ఆంజనేయ స్వామి వారి ఆలయంలో అయ్యప్ప స్వాముల కొరకు ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి దంపతులు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో గురు స్వాములు వన్నాడా ప్రకాష్ గౌడ్ స్వామి,గున్నేలి రమేష్ స్వామి,అయ్యప్ప స్వాములు మాజీ కౌన్సిలర్స్ కానుగు అనంతయ్య, ఈశ్వర్ రాజు,పాలమాకుల చెన్నయ్య,బీఆర్ఎస్ నాయకులు రఘునాథ్ యాదవ్,పల్లె రఘుపతి రెడ్డి భక్తులు తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేయడం వల్ల పుణ్యఫలం లభిస్తుందని దాని ద్వారా సమాజంలో





ఐక్యత,భక్తిభావం పెరుగుతుందని ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సి నవీన్ రెడ్డి అన్నారు

## హాయత్‌నగర్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి మంత్రి ఆదేశం



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, డిసెంబర్ 23** :- రంగారెడ్డి జిల్లాలోని హాయత్‌నగర్‌లో విజయవాడ హైవేపై ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని స్థానికులు ఆందోళన చేపట్టారు ఈ వ్యవహారంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించారు లెక్చరర్స్ కాలనీ వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తామన్నారు మూడు నెలల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని అధికారులను ఆదేశించారు కొన్ని అభ్యంతరాల వల్ల పనులు ఆలస్యమయ్యాయని ఆయన స్పష్టం చేశారు.

## అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ చేసిన బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులు

**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, డిసెంబర్ 23**:- రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ లో శివ మారుతి గీత అయ్యప్ప మందిరంలో నెల్లి మాధవి%-%శ్రీవర్ధన్ రెడ్డి కూతురు నెల్లి సాత్విక జన్మదినాన్ని పురస్కరించుకొని, కుటుంబ సమేతంగా అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు కట్ట సుధాకర్ రెడ్డి, శ్రీశైలం దేవాలయ బోర్డు సభ్యులు, అయ్యప్ప భక్తులు పాల్గొని అన్నప్రసాద వితరణ చేశారు ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములకు భక్తిశ్రద్ధలతో అన్నప్రసాదం సమర్పించారు ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను సద్భావనలను పెంపొందించడమే కాకుండా ధార్మిక విలువలను మరింత బలోపేతం చేస్తాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు ఈ



కార్యక్రమంలో అందే బాబయ్య, అశోక్ గౌడ్ గురు స్వామి,భూపాల చారి, చెంది మహేందర్ రెడ్డి, కందూరి మనోహర్ రెడ్డి, వెంకటేష్ గుప్తా,నరసింహ గౌడ్, డాక్టర్ విజయ్ కుమార్,మల్చలం మురళి గురుస్వామి, వాడ కట్టా



విజయ్ కుమార్,చెట్ల వెంకటేష్, ప్యాట అశోక్, వంశీ కృష్ణ, ఋషికేష్, శ్రీనివాస్ చారి, మోటే శ్రీనివాస్, గుంత సత్యం, కిషోర్ కుమార్ రెడ్డి , జంబుల నరసింహ, గంద్రతి శివశంకర్, లింగారం సాయి, పుట్నాల సాయి, గజ్జల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## షాద్ నగర్ న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ విద్యార్థుల ప్రతిభ




రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ విద్యార్థులు ఎంఎస్ గార్డెన్ షాబాద్ లో లయన్ షాటోకన్ కరాటే అకాడమీ మాస్టర్ సెన్సెలే నర్సిములు అధ్యర్యంలో జరిగిన 1%ర్% ఓపెన్ ఇన్విటేషనల్ కరాటే కుంగ్ ఫు ఛాంపియన్ షీప్-2025 లో జరిగిన పోటీలలో న్యూ పవర్ అకాడమీ మాస్టర్ బాలరాజ్ నంది అవార్డు గ్రహీత అహ్మద్ ఖాన్ (బ్రూస్లీ )మాస్టర్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి ఛాంపియన్షిప్ మెడల్స్ సాధించారు. ప్రేమ్ కుమార్ అనే కుంగ్ ఫు విద్యార్థి అత్యంత ప్రతిభ కనబర్చి ఛాంపియన్ షీప్ కైవసం చేసుకున్నారు.ఈ సందర్భంగా మాస్టర్లకు విద్యార్థిని, విద్యార్థులకు ఆర్గనైజర్స్ ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో బాలరాజ్ మాస్టర్, నంది అవార్డు గ్రహీత అహ్మద్ ఖాన్ మాస్టర్( బ్రూస్ లీ) మరియు న్యూ పవర్ కుంగ్ ఫు విద్యార్థులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం ఏరియాలో ఘనంగా సింగరేణి దినోత్సవ వేడుకలు

**సింగరేణి డిసెంబర్ 23 (స్కై న్యూస్ ):**కొత్తగూడెం ఏరియా నందు సింగరేణి దినోత్సవ వేడుకలు తేదీ.23 ఉదయం 9.30 గంటలకు కొత్తగూడెం ఏరియా 3 ఇంక్లైన్ నందు గల జి.ఎం కార్యాలయం నందు నిర్వహించిన సింగరేణి దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిధిగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు సింగరేణి పతాక ఆవిష్కరణ చేశారు.ముందుగా జిఎం జ్యోతి ప్రజ్వలన, కేక్ కట్ చేసి ఉద్యోగులందరికీ సింగరేణి దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణి దినోత్సవ వేడుకలను జరుపుకోవడం ఎంతో ఆనందదాయకంగా ఉన్నదని, సింగరేణి సంస్థ నూతన టెక్నాలజీ తో ముందుకు కొనసాగుతూ, నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను, సాధించడం జరుగుతుందన్నారు. ఇందుకు సహకరిస్తున్న అధికారులను, కార్మికులను, యూనియన్ నాయకులను, కాంట్రాక్ట్ కార్మికులను వారు అభినందించారు. 136 ఏళ్ల సింగరేణి చరిత్రలో ఎన్నో మైలురాళ్ళు సాధించడం జరిగింది. అదే విధంగా ఎన్నో సవాళ్ళను ఎదుర్కొని మన రాష్ట్రములో అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థగా, అంతే కాకుండా ఇతర ప్రభుత్వరంగ సంస్థలకు మార్గదర్శకంగా ఉండడం చాలా సంతోషకరం అని అన్నారు. ఈ సంస్థలో పని చేస్తున్న





మనమందరము ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. కనుక సింగరేణి ఆవిర్భావ దినోత్సవం ఏంతో వైభవంగా జరుపుకోవడం మన కర్తవ్య%శీ%గా గుర్తించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరములో కొత్తగూడెం ఏరియా కు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను రక్షణ తో సాధించడంలో భాగస్థులైన ఉద్యోగులను, సూపర్వైసర్లను, యూనియన్లను అధికారులను అభినంధించినారు.ఇదే స్ఫూర్తి ని కొనసాగిస్తూ ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన మూడు నెలలు కూడా నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని ఉద్బోధించినారు. అనంతరం ఈ ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి లక్ష్యాలను సాధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు, అధికారులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సంస్కృతిక



కార్యక్రమాలు వీక్షకులను అలరించాయి.ఈ కార్యక్రమములో కొత్తగూడెం ఏరియా జి.ఎం. ఎం. షాలేం రాజు తో పాటు కొత్తగూడెం ఏరియా సేవా ప్రెసిడెంట్ జి మధురవాణి, కొత్తగూడెం ఏరియా ఐఎన్టియూసి వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్ , సి.ఎం.ఓ.ఏ. కొత్తగూడెం ఏరియా ప్రెసిడెంట్ ఎం.వి. నరసింహారావు, ఏరియా ఇంజనీర్ కే సూర్యనారాయణ రాజు, ఇంచార్జ్ ఎస్ఓటు జిఎం ఎం. వెంకటేశ్వర్లు, ఎ.జి.ఎం. (పర్సనల్) జి. వి. మోహన్ రావు, ఏజెంట్ పద్మావతి ఖని రామ్ భరోస్ మహాతో, సేవ సెక్రటరీ వై అనిత, అన్ని విభాగాల అధిపతులు, అధికారులు, సూపర్వైజర్లు, ఉద్యోగులు, ఇతర సేవా సభ్యులు జిఎం.కార్యాలయ ఉద్యోగులుపాల్గొన్నారు.

# నేడు భారతరత్న పి.వి. నరసింహారావు 21 వర్ధంతి

**హైదరాబాద్ (స్కై న్యూస్) డిసెంబర్ 23:**పాములపర్తి వెంకట నరసింహారావు (పి.వి.) కరీంనగర్ జిల్లా వంగర గ్రామంలో రుక్మాయమ్మ సీతారామారావు దంపతులకు 1921 జూన్ 28వ తేదీన జన్మించారు. వీరి యొక్క ప్రాథమిక విద్య వంగర గ్రామంలోనూ హనుమకొండలో ఉన్నత విద్య ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించారు వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్న సందర్భంగా నిజాం రాష్ట్రంలో విద్యను అభ్యసించే అవకాశం లేనందున పూనా వెళ్లి బిఎస్సి చేసి ఆ తదుపరి నాగపూర్ లో న్యాయ శాస్త్ర విద్య అభ్యసించి హైదరాబాద్ వచ్చి శ్రీ బూర్గుల రామకృష్ణారావు గారి వద్ద జూనియర్ న్యాయవాదిగా తన వృత్తిని కొనసాగించారు. స్వామి రామానంద తీర్థ సిద్ధాంతాలకు ఆశయాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా నిజాం వ్యతిరేక పోరాటంలో, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. 1947బి 48 స్వామిజి నడిపిన క్యాంపు లో క్రియాశీలక పాత్ర వహించారు. 1948 సెప్టెంబర్ 17వ తేదీన నిజాం పరిపాలన కేంద్ర ప్రభుత్వం హోం శాఖామంత్రిగా శ్రీ సర్దార్ వల్లభాయ్ పటేల్ పోలీస్ చర్య ద్వారా నిజాం పరిపాలనలో ఉన్న ప్రాంతమునకవిముక్తి కల్పించినారు. స్వామి రామానంద తీర్థ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ 1951 లో ఆల్ ఇండియా కాంగ్రెస్ మహాసభ గోల్కొండ సమీపంలో జరిగిన సందర్భంలో పివి ప్రముఖ పాత్ర వహించారు. 1952 సాధారణ ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంటుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్తిగా పోటీ చేసి కమ్యూనిస్టు పార్టీ ప్రభావం వలన విజయం సాధించలేకపోయారు. 1956 వరకు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఆ తదుపరి 1962 వరకు ఏపీసీసీ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. 1952 ఎన్నికల్లో ఓటమితో క్రియాశీల రాజకీయాల జీవితం ప్రారంభించిన పివి 1957 మంథని నుంచి రాష్ట్ర శాసనసభకు వరుసగా గెలిచినాలుగు పర్యాయాలు 1972 వరకు ప్రాతినిధ్యం వహించారు. శాసనసభలో పీవీ క్రియాశీలక పాత్ర వహించి అందరిని ఆకర్షించినందున రాష్ట్ర ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గాల్లో న్యాయ, సమాచార, ఆరోగ్య, దేవాదాయ, విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి పనిచేశారు. 1964 నుంచి 1967 వరకు అధికారి భాషా సంఘం అధ్యక్షునిగా పనిచేసే 1971 నుంచి 73 వరకు రాష్ట్ర ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు నిర్వర్తించారు. ముఖ్యమంత్రిగా పదవి నుంచి వైదొలిగిన తర్వాత 1974లో భారత కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా 1977 మరియు 1980లో హనుమకొండ నుంచి లోకసభకు 1984లో మహారాష్ట్ర రామ్ టెక్ నుండి ఎన్నికయ్యారు. 1978లో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్గా పనిచేశారు. 1984 లో ఇందిరా గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ పూర్తి విజయం సాధించింది. ఇందిరాగాంధీకి అత్యంత విశ్వాస పాత్రుడిగా ఉన్నందున ఇందిరా గాంధీ క్యాబినెట్లో విదేశాంగ శాఖ మంత్రిగా



బాధ్యతలు స్వీకరించి ప్రతి దేశంతో స్నేహ వాణిజ్య సంబంధాలు భారతదేశం బలపడేందుకు కృషి చేశారు. 1984లో కేంద్ర హోం మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఇందిరా గాంధీ మరణానంతరం రాజీవ్ గాంధీని ప్రధాని చేయటంలో పీవీ నరసింహారావు కీలక పాత్ర వహించారు. రాజీవ్ గాంధీ మంత్రివర్గంలో రక్షణ శాఖ, మానవ అభివృద్ధి శాఖ మంత్రిగా నూతన విద్యా విధానం ప్రవేశపెట్టారు. నవోదయ విద్యాలయాలకు నాంది పలికారు. రాజీవ్ గాంధీ మరణానంతరం పివి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు అయ్యారు. 1991 జూన్ 21వ తేదీన ప్రధాన మంత్రి బాధ్యతలు స్వీకరించారు. 1996 పార్లమెంటు ఎన్నికల్లో నంద్యాల బరంపూర్ పార్లమెంటు నియోజకవర్గం లలో పోటీ చేసి గెలిచారు. అందులో బరంపూర్ నుంచి పార్లమెంటు సభ్యులుగానే కొనసాగుతూ నంద్యాల నియోజకవర్గంలో రాజీనామా చేయడం జరిగింది. నిరంతరం మార్పు కోసం ఆలోచన తన మేదస్సు ను ఉపయోగించి సమాజానికి ఏమైనా చేయాలనే తపన అనేక సంస్కరణలకు మూలం 30 ఏళ్లు సాగిన ఆయన సంస్కరణల పర్వం ముఖ్య ఉద్దేశం పాలనా వ్యవస్థ ప్రజలకు అవసరాలకు మేరకు రూపొందించడం. కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్లో మెజార్టీ లేకపోయినా మైనార్టీ ప్రభుత్వం అయినా చాకచక్యంగా ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించి ప్రభుత్వం నడిపిన చతురత ఒక్క పీవీ నరసింహారావు గారికే సాధ్యమైంది. ప్రధానిగా బాధ్యతలు చేపట్టినాటికి దేశ ఆర్థిక పరిస్థితి దుర్భరంగా ఉంది. ఆర్థిక లోటు దీర్ఘకాలికంగా దేశాన్ని వేధిస్తోంది. అంతర్జాతీయ సంస్థ నుండి తీసుకొన్న అప్పుల్ని పెట్టుబడులు దిగుమతుల కోసం వెచ్చించడం వల్ల ఆర్థిక లోటు ఏర్పడింది. ఎగుమతులు లేకపోవడం సమస్యకు కారణమైంది. ఈ పరిస్థితిలో పీవీ నరసింహారావు దేశ ప్రధానిగా పదవి బాధ్యతలు స్వీకరించి ఆర్థిక నిపుణులైన డాక్టర్ మన్మోహన్ సింగ్ ను ఆర్థిక శాఖ మంత్రిగా తీసుకుని వచ్చి ఆర్థిక సంస్కరణలు ప్రవేశ పెట్టటం ద్వారా సంపదను సృష్టించటంతో పాటు న్యాయబద్ధమైన పంపిణీ సాధ్యమని పీవీ విశ్వసించారు. సమాజంలో అసమానతలకు సామాజిక ఉద్రిక్తత దారి తీయకూడదని భావించేవారు సమాజంలోని చివరి వరసలోని పేద వ్యక్తికి కూడా ఆర్థిక సంస్కరణ ఫలాలు అందాలని ఈ సంస్కరణల ఫలితాలు పేదలకు చేరువ కావాలని స్వశక్తితో జీవించగలమనే విశ్వాసం పేదల్లో కలగాలని సమాజంలో గౌరవప్రదమైన స్వేచ్ఛ జీవితం గడిపేలా ఉండాలని ఆకాంక్షించేవారు. నాడు పివి గారు చేసిన ఆర్థికసంస్కరణల ఫలితంగానే దేశ ఆర్థిక పరిస్థితి సుస్థిరత్వం ఏర్పడింది సాహిత్య సేవా రంగానికి పీవీ విశేష కృషి చేశారు. ఆయన బహు భాషా కోవిదుడు. విశ్వనాథ వారి వేయిపడగల నవల హిందీలో అనువాదం చేసి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారము అందుకున్నారు. తన ఆత్మకథను "ఇన్సైడర్" పేరుతో ఇంగ్లీషు తెలుగు లోపలి మనిషి అని వివిధ భాషలలో రచన చేసినారు. ఇంకా మరాఠీ నుండి తెలుగు అనువాదాలు అయిన నవలలను వ్యాస రచనలు వచ్చినవి. రాజకీయాలకు అత్యున్నత పదవి అలంకరించి వచ్చిన తదుపరి సాహిత్య రంగంలో వివిధ భాషలలో తన యొక్క ప్రత్యేకతను నిలబెట్టుకున్నటువంటి మహోన్నతమైన వ్యక్తి. గాంధీయవాదిగా రాజకీయ పదవుల్లో కొనసాగుతున్న తరుణంలో ప్రముఖ ఖాదీ ఉత్పత్తి సంస్థలు వావిలాల, భాగ్యనగర్ ఖాదీ సంస్థలకు అధ్యక్షులుగా బాధ్యతలను నిర్వహిస్తూ దేశమునకు రాజైన సొంత ప్రాంత అభివృద్ధి అనే ఆలోచన ఆవేదన ఉండేది. ఖాదీ సంస్థలకు దేశంలో ఆర్థిక వనరులు ప్రత్యేక బ్యాంకు ద్వారా అందించు విధానంను ప్రవేశపెట్టి ఖాదీ మిషన్ ఢిల్లీ సమ్మేళనంలో 1993లో ప్రకటించి ఉన్నారు. స్వామి రామానంద తీర్థ గ్రామీణ ఉపాధి కల్పన విశ్వవిద్యాలయమును భూధాన్ పోచంపల్లిలో నెలకొల్పి గ్రామీణ యువతకు ఉపాధి కల్పనకు దోహదం చేయుటకు కృషి చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఈ విద్యాలయ నిర్వహణకు ఆర్థిక వనరులు నేరుగా పొందు అవకాశం కల్పించినారు. పివి అపర చాణిక్యుడు, మహోన్నత వ్యక్తి 23 డిసెంబర్ 2004లో ఢిల్లీ స్వగృహంలో స్వర్గస్తులైనారు. వారి యొక్క అంతిమ సంస్కారం హైదరాబాదులో 25 డిసెంబర్ 2004లో ప్రభుత్వ లాంఛనాలతో చేయుట జరిగినది. భారతదేశ ప్రధానమంత్రిగా,, ఆర్థిక సంస్కరణలతో దేశమును గట్టెక్కించి, వివిధ హోదాలలో అత్యున్నత బాధ్యతలు నిర్వర్తించిన శ్రీపి.వి. నరసింహారావు గారి మరణానంతరం కేంద్ర ప్రభుత్వం అత్యుత్తమ భారతరత్న పురస్కారమును 9 ఫిబ్రవరి 2024 లో ప్రకటించి వారి కుమారుడు శ్రీ పి. ప్రభాకర్ రావు గారికి అందించుట జరిగింది. పి.వి బహుముఖ ప్రజ్ఞాశాలి, మౌనముద్రలోనే భవిష్యత్తును అంచనా వేస్తూ ముందుకు సాగిన మహోన్నతమైన వ్యక్తి జీవన యాత్ర నేటి యువతకు స్ఫూర్తిదాయకం కాగలరని ఆశిస్తూ భారతరత్న పివి గారికి 21వ వర్ధంతి సందర్భంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

**జి.వి. సుబ్బారావు, అధ్యక్షుడు**
**తెలంగాణ గాంధీ స్మారక నిధి,**
**హైద్రాబాద్**
**ఫోన్ 9440296710**

# కవితా కళానిధి బలిజేపల్లి

కాలం ఏదైనా, ప్రజల వినోదం కోసం అత్యధికంగా ఆదరింపబడిన కళ నాటకం. 20 వ దశ కారంభంలో ఒకరు నాటకీకరించిన కథనే స్వీకరించి పలువురు అనువదించ డం, అదే కథనే నాటకాలుగా రాయడం జరిగింది. నాటకాలలో పద్యాలకు, పాటలకు ప్రాధాన్యత అధికంగా ఇచ్చిన కాలమది. ఈ విధంగా పలు పలువురు రచయితలు అత్యధికంగా రాసి ప్రదర్శనలకు అవకాశం కల్పించిన నాటకం సత్య హరిశ్చంద్ర. అందునా బలిజేపల్లి లక్ష్మీకాంత కవి హరిశ్చంద్ర నాటకం మిగుల ప్రజాదరణ పొందింది. ఎందరో నాటక రచయితలకు సినిమా నిర్మాత దర్శకులకు స్ఫూర్తిని కలిగించిన లక్ష్మీకాంత కవి గురించి తెలియ పరిచే చిరు ప్రయత్నం ఇది. బలిజేపల్లి లక్ష్మీకాంతం లేదా లక్ష్మీకాంత కవి (డిసెంబరు 23, 1881 – జూన్ 30, 1953) స్వాతంత్ర్య సమరయోధులు, అవధాని, నాటక రచయిత, రంగస్థల, సినిమా నటులు. "తిరమై సంపదలెల్ల వెంట నొకరీతిన్"...'మాయామేయ జగంబె నిత్యమని, సంభావించి'... 'చతురంభోధి పరీత భూధరణీ రక్షాదక్ష' ... సాగిరావు ఏరికిన్ ఏసరికి యేపాటు విధించెనో... "దళమౌ పయ్యేదలో నడం గియు...లాంటి హరిశ్చంద్ర నాటకంలోని పద్యాల మాధుర్యాన్ని ఒకసారైనా ఆస్వాదించని తెలుగు నాటక అభిమానులు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. ఇవి అన్నీ బలిజేపల్లి లక్ష్మీకాంత కవి విరచిత 'సత్య హరిశ్చంద్రీయము' నాటకం లోనివే. భారతీయ భాషల్లో 'హరిశ్చంద్ర' నాటకానికి ఒక ప్రత్యేక స్థానముంది. మూకీ యుగంలో నాలుగు సార్లు, టాకీ యుగంలో ఇరవై సార్లు వెండి తెర కెక్కిన ఒకే ఒక కథ ఇది. 1913లో చలనచిత్ర పితామహుడు దాదా సాహెబ్ ఫాల్కే 'రాజా హరిశ్చంద్ర' సినిమాను పూర్తిస్థాయి మూకీ చిత్రంగా మరాఠీలో నిర్మిం చిన తరవాత అదే కథను 'సత్య వాది రాజా హరిశ్చంద్ర' పేరుతో మరాఠీలోనే 1917లో లఘు చిత్రంగా నిర్మించారు. ఇదే మూల కథను 'సత్యవాది రాజా హరిశ్చంద్ర' పేరుతోనే రుస్తుంజీ ధోతీవాలా కూడా బెంగాలీ భాషలో నిర్మిం చాడు. తెలుగులో 1935లో ఒకసారి 1956లో మరొక సారి 1965లో చివరి సారి హరిశ్చంద్ర సినిమా వచ్చింది. ఇన్నిసార్లు ఇదే కథను సినిమాగా మలచడానికి కారణం... ఆ నాటికే ముందే ఆ నాటకం ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేయడమే. ఆ నాటక కర్త కవితా కళానిధి బలిజేపల్లి కావడం తెలుగు వాళ్లకు గర్వకారణం. ఆ నాటకంలోని పద్యాలు, సంభాష ణలు నాడు వెలుగు వారి నోళ్లలో నిరంతరం నానుతునే ఉండేవి. 1935లో తెలుగు తొలిటాకీ చిత్రం 'భక్త ప్రహ్లాద' నిర్మించిన స్టార్ ఫిలిం కార్పొరేషన్ సంస్థ 'హరిశ్చంద్ర' సినిమాను తెలుగులో నిర్మించి నప్పుడు బలిజేపల్లి నాటకాన్ని స్ఫూర్తిగా తీసుకోవడం గమనార్హం. ఆ



చిత్రానికి మాటలు, పాటలు, పద్యాలు బలిజేపల్లి కవే సమ కూర్చడం విశేషం. 1936లో అదే ఈస్ట్ ఇండియా కంపెనీ వారు సి. పుల్లయ్య దర్శకత్వంలో 'సతీ అనసూయ', 'ధృవ విజయము' జంట సినిమా లను నిర్మించారు. ఈ చిత్రాల నిర్మాణం కలకత్తాలోనే జరిగింది. ఈ చిత్రాలకు కథ, మాటలు, పాటలు, పద్యాలు రాసేందుకు బలిజేపల్లిని చిత్తజల్లు పుల్లయ్య కలకత్తాకు ఆహ్వానించారు. తెలుగులో వచ్చిన తొలిబాలల చిత్రం ధృవ విజయం కావడం విశేషం. 1938లో జయా ఫిలిమ్స్ సంస్థ చిత్రపు నరసింహారావు దర్శకత్వంలో తొలి చిత్రంగా 'కృష్ణ జరాసంధ' సినిమాను నిర్మించింది. వేలూరి శివరామశాస్త్రి రచించిన కథకు బలిజేపల్లి పాటలు, పద్యా లు సమకూర్చారు. 1939లో జగదీశ్ ఫిలిమ్స్, అధినేత వై.వి.రావు (యరగు డిపాటి వరద రావు) దర్శకత్వంలో 'మళ్ళీ పెళ్లి' అనే సాంఘిక చిత్రాన్ని నిర్మించారు. ఆ చిత్రానికి మాటలు, పాటలు బలిజేపల్లి రాశారు. 1921–23 ప్రాంతాల్లో కాళ్ళకూరి నారాయణ రావు వరకట్న పిశాచిని నిరసిస్తూ 'వరవిక్రయం' అనే నాటకాన్ని రచించారు. ఆ నాటకానికి బలిజేపల్లి మాటల తోబాటు అందుకు అవసరమైన పాటలు కూడా రచించి మంచి స్క్రిప్టును తయారు చేశారు. పుల్లయ్య కోరికమీద అందులో బలిజేపల్లి పిసినిగొట్టు భూస్వామి 'సింగరాజు లింగరాజు' పాత్రను పోషించారు. 1940లో బలిజేపల్లి ఎ.వి.ఎం వారు నిర్మించిన 'భూకైలాస్', న్యూటన్ స్టూడియో తరఫున వై.వి.రావు నిర్మాణ దర్శకత్వంలో వచ్చిన 'విశ్వమోహిని' సినిమాలకు సంభాషణలు సమకూర్చారు. శ్రీజగదీశ్ సంస్థ బ్యానర్ మీద దర్శకనిర్మాత సమర్పించిన రెండవ చిత్రం 'విశ్వమోహిని'. ఈ చిత్రానికి మాటలు, పాటలు సమకూర్చింది బలిజేపల్లి లక్ష్మీకాంతం. 1942లో "జీవన్ముక్తి" చిత్రానికి మాటలు పాటలు సమకూర్చిన బలిజేపల్లి 'రాజగురు' పాత్రను పోషించారు. బుర్రకథను ఆధారం చేసుకొని బాలనాగమ్మ' చిత్రాన్ని నిర్మించగా, బలిజేపల్లి అద్భుతమైన కథను సమకూర్చి, దానికి సంభా షణలు, పాటలు రాశారు. ఇందులో బలిజేపల్లి నవభోజరాజు పాత్రను పోషించడం విశేషం. 1944లో శ్రీజగదీష్ ఫిలిమ్స్ వై.వి.రావు 'తహసిల్దార్' అనే చిత్రాన్ని నిర్మించగా బలిజేపల్లి 'సీతయ్య', 'పానకాలు' అనే రెండు పాత్రలను పోషించారు. బలిజేపల్లి రచించిన నవల 'బ్రహ్మరథం' ఆధారంగా 1947లో శ్రీవెంకట్రామా పిక్చర్స్ బ్యానర్ మీద మీర్జాపురం రాజావారు ప్రధమ కానుకగా చిత్రపు నారాయణమూర్తి దర్శకత్వంలో 'బ్రహ్మరథం' చిత్రాన్ని నిర్మించగా, చిత్రానికి కథ, మాటలు, పాటలు బలిజేపల్లి సమకూర్చారు. బలిజేపల్లి కథ, మాటలు, పాటలు సమకూర్చి నటించిన చివరి సినిమా 'రక్షరేఖ' (1949). ఆర్. పద్మనాభన్ నిర్మించి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అక్కినేని నాగేశ్వరరావు, భానుమతి, అంజలీదేవి, కస్తూరి శివరావు, వంగర వెంకటసుబ్బయ్య, కనకం, గంగారత్నం ముఖ్య తారాగణం. ఇందులో బలిజేపల్లి ప్రతాప మహారాజు పాత్రను పోషించారు. అక్కినేని ఆయన కొడుకు సుధాకరుడుగా నటించారు. గుంటూరు జిల్లా బాపట్ల తాలూ కా ఇటికంపాడులో 23 డిసెంబర్, 1881 సంవత్సరంలో నరసింహ శాస్త్రి, ఆదిలక్ష్మమ్మలకు జన్మించిన బలిజే పల్లి 30 జూన్,1953న కాళహస్తిలో పరమ పదించారు.

## ఢిల్లీ హైకోర్టులో పవన్, ఎన్టీఆర్ వ్యక్తిత్వ హక్కుల పిటిషన్లపై విచారణ.. కీలక ఆదేశాలు జారీ

**హైదరాబాద్ :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, టాలీవుడ్ అగ్రహీరో ఎన్టీఆర్ దాఖలు చేసిన వ్యక్తిత్వ హక్కుల పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టు ఈ రోజు విచారణ చేపట్టింది. సోషల్ మీడియాలో తమ ఫొటోలు, వీడియోలను అనుమతి లేకుండా వాణిజ్య ప్రకటనల కోసం వినియోగించడం, తప్పుడు ప్రచారం చేయడం వల్ల తమ వ్యక్తిత్వ హక్కులకు భంగం కలుగుతోందని పవన్, తారక్ తమ పిటిషన్లలో పేర్కొన్నారు. వీరిద్దరి తరఫున సీనియర్ న్యాయవాది సాయి దీపక్ వాదనలు వినిపించారు. మార్ఫింగ్ ఫొటోలు, అవమానకర పోస్టులు విస్తృతంగా ప్రచారంలో ఉన్నాయని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసుల్లో అమెజాన్, గూగుల్, ఫ్లిప్‌కార్ట్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఇప్పటికే కొన్ని లింకులను తొలగించినట్లు ప్రతివాదులు కోర్టుకు వివరించారు. అయితే, తొలగించిన లింకులపై ఆదేశాలు జారీ చేయడానికి ముందు సంబంధిత ఖాతాదారులకు వాదనలు వినిపించే అవకాశం ఇవ్వాలని న్యాయస్థానం పేర్కొంది. గూగుల్ తమ వినియోగదారులకు ఈ విషయాన్ని తెలియజేయాలని లేదా ఖాతాలను నిలిపివేయాలని ఆదేశించింది. సంబంధిత బీఎస్ఐ, ఐపీ లాగిన్ వివరాలను మూడు వారాల్లోగా అందించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అలాగే, తదుపరి విచారణను మే 12వ తేదీకి వాయిదా వేసింది. జస్టిస్ మన్మీత్ ప్రీతం సింగ్ అరోరా ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ చేపట్టింది.

## బీఆర్ఎస్. బీజేపీలు కలిసి పనిచేశాయి

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై మంత్రి జూపల్లి కృష్ణారావు సెటైర్లు వేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు ఎదురుదెబ్బ తగిలిందని... పార్టీ బలహీనమయిందని గ్రహించే కేసీఆర్ ఫామ్ హౌస్ ను వదిలి ఇప్పుడు బయటకు వచ్చారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ రెండేళ్ల పాలనకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రిఫరెండం అని చెప్పారు. సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ కలిసి పని చేశాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ పాలనపై కేసీఆర్, కేటీఆర్ చేసిన ఆరోపణలు తప్పు అంటూ ప్రజలు తీర్పును వెలువరించారని చెప్పారు. కేసీఆర్ బయటకు వచ్చింది ప్రాజెక్టుల కోసం కాదని... పార్టీని కాపాడుకోవడం కోసమేనని అన్నారు. ఎన్నికలు జరిగిన రెండేళ్ల తర్వాత బయటకు వచ్చిన కేసీఆర్... వచ్చీ రాగానే తోలు తీస్తానని అంటున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీకి తోలు మాత్రమే మిగిలిందని, కండలు కరిగిపోయాయని అన్నారు. రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పుల కుప్పగా మార్చిందని దుయ్యబట్టారు. ఆ అప్పులకు వడ్డీలు కడుతూనే సంక్షేమ పథకాలను అమలు చేయడం తమ ప్రభుత్వ సమర్థత అని చెప్పారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును కుర్చీ వేసుకుని పూర్తి చేస్తానని చెప్పిన కేసీఆర్... పదేళ్ల పాలనలో ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. రూ. 8 లక్షల కోట్ల అప్పు చేసినా ఒక ఎకరాకు కూడా కేసీఆర్ నీళ్లు ఇవ్వలేదని విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు తాగునీటి ప్రాజెక్టు అంటూ సుప్రీంకోర్టులో కేసు వేసిన కేసీఆర్... ఇప్పుడు ఆ ప్రాజెక్టును సాగునీటి ప్రాజెక్టు అంటున్నారని దుయ్యబట్టారు.

## కాళేశ్వరం కూలిపోవడానికి కేసీఆరే కారణం

**హైదరాబాద్ :** దాదాపు రెండేళ్ల తరువాత తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజకీయాల్లో యాక్టివ్ అయ్యారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జలవనరులను సద్వినియోగం చేసుకోలేదని, పంటలు ఎండిపోతున్నాయని విమర్శించారు. కేసీఆర్ వ్యాఖ్యలపై, బీఆర్ఎస్ పాలనపై ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల విషయంలో గత ప్రభుత్వం అనుసరించిన తీరుపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 10 పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్, రాష్ట్రంలో కీలకమైన సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని ఆయన ఆరోపించారు. పదేళ్ల సుదీర్ఘ పాలనలో కేసీఆర్ పాలమూరు-రంగారెడ్డి, ఎస్ఎల్‌బీసీ, దిండి వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేకపోయారో సమాధానం చెప్పాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల ప్రజలు ఈ ప్రాజెక్టుల జాప్యంపై కేసీఆర్‌ను ప్రశ్నిస్తున్నారని తెలిపారు. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి మాజీ సీఎం కేసీఆర్ చెబుతున్నవన్నీ అవాస్తవాలని, సీఎంగా చేసిన వ్యక్తికి ఇలాంటి మాటలు తగవని హితవు పలికారు. నీటిపారుదల ప్రాజెక్టుల పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయల అప్పులు తెచ్చింది. కానీ రాష్ట్రంలో ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తిస్థాయిలో పూర్తి చేయలేకపోయిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ రాష్ట్రాన్ని భారీ అప్పుల ఊబిలోకి నెట్టినందుకు కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం ఏర్పడక ముందు ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడంలో కేసీఆర్ ఘోరంగా విఫలమయ్యారని, కృష్ణా జలాల విషయంలో పాలమూరు, నల్గొండ జిల్లాలకు తీరని అన్యాయం చేసింది ఃఖీూ ప్రభుత్వమేనని మండిపడ్డారు. ప్రాజెక్టు బ్యారేజీలు కుంగిపోవడానికి కేసీఆర్ నిర్ణయాలే కారణమని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. ప్రాజెక్టుల నిర్మాణ తీరును నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీతో పాటు సుప్రీంకోర్టు జడ్జి కూడా తప్పుబట్టారని ఆయన గుర్తు చేశారు. కేవలం కమీషన్ల కోసమే ప్రాజెక్టు అంచనాలను భారీగా పెంచారని, కూలిపోయే ప్రాజెక్టులను కట్టిన కేసీఆర్ ఇప్పుడు ఇరిగేషన్ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా జలాలను కాపాడుకోవడంలో అత్యంత సమర్థంగా ముందుకు సాగుతోందని, రైతుల ప్రయోజనాల కోసం కృషి చేస్తుందని మంత్రి ఉత్తమ్ పునరుద్ఘాటించారు. కేంద్ర ప్రభుత్వం పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టు డీపీఆర్ ను వెనక్కి పంపితే తెలంగాణ ప్రభుత్వం కనీసం నోరు విప్పడం లేదని, పోరాటం చేయలేదని కేసీఆర్ ఆరోపించారు. పైగా తమకు 45 టీఎంసీలు ఇప్పించాలని ఇరిగేషన్ మంత్రి కేంద్రానికి లేఖ రాయడం దారుణం అన్నారు. న్యాయంగా రావాల్సిన వాటాను దక్కించుకోలేని దద్దమ్మ ప్రభుత్వం, చేతకాని ప్రభుత్వం ఫార్మా సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందని కేసీఆర్ ఆరోపించారు. ఫ్యూచర్ సిటీ లేదు, తొక్కా లేదు అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బిజినెస్ మీట్స్ పెట్టి, ఇన్వెస్టిమెంట్స్ వచ్చాయంటూ దొంగ లెక్కలు చూపి ప్రజలను తామెన్నడూ మోసం చేయలేదని కేసీఆర్ పేర్కొన్నారు

## పద్మశాలిలకు 4 కార్పొరేషన్‌లను తక్షణమే ఏర్పాటు చేయాలి

### రైతు బంధు తరహాలో చేనేత బంధును అందించాలి

### తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం

**హైదరాబాద్ :** పద్మశాలిలకు 4 కార్పొరేషన్ లను తక్షణమే ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ సంఘం అధ్యక్ష, కార్యదర్శి వల్లకాటి రాజ్ కుమార్,అప్పం శ్రీనివాసరావు మాట్లాడుతూ... పద్మశాలీ లను ఆదుకునేందుకు రైతు బంధు తరహాలో చేనేత బంధును అందించాలన్నారు. అలాగే చేనేత రుణమాఫీ కోసం ప్రభుత్వం ప్రకటించిన 33 కోట్లు విడుదల చేయాలని చేనేత సహకార సంఘాల ఎన్నికలు జరపాలని కోరుతున్నామన్నారు. ఈ నాలుగు కార్పొరేషన్ లో పద్మశాలీలు కాని వారిని చైర్మన్ లుగా నియమించరాదన్నారు. చేనేత పెన్షన్ అందరికీ అందిస్తు కనీసం 5వేలు ఉండేటట్లు చూడాలన్నారు.

## కోరుట్ల సాయి జీనియస్ హైస్కూల్లో ఘనంగా గణితశాస్త్ర దినోత్సవ వేడుకలు

**కోరుట్ల :** పట్టణం భీమునిదుబ్బలోని సాయి జీనియస్ హై స్కూల్లో సోమవారం గణిత శాస్త్ర మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని గణితశాస్త్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు గణిత శాస్త్రానికి సంబంధించిన పలు చిత్రాలు, గణిత నమూనాల ప్రదర్శించి అందరి ప్రశంసలు పొందా రు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల కరస్పాండెంట్ చౌకి రమేష్ మాట్లాడుతూ స్వర్గీయ శ్రీనివాస రామానుజన్ జీవిత విశేషాలు, గణితశాస్త్ర అభివృద్ధికి ఆయన చేసిన అమూల్యమైన కృషి, సాధించిన విశేష విజయాల గురించి వివరించారు. అలాగే విద్యార్థులు కష్టంగా భావించే గణితాన్ని సులభంగా ఎలా నేర్చుకోవాలి, గణితశాస్త్ర సిద్ధాంతాలపై అవగాహన ఎలా పెంచుకోవాలో సూచనలు చేశారు. ఇందులో భాగంగా గణిత నమూనాల ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల అందజేశారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ చౌకి సుధా మాట్లాడుతూ విద్యార్థులు గణితంపై మరింత ఆసక్తిని పెంపొందించుకొని భవిష్యత్తులో మంచి ఇంజినీర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు.

# శీతాకాలంలో పచ్చి ఉల్లిపాయలు తింటున్నారా..?



పచ్చి ఉల్లిపాయలు కేవలం రుచిని మాత్రమే కాదు, అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. వీటిలోని ఫైబర్ జీర్ణక్రియకు సహాయపడి, మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. సల్ఫర్ సమ్మేళనాలు రక్తంలో చక్కెరను నియంత్రిస్తాయి. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. వేసవిలో శరీర ఉష్ణోగ్రతను నియంత్రించి, హీట్ స్ట్రోక్ నుండి రక్షిస్తాయి. ఆహారంలో పచ్చి ఉల్లిపాయలు లేకపోతే చాలామందికి భోజనం అసంపూర్ణంగా అనిపిస్తుంది. సైడ్ డిష్ అయినా, సలాడ్ అయినా, ఉల్లిపాయలు ఆహారానికి క్రంచీనెస్, రుచి, తాజాదనాన్ని అందిస్తాయి. ఉల్లిపాయలను రోటీ, బిర్యానీలతో చాలామంది తీసుకుంటారు. ఇవి సాధారణ ఆహారాల రుచిని కూడా పెంచుతాయి. చాలా మంది పచ్చి ఉల్లిపాయలు తినడానికి ఇష్టపడతారు. కానీ, అవి నిజంగా ఉపయోగకరంగా ఉంటాయా..? లేదా ఎప్పుడైనా హానికరం అవుతాయా..? అని మీరు ఎప్పుడైనా ఆలోచించారా? ఇవి ఆరోగ్యానికి మంచిదేనా? పచ్చి ఉల్లిపాయలలోని ఫైబర్, ప్రీబయోటిక్ ఆరోగ్యకరమైన జీర్ణక్రియకు మద్దతు ఇస్తాయి. ఇవి పేగులలోని బ్యాక్టీరియాను పోషిస్తాయి. మలబద్ధకాన్ని తగ్గిస్తాయి. సున్నితమైన జీర్ణ ప్రక్రియను ప్రోత్సహిస్తాయి. పచ్చి ఉల్లిపాయలలో విటమిన్ సి, బలమైన యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తాయి. మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. పచ్చి ఉల్లిపాయలలో సహజంగా చల్లబరిచే గుణాలు ఉన్నాయి. ఇది శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడంలో సహాయపడుతుంది. వేడి వాతావరణంలో హీట్ స్ట్రోక్ నుంచి రక్షణ కల్పిస్తుంది. ఉల్లిపాయలలోని సల్ఫర్ సమ్మేళనాలు, ఫ్లేవనాయిడ్లు రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడానికి సహాయపడతాయి. ఇవి ముఖ్యంగా రోజువారీ ఆహారంలో చేర్చుకున్నప్పుడు మంచి గ్లూకోజ్ నియంత్రణకు సహాయపడతాయి. పచ్చి ఉల్లిపాయలు చెడు కొలెస్ట్రాల్ను తగ్గించి రక్త ప్రసరణను మెరుగుపరచడం ద్వారా గుండె జబ్బులను మెరుగుపరుస్తాయి. వాటిలోని యాంటీఆక్సిడెంట్లు గుండె సంబంధిత పనితీరును ప్రభావితం చేస్తాయి. మంటను తగ్గించడంలో సహాయపడతాయి. ఉల్లిపాయలు పొటాషియంకు మంచి మూలం. ఇది అధిక రక్తపోటును తగ్గించడానికి తెలిసిన ఒక ఖనిజం. ఇది గుండె పనితీరుకు మద్దతు ఇస్తుంది. శరీరంలో ఆరోగ్యకరమైన ద్రవాల సమతుల్యతను నిర్వహించడానికి సహాయపడుతుంది.

## నిద్ర లేచిన వెంటనే తలనొప్పి వస్తుందా?



శీతాకాలంలో చాలా మందికి ఉదయం నిద్రలేచిన వెంటనే తలనొప్పి వస్తుంది. ఈ నొప్పి తేలికగా ఉండవచ్చు.. లేదంటే రోజంతా ఇబ్బంది పెట్టొచ్చు! కానీ ఇలా ఉదయం పూట వచ్చే తల నొప్పిని విస్మరించకూడదు. ఎందుకంటే ఇది మీరు తినే ఆహారాల వల్ల లేదా శరీరంలో పోషకాల కొరత వల్ల సంభవించవచ్చు. శీతాకాలంలో చాలా మందికి ఉదయం నిద్రలేచిన వెంటనే తలనొప్పి వస్తుంది. ఈ నొప్పి తేలికగా ఉండవచ్చు.. లేదంటే రోజంతా ఇబ్బంది పెట్టొచ్చు! కానీ ఇలా ఉదయం పూట వచ్చే తల నొప్పిని విస్మరించకూడదు. ఎందుకంటే ఇది మీరు తినే ఆహారాల వల్ల లేదా శరీరంలో పోషకాల కొరత వల్ల సంభవించవచ్చు. శీతాకాలంలో శరీర జీవక్రియ మందగిస్తుంది. ఇది రక్త ప్రసరణను ప్రభావితం చేస్తుంది. మెదడుకు తగినంత ఆక్సిజన్ అందకుండా చేస్తుంది. అంతే కాదు రోజువారీ ఆహారంలో పోషకాలు లేకపోవడం వల్ల కూడా తలనొప్పి వచ్చే అవకాశం ఉంది. కాబట్టి మీరు ప్రతి ఉదయం నిద్ర లేచిన వెంటనే తలనొప్పి వస్తే దానిని తేలికగా తీసుకోకపోవడమే బెటర్. ఇది మీ శరీరానికి సరైన పోషకాహారం, సమతుల్య ఆహారం అవసరమని చెప్పే సంకేతం కావచ్చు. మీకూ ఇలాంటి తలనొప్పి వస్తుందా? ఐతే దీనిని నివారించడానికి ఏ రకమైన ఆహారాలు తినాలో ఇక్కడ తెలుసుకుందాం.. ఆహారంలో కొన్ని ముఖ్యమైన పోషకాలు లోపించడం వల్ల ఇది జరుగుతుంది. ముఖ్యంగా మెగ్నీషియం లోపం వల్ల నరాల మీద ఒత్తిడి ఏర్పడుతుంది. ఇది తలనొప్పి, మైగ్రేన్ వంటి సమస్యలను పెంచుతుంది. విటమిన్ బి2, బి12 లోపం కూడా ఈ సమస్యకు కారణమే. అంతే కాదు శీతాకాలంలో తక్కువగా నీరు తాగకపోవడం, ఆహారంలో ఐరన్, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు లేకపోవడం వల్ల కూడా ఈ తలనొప్పి వస్తుంది. ఉదయం తలనొప్పి తగ్గాలంటే పోషకాలు అధికంగా ఉండే ఆహారాలు తినాలి. మెగ్నీషియం కోసం బాదం, గుమ్మడికాయ గింజలు, పాలకూర, అరటిపండ్లు తిపాలి. ఇవి నరాలను సడలించి నొప్పిని తగ్గిస్తాయి. విటమిన్లు బి12, బి2 కోసం గుడ్లు, పాలు, పెరుగు, తృణధాన్యాలు ప్రయోజనకరంగా ఉంటాయి. ఎందుకంటే ఈ రకమైన ఆహారాలు మెదడుకు శక్తిని అందిస్తాయి. ఉదయం పూట కనిపించే బద్ధకాన్ని కూడా తగ్గిస్తాయి. ఇనుము కోసం పాలకూర, బెల్లం, చిక్‌పీస్, పప్పు ధాన్యాలు తీసుకోవాలి. ఎందుకంటే ఇవి రక్తంలో సరైన ఆక్సిజన్ స్థాయిలను నిర్వహించడానికి సహాయపడతాయి. ఒమేగా-3 కొవ్వు ఆమ్లాల కోసం వాల్‌నట్స్, అవిసె గింజలు, చియా గింజలు అద్భుతమైన ఎంపికలు. ఈ ఆహారాలు శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. తలనొప్పిని నియంత్రించడంలో సహాయపడతాయి.

## గుండెపోటు వచ్చిన వెంటనే ఇలా చేస్తే.. ప్రాణం పదిలమే!



గుండెపోటు లక్షణాలు మగవారికన్నా ఆడవారిలో భిన్నంగా ఉండొచ్చు. నిజానికి పురుషులతో పోలిస్తే మహిళలకు గుండె జబ్బు ముప్పు తక్కువ. దీనికి కారణం ఈస్ట్రోజన్ రక్షణ. కానీ నెలసరి నిలిచిన తర్వాత ఈస్ట్రోజన్ మోతాదులు తగ్గటం వల్ల గుండె జబ్బు ముప్పూ పెరుగుతుంది. గుండెపోటు లక్షణాలు మగవారికన్నా ఆడవారిలో భిన్నంగా ఉండొచ్చు. నిజానికి పురుషులతో పోలిస్తే మహిళలకు గుండె జబ్బు ముప్పు తక్కువ. దీనికి కారణం ఈస్ట్రోజన్ రక్షణ. కానీ నెలసరి నిలిచిన తర్వాత ఈస్ట్రోజన్ మోతాదులు తగ్గటం వల్ల గుండె జబ్బు ముప్పూ పెరుగుతుంది. పైగా వీరిలో ఛాతీ నొప్పికి బదులు ఏదో తెలియని నిస్సత్తువ, తల తేలిపోవటం, కడుపు నొప్పి.. మెడ, భుజాలు, వీపులో నొప్పి వంటి లక్షణాలు పొడసూపొచ్చు. కొన్నిసార్లు కేవలం ఆయాసం మాత్రమే ఉండొచ్చు. సరైన కారణమేదీ లేకుండా శ్వాస తీసుకోవటం కష్టంగా అనిపించొచ్చు. కాబట్టి వీటినీ హెచ్చరిక సంకేతాలుగానే చూడాలి. గుండెపోటు వచ్చినప్పుడు అందరూ చాలా భయపడతారు. అయితే గుండెపోటు సమయంలో సరైన చర్యలు తీసుకుంటే ఆ వ్యక్తి ప్రాణాలను కాపాడవచ్చు. కాబట్టి, ఎవరికైనా గుండెపోటు వచ్చినప్పుడు వీలైనంత త్వరగా వైద్య సహాయం అందించాలి. ఎంత త్వరగా వైద్య సహాయం అందితే బతికే అవకాశం అంత ఎక్కువగా ఉంటుంది. గుండెపోటు వల్ల మరణాల రేటు 5 నుంచి 10 శాతం వరకు ఉంటుంది. సంబంధిత వ్యక్తిలో గుండెపోటు లక్షణాలు కనిపించడం ప్రారంభిస్తే, వెంటనే అతన్ని ఆసుపత్రిలో చేర్చాలి. గోల్డెన్ అవర్ సమయంలో వ్యక్తికి చికిత్స అందితే అతని ప్రాణాలను కాపాడవచ్చు. అందుకే గుండెపోటు వచ్చినప్పుడు గోల్డెన్ అవర్ చాలా ముఖ్యమైనది. దీనితో పాటు గుండెపోటును నివారించడానికి క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం అవసరం. దీనితో పాటు జీవనశైలిలో మార్పులు కూడా అవసరం. గుండెపోటు వస్తే రోగికి వెంటనే జ్వా= ఇవ్వాలి. ఇది రోగి ప్రాణాలను కూడా కాపాడుతుంది. దీనితో పాటు గుండెపోటును నివారించడానికి క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం అవసరం.

## వర్కవుట్స్ ఏ టైమ్‌లో చేస్తున్నారు?

ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం తప్పనిసరి. కానీ, చాలామందిని వేధించే అతిపెద్ద సందేహం ఏంటంటే.. వ్యాయామం ఎప్పుడు చేయాలి? పొద్దున్నే నిద్రలేచి చెమట చిందించాలా లేక రోజంతా పనులు ముగించుకుని రాత్రి పూట జిమ్‌కు వెళ్లాలా? ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం తప్పనిసరి. కానీ, చాలామందిని వేధించే అతిపెద్ద సందేహం ఏంటంటే.. వ్యాయామం ఎప్పుడు చేయాలి? పొద్దున్నే నిద్రలేచి చెమట చిందించాలా లేక రోజంతా పనులు ముగించుకుని రాత్రి పూట జిమ్‌కు వెళ్లాలా? ఏ సమయంలో వర్కవుట్ చేస్తే త్వరగా బరువు తగ్గుతారు? ఏది మన బాడీకి ఎక్కువ ఎనర్జీని ఇస్తుంది? నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఉదయం వేళ వ్యాయామం చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఉదయాన్నే వర్కవుట్ ముగించుకుంటే, రోజంతా ఇతర పనులపై దృష్టి పెట్టవచ్చు. దీనివల్ల వ్యాయామం మిస్ అయ్యే అవకాశం తక్కువ. ఉదయం ఎండలో లేదా తాజా గాలిలో వ్యాయామం చేయడం వల్ల రాత్రి పూట గాఢ నిద్ర పడుతుంది. రోజంతా చురుగ్గా ఉండటానికి, మెటబాలిజం రేటు పెరగడానికి ఉదయం వర్కవుట్స్ ఎంతగానో తోడ్పడతాయి.కొందరికి రాత్రి పూట వ్యాయామం చేయడం వల్ల అద్భుతమైన ఫలితాలు వస్తాయి. రోజంతా ఆహారం తీసుకోవడం వల్ల సాయంత్రం వేళ మన శరీరంలో ఎనర్జీ లెవల్స్ ఎక్కువగా ఉంటాయి. దీనివల్ల బరువులు ఎత్తడం లేదా కఠినమైన వ్యాయామాలు చేయడం సులభం అవుతుంది. ఆఫీస్ టెన్షన్లు, ఇంటి పనుల ఒత్తిడి తర్వాత రాత్రి చేసే వర్కవుట్ మనసును తేలికపరుస్తుంది. ఉదయం బాడీ కొంచెం స్టిఫ్ గా ఉంటుంది. అదే సాయంత్రం అయితే కండరాలు వేడెక్కి ఉండటం వల్ల గాయాలయ్యే ముప్పు తక్కువ. నిపుణులు చెబుతున్న దాని ప్రకారం.. ఉదయం లేదా రాత్రి అనేదాని కంటే ఏ సమయంలో వ్యాయామం చేసినా, దాన్ని రోజూ క్రమం తప్పకుండా చేస్తున్నారా లేదా అన్నదే ప్రధానం. బరువు తగ్గాలనుకునే వారు ఉదయం వ్యాయామం చేయడం మంచిది. ఉదయం ఖాళీ కడుపుతో చేసే కార్డియో వ్యాయామాలు ఫ్యాట్ బర్న్ చేయడానికి మేలని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. కండరాల పుష్టి కోసం వ్యాయామం చేయాలనుకుంటే సాయంకాలమే మంచి సమయం. సాయంత్రం వేళ వర్కవుట్ చేయడం వల్ల శరీరపుష్టి సాధ్యమవుతుంది. చివరిగా నిపుణులు చెప్పేది ఒక్కటే.. మీ జీవనశైలికి, మీ శరీర తత్వానికి ఏ సమయం సెట్ అవుతుందో అదే మీకు బెస్ట్ టైమ్. అయితే నిద్రకు కనీసం రెండు మూడు గంటల ముందే రాత్రి వ్యాయామాన్ని ముగించడం మంచిది, లేదంటే నిద్ర పట్టడం కష్టమవుతుంది.




## బిజినెస్

### 2026లో 12 కోట్ల మంది ప్రయాణిస్తారు




త్వరలో కార్యకలాపాలు ప్రారంభించనున్న నవీ ముంబయి విమానాశ్రయం సహా తమ ఎనిమిది విమానాశ్రయాల్లో వచ్చే ఏడాది 12 కోట్ల మంది ప్రయాణిస్తారని అదానీ ఎయిర్‌పోర్ట్స్ అంచనా వేస్తోంది. నవీ ముంబయి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ డిసెంబరు 25న ప్రారంభం కానున్న నేపథ్యంలో అదానీ ఎయిర్‌పోర్ట్ హెూల్డింగ్స్ (ఏఏహెచ్ఎల్) డైరెక్టర్ జీత్ అదానీ పీటీఐతో మాట్లాడారు. విదేశాల్లో ఆస్తుల కొనుగోళ్లను పరిశీలించాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా అన్నారు. దేశీయ మార్కెట్‌పైనే ప్రస్తుతం దృష్టి సారించినట్లు వివరించారు. 'గతేడాది 8–9 కోట్ల మంది ప్రయాణికులు ఏడు విమానాశ్రయాల నుంచి తమ గమ్యస్థానాలకు చేర్చాయి. ఈ ఏడాది 10 కోట్లకు చేరొచ్చు. వచ్చే ఏడాది నవీ ముంబయి విమానాశ్రయం వల్ల ఈ సంఖ్య 12 కోట్లకు చేరుతుంద'ని చెప్పుకొచ్చాయి. ప్రస్తుతం ఏఏహెచ్ఎల్ చేతిలో ముంబయి, అహ్మదాబాద్, తిరువనంతపురం, జైపుర్, లఖ్‌నవూ, గువాహటి, మంగళూరు విమానాశ్రయాలున్నాయి. ఈ ఏడాది అక్టోబరులో ప్రదాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభమైన నవీ ముంబయి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ఈ నెల 25న వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించనుంది.

### 2030 నాటికి 50 లక్షల మందికి శిక్షణ




నూతన సాంకేతిక పరిజ్ఞానానికి అవసరమైన నైపుణ్యం కల మానవ వనరులను తయారు చేయటం కోసం అమెరికా టెక్ కంపెనీ ఐబీఎం భారీ స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు అమలు చేయనుంది. 2030 నాటికి ఏఐ, సైబర్ సెక్యూరిటీ, క్వాంటమ్ కంప్యూటింగ్‌లో 50 లక్షల మందికి శిక్షణ ఇవ్వనుంది. 'ఐబీఎం స్కిల్స్‌బిల్డ్' కింద ఈ కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు వెల్లడించింది. దీనివల్ల విద్యార్థులకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని, అదే సమయంలో వివిధ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కల మానవ వనరులు లభిస్తాయని పేర్కొంది. దీని కోసం స్కూళ్లు, యూనివర్సిటీలు, ఒకేషనల్ విద్యా సంస్థలతో కలిసి పనిచేయనున్నట్లు వివరించింది. ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) సహకారంతో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు, హ్యాకథాన్, ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించింది. 'నవతరం సాంకేతికతల్లో నైపుణ్యాలు, పోటీతత్వాన్ని కలిగి ఉండటం ఎంతో అవసరం. ఏ కొద్ది మందికో ఇవి చేరువ అయితే సరిపోదు. యువతను ఇందుకు సన్నద్ధం చేయటం ద్వారా దేశ సత్వర వృద్ధిలో భాగస్వామి కావాలని అనుకుంటున్నాం' అని ఐబీఎం ఇండియా ఛైర్మన్ అండ్ సీఈఓ అర్విండ్ కృష్ణ తెలిపారు.

# ఈ బ్యాంకులకు కొత్త లోగో.. ఇక ఒకే గుర్తింపు, ఒకే బ్రాండ్

దేశవ్యాప్తంగా ఉన్న ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు ఒకే విధమైన గుర్తింపును ఇచ్చే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఆర్ఆర్‌బీల కోసం ఒకే రకమైన ఉమ్మడి లోగోను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం డిసెంబర్ 18, 2025 రోజున ఆవిష్కరించింది. ఈ చర్య ద్వారా గ్రామీణ బ్యాంకింగ్ వ్యవస్థలో పారదర్శకతను పెంచడంతో పాటు, ఒకే బ్రాండ్ గుర్తింపును తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నూతన లోగో ఆవిష్కరణ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన భారీ విలీన ప్రక్రియలో ఒక భాగం. 'వన్ స్టేట్ వన్ ఆర్ఆర్‌బీ' సూత్రం ఆధారంగా ఆర్థిక సేవల విభాగం ఇప్పటికే 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 26 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను విలీనం చేసింది. ఈ సంస్కరణలు మే 1, 2025 నుంచి అమలులోకి వచ్చాయి. ఈ విలీనం తర్వాత, ప్రస్తుతం దేశంలో 28 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు పని చేస్తున్నాయి. ఇవి 700కు పైగా జిల్లాల్లోని సుమారు 22,000 శాఖల ద్వారా సేవలందిస్తున్నాయి. కొత్తగా ఆవిష్కరించిన లోగోలో మూడు ప్రధాన అంశాలు ఉన్నాయి, ఇవి గ్రామీణ అభివృద్ధి పట్ల బ్యాంకుల నిబద్ధతను తెలియజేస్తాయి. పైకి చూపిస్తున్న బాణం, ఇది ప్రగతికి చిహ్నం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థల వృద్ధి, అభివృద్ధిని ఇది సూచిస్తుంది. చేతులు, ఇవి ఆప్యాయత, భద్రతకు చిహ్నం. గ్రామీణ వర్గాలకు మద్దతుగా నిలుస్తూ, వారికి అండగా ఉంటామని ఈ గుర్తు ప్రతిబింబిస్తుంది. జ్వాల, ఇది జ్ఞానం, సాధికారతకు చిహ్నం. గ్రామీణ ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతను




అందిస్తూ వారిని చైతన్యవంతులను చేయడమే దీని ఉద్దేశం. లోగోలో ఉపయోగించిన రంగులు కూడా ప్రత్యేక అర్థాలను కలిగి ఉన్నాయి. ముదురు నీలం ఇది ఆర్థిక స్థిరత్వం, నమ్మకానికి చిహ్నం. ఆకుపచ్చ ఇది జీవం, గ్రామీణ వృద్ధికి సంకేతం. 'ఈ ఉమ్మడి బ్రాండింగ్ చొరవ ద్వారా ఆర్ఆర్‌బీలకు దేశవ్యాప్తంగా ఒక ఆధునిక, సులభంగా గుర్తించదగిన గుర్తింపు లభిస్తుంది' అని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఆర్థిక సమ్మిళితం, గ్రామీణాభివృద్ధి పట్ల ఈ బ్యాంకుల సామూహిక నిబద్ధతకు ఈ లోగో ఒక సంకేతంగా నిలుస్తుంది. ఈ మార్పు వల్ల గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలపై ప్రజల్లో విశ్వసనీయత మరింత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# ఏడాదికి ఒకేసారి.. టోల్ ఛార్జీ రూ.15 మాత్రమే

జాతీయ రహదారులపై ప్రయణించే ప్రైవేట్ వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం కొద్ది రోజుల క్రితం వార్షిక పాస్‌లు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. చాలా తక్కువ ధరకే ఎక్కువ సార్లు టోల్ గేట్లను దాటేందుకు అవకాశం కల్పిస్తోంది. వార్షిక ఫాస్ట్ ట్యాగ్ పాస్‌లకు భారీ స్పందన లభించినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ తాజాగా వెల్లడించారు. వాహనదారులు పెద్ద సంఖ్యలో వార్షిక ఫాస్ట్ ట్యాగ్‌లను ఉపయోగించుకుంటున్నట్లు చెప్పారు. టోల్ గేట్ల వద్ద అధిక ఛార్జీలను తగ్గించుకునేందుకు వార్షిక ఫాస్ట్ ట్యాగ్‌లు ఎంతగానే ఉపయోగపడతాయన్నారు. ఈ ఏడాది ఆగస్టు నెలలోనే కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ వార్షిక ఫాస్ట్ ట్యాగ్ పాసులను కేంద్రం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నాలుగు నెలల కాలంలోనే 40 లక్షల వార్షిక ఫాస్టా ట్యాగ్ పాస్‌లు జారీ చేసినట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కర తెలిపారు. 2026 నాటికల్లా దేశ వ్యాప్తంగా ఆటో మేటిక్ టోల్ కలెక్షన్ పద్ధతి అమలు కానున్నట్లు తెలిపారు. టోల్ ఛార్జీ కేవలం రూ. 15 పడుతోందని, చాలా తక్కువ ధరకే ప్రైవేట్ వాహనదారులు టోల్ గేట్లను దాటేందుకు అవకాశం లభిస్తుందన్నారు. వార్షిక టోల్ పాస్ కింద ఒకేసారి రూ. 3000 చెల్లిస్తే సరిపోతుంది. ఏడాది మొత్తం ఉపయోగించుకోవచ్చు. లేదంటే 200 టోల్ ప్లాటాలను దాటే అవకాశం ప్రైవేట్ కార్లకు ఈ వార్షిక పాస్ వల్ల కలుగుతోంది. ఒక టోల్ గేట్ వద్ద కేవలం రూ.15 మాత్రమే పడుతుందని చెప్పవచ్చు. విడిగా అయితే ఇందుకు రూ. 15 వేల వరకు అవుతుంది. 2026 కల్లా దేశంలోని నేషనల్ రహదారులపై ఉన్న 1050 టోల్ ప్లాజాల్లో వాహనం ఆపాల్సిన అవసరం లేకుండా ఆటో మేటిక్ టోల్ కలెక్షన్ జరగడానికి ఆధునాతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిస్టమ్ ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. దీంతో వాహనదారులకు టోల్




గేట్ల వద్ద తలెత్తే ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. ఇకపై జాతీయ రహదారులపై రయ్ రయ్ మంటూ దూసుకెళ్లొచ్చని చెప్పవచ్చు.

## స్పోర్ట్స్

# అడిలైడ్‌లో తిప్పేసిన లియాన్.. ఇంగ్లండ్ బ్యాటర్లు అద్భుతం చేస్తారా!

యాషెస్ సిరీస్ సమం చేయాలనుకున్న ఇంగ్లండ్ ఇక ఆశలు వదులుకోవాల్సిందే. రెండు టెస్టుల్లో ఆస్ట్రేలియాకు కనీసం పోటీ ఇవ్వలేకపోయిన ఇంగ్లిష్ టీమ్.. అడిలైడ్‌లోనూ అదే తడబాటుతో ఓటమి అంచున నిలిచింది. ట్రావిస్ హెడ్(170) భారీ శతకంతో పుంజుకున్న ఆసీస్ నాలుగో రోజు కమిన్స్(3–24), నాథన్ లియాన్(3–64)ల విజృంభణతో గెలుపు దిశగా సాగుతోంది. వీరిద్దరి ధాటికి ఇంగ్లండ్ టాపార్డర్ కుప్పకూలగా.. జేమీ స్మిత్(2 నాటౌట్), విల్ జాక్స్(11 నాటౌట్) పోరాడుతున్నారు. ఆఖరి సెషన్‌లో వీరిద్దరూ పట్టుదలగా ఆడడంతో ఆట ముగిసే సరికి 6 వికెట్లు కోల్పోయి 207 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా గడ్డపై యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ మరో ఓటమికి చేరువలో ఉంది. ఇప్పటికే పెర్త్, బ్రిస్బేన్‌లో కంగుతిన్న పర్యాటక జట్టు చావోరేవో పోరులోనూ ఎదురీదుతోంది. అడిలైడ్ టెస్టు నాలుగో ఇన్నింగ్స్‌లో జాక్ క్రాలే(85) అర్ధ శతకంతో ఆశలు రేపినా.. కమిన్స్ (3–24), నాథన్ లియాన్(3–64) వికెట్ల వేటకు టాపార్డర్ కుప్పకూలింది. కమిన్స్ ఓవర్లో జో రూట్(39), లియన్ దెబ్బకు హ్యారీ బ్రూక్(30)లు తేలిపోయారు. స్వల్ప తేడాతో బ్రూక్‌ను, బెన్‌స్టోక్స్(5)ను బౌల్డ్ చేసిన లియాన్ ఇంగ్లండ్‌ను విజయావకాశాల్ని దెబ్బతీశాడు. అర్ధ శతకంతో పోరాడిన క్రాలేను ఔట్ చేసి ఇంగ్లండ్‌ను ఓటమి అంచున నిలిపాడు లియాన్. ఆఖరి సెషన్‌లో జేమీ స్మిత్(2 నాటౌట్), విల్ జాక్స్(11 నాటౌట్)లు వికెట్ కాపాడుకోవడంతో ఆట ముగిసే



సరికి 6 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. యాషెస్ సిరీస్ సమం చేయాలంటే ఇంగ్లండ్ విజయానికి 228 రన్స్ అవసరం. కానీ, చివరి రోజు వీరిద్దరూ సెంచరీలు సాధిస్తే తప్ప గెలుపు అసాధ్యం. ఒకవేళ తొలి సెషన్‌లోనే ఔటయ్యారంటే.. టెయిలెండర్లను కమిన్స్, లియాన్ చుట్టేయడం పక్కా. తొలి ఇన్నింగ్స్‌లో జోఫ్రా ఆర్చర్(5–53) చెలరేగగా ఆసీస్‌ను 371కే కట్టడి చేసిన ఇంగ్లండ్ బ్యాటర్ల వైఫల్యంతో మ్యాచ్‌పై పట్టు సాధించలేకపోయింది.

### టీ20 ప్రపంచకప్ జట్టులో శుభ్‌మన్ గిల్‌కు దక్కని చోటు.. సెలక్షన్ కమిటీ ఛైర్మన్ అగార్కర్ రెస్పాన్స్ ఇదే..!



భారత జట్టు స్టార్ బ్యాట్స్‌మన్ శుభ్‌మన్ గిల్‌కు టీ20 ప్రపంచకప్ కప్‌లో చోటు కోల్పోయాడు. టెస్ట్, వన్డే జట్టు కెప్టెన్‌గా కొనసాగుతున్న గిల్‌కు ఐసీసీ ఈవెంట్‌లో చోటు దక్కకపోవడం అందరినీ షాక్‌కు గురి చేసింది. వాస్తవానికి ఇటీవల గిల్ టీ20ల్లో పేలమైన ఫామ్‌తో ఇబ్బందిపడుతున్నాడు. గాయం కారణంగా ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 మ్యాచ్‌కు సైతం దూరమైన విషయం తెలిసిందే. గిల్ స్థానంలో బ్యాట్స్‌మెన్–వికెట్ కీపర్ సంజూ శాంసన్ తుది జట్టులో చోటు దక్కించుకున్నాడు. శాంసన్ అభిషేక్ శర్మతో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించి.. జట్టుకు శుభారంభం అందించాడు. ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. టీమిండియా భారీ స్కోర్ సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. ఓపెనర్‌గా తనకు తిరుగులేదని మరోసారి నిరూపించుకున్నాడు. దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌కు వరకు టీ20 జట్టులో శుభ్‌మన్ గిల్ వైస్ కెప్టెన్‌గా కొనసాగగా.. గిల్ స్థానంలో వైస్ కెప్టెన్సీ బాధ్యతలను అక్షర్ పటేల్‌కు బీసీసీఐ అప్పగించింది. అదే సమయంలో జాతీయ జట్టుకు దూరమైన వికెట్ కీపర్–బ్యాట్స్‌మెన్ ఇషాన్ కిషన్‌తో పాటు రింకు సింగ్ జట్టులోకి తిరిగి వచ్చారు. ఇషాన్ చివరిసారిగా నవంబర్ 28, 2023న ఆస్ట్రేలియాపై భారత్ తరపున ఆడాడు. అదే అతని చివరి అంతర్జాతీయ మ్యాచ్ కూడా. మరోవైపు, రింకు ఆసియా కప్‌లో భాగంగా ఉన్నాడు, కానీ ఆస్ట్రేలియా దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లలో చోటు దక్కని విషయం తెలిసిందే. అయితే, ప్రపంచకప్‌కు గిల్‌ను ఎంపిక చేయకపోవడంతో సెలక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్ స్పందించారు. జట్టు కూర్పులో భాగంగా గిల్‌ను తప్పించాల్సి వచ్చిందన్నారు. టీమ్ మేనేజ్‌మెంట్ టాప్ ఆర్డర్‌లో వికెట్ కీపర్‌ను ఆడించాలని భావించిందని, అందుకే శుభ్‌మన్ గిల్‌ను తప్పించి సంజూ శాంసన్‌కు అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. శాంసన్‌కు బ్యాకప్‌గా మరో వికెట్ కీపర్ కం బ్యాట్స్‌మెన్ ఇషాన్ కిషన్‌ను జట్టులో చేర్చినట్లు పేర్కొన్నారు.

### విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నీకి బెంగాల్ జట్టు.. చోటు దక్కించుకున్న ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ


విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నీ కోసం బెంగాల్ జట్టును ప్రకటించారు. చాలాకాలంగా జాతీయ జట్టుకు దూరమైన ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ బెంగాల్ జట్టులో తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. గాయం నుంచి కోలుకుతున్న తర్వాత బెంగాల్ తరపున దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తున్నాడు. ప్రస్తుతం దేశవాళీ సీజన్‌లో అన్ని ఫార్మాట్లలో కలిపి 36 వికెట్లు పడగొట్టాడు. విజయ్ హజారే ట్రోఫీలో బెంగాల్ పేస్ బౌలింగ్ భారాన్ని మోయనున్నాడు. దేశవాళీ సీజన్ రంజీ ట్రోఫీతో ప్రారంభమైంది. ఇందులో షమీ నాలుగు మ్యాచ్‌లలో 18.60 సగటుతో 20 వికెట్లు తీశాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టీ20 టోర్నమెంట్‌లోనూ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించాడు. ఏడు మ్యాచుల్లో 14.93 సగటుతో 16 వికెట్లు పడగొట్టాడు. బెంగాల్ జట్టులో భారత పేసర్లు ఆకాశ్ దీప్, ముఖేష్ కుమార్ సైతం చోటు దక్కించుకున్నారు. విజయ్ హజారే ట్రోఫీ కోసం బెంగాల్ జట్టు బాధ్యతలు అభిమన్యు



ఈశ్వరన్‌కు అప్పగించారు. బెంగాల్ ఎలైట్ గ్రూప్–బీలో ఉంది. డిసెంబర్ 24న రాజ్‌కోట్‌లో విదర్భతో తొలి మ్యాచ్ ఆడనున్నది. ఇదే గ్రూప్‌లో అసోం, బరోడా, జమ్మూ కశ్మీర్, హైదరాబాద్, చండీగఢ్, ఉత్తరప్రదేశ్ జట్లు ఉన్నాయి.


**విజయ్ హజారే ట్రోఫీకి బెంగాల్ జట్టు**

అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), అనుస్తుప్ మజుందార్, అభిషేక్ పోరెల్ (వికెట్ కీపర్), సుదీప్ ఘరామి, సుమంత్ గుప్తా, సుమిత్ నాగ్ (వికెట్ కీపర్), చంద్రహాస్ డాష్, షాబాజ్ అహ్మద్, కరణ్ లాల్, మహ్మద్ షమీ, ఆకాశ్ దీప్, ముఖేష్ కుమార్, సయన్ ఘోష్, రవి కుమార్, అమీర్ ఘనీ, విశాల్ భాటి, అంకిత్ మిశ్రా.




# నెల తిరక్కుండానే ఓటీటీలోకి 'ఆంధ్ర కింగ్ తాలూకా'..

రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా' తెలుగు సినీ అభిమాని కథగా నవంబర్ 27న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఈ సినిమా విడుదలై నెల కూడా తిరక్కుండానే ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో డిసెంబర్ 25 నుంచి తెలుగు, హిందీ, తమిళ్, మలయాళం, కన్నడ భాషల్లో ఈ చిత్రం స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. విషయాన్ని తెలుపుతూ నెట్‌ఫ్లిక్స్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. మహేశ్‌బాబు.పి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కన్నడ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో నటించాడు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. సూర్య(ఉపేంద్ర) పేరుమోసిన సూపర్‌స్టార్. అశేషమైన అభిమానుల అతని సొంతం. అయితే.. తనకు బ్యాడ్ పీరియడ్ నడుస్తూ ఉంటుంది. విడుదలైన సినిమాలన్నీ ఫ్లాపులవుతుంటాయి. ఈ క్రమంలో సూర్య వందవ చిత్రం షూటింగ్ మధ్యలోనే ఆగిపోతుంది. చిత్రాన్ని నిర్మించలేనని నిర్మాత చేతులెత్తేస్తాడు. ఓ మూడు కోట్లు ఉంటే సినిమా పూర్తవుతుంది. ఆ మూడు కోట్ల కోసం సూర్య ప్రయత్నాలు మొదలుపెడతాడు. ఈ క్రమంలో ఓ నిర్మాతను డబ్బు అడుగుతాడు. అతను తన కొడుకు హీరోగా పరిచయం అవుతున్న సినిమాలో తండ్రి పాత్ర వేస్తే డబ్బు సర్దుతానంటాడు. ఎన్ని ప్రయత్నాలు చేసినా డబ్బు సమకూరకపోవడంతో చివరికి ఆ నిర్మాత పెట్టిన షరతుకి ఓకే చెప్పాలనుకుంటాడు. తన నిర్ణయాన్ని ఆ నిర్మాతకు చెప్పేలోపే సూర్య అకౌంట్‌లో మూడు కోట్లు పడతాయి. ఆ డబ్బు ఎవరు వేశారో సూర్యకు అర్థం కాదు. రాజమండ్రి దగ్గర్లోని ఓ పల్లెటూరి కుర్రాడు ఆ మూడు కోట్లు వేశాడని తెలిసి సూర్య షాక్ అవుతాడు. అతను తన అభిమాని తెలుసుకున్న సూర్య.. అతన్ని కలవాలని బయలు దేరతాడు? మరి సూర్య అభిమానిని కలిశాడా? ఓ పల్లెటూరి కుర్రాడికి ఈ మూడు కోట్లు ఎలా వచ్చాయి? అసలు ఆ కుర్రాడెవరు? అతని కథేంటి? ఈ ప్రశ్నలకు సమాధానమే అసలు కథ.




# 'ది ప్యారడైజ్'లో 'బిర్యానీ'గా సంపూర్ణేష్ బాబు.. శ్రీకాంత్ ఓదెల మాస్టర్ ప్లాన్!

నేచురల్ స్టార్ నాని, 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ చిత్రం 'ది ప్యారడైజ్' నుంచి ఒక షాకింగ్ అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో 'బర్నింగ్ స్టార్' సంపూర్ణేష్ బాబును ఒక సరికొత్త ఊర మాస్ అవతారంలో శ్రీకాంత్ ఓదెల చూపించబోతున్నాడు. ఎప్పుడూ తనదైన కామెడీతో నవ్వించే సంపూర్ణేష్ బాబును దర్శకుడు శ్రీకాంత్ ఓదెల పూర్తిగా మార్చేశాడు. 'ది ప్యారడైజ్' చిత్రంలో సంపూ 'బిర్యానీ' అనే మాస్ పాత్రను పోషిస్తున్నారు. శుక్రవారం విడుదలైన ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పుడు ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ పోస్టర్‌లో సంపూర్ణేష్ బాబు ఒంటి నిండా రక్తపు మరకలతో, భుజాన గొడ్డలి వేసుకుని, బీడీ తాగుతూ చాలా సీరియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన కళ్లలో కనిపిస్తున్న క్రూరత్వం చూస్తుంటే, ఇందులో ఆయన కేవలం కామెడీకి పరిమితం కాకుండా ఒక పవర్‌ఫుల్ పాత్ర చేస్తున్నట్లు అర్థమవుతోంది. ఈ చిత్రంలో హీరో నాని (జడల్) కి అత్యంత సన్నిహితుడైన స్నేహితుడిగా, ప్రాణమిచ్చే నమ్మకస్థుడిగా 'బిర్యానీ' పాత్ర ఉండబోతోంది. ఈ పాత్ర కోసం సంపూర్ణేష్ బాబు చాలా బరువు తగ్గి, తన బాడీ లాంగ్వేజ్‌ను కూడా పూర్తిగా మార్చుకున్నట్లు చిత్ర బృందం తెలిపింది.


**శ్రీకాంత్ ఓదెల ప్లాన్ ఇదేనా?**

దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తన సినిమాల్లో పాత్రలను చాలా సహజంగా, గంభీరంగా చూపిస్తారు. 'దసరా'లో కమెడియన్లను కూడా సీరియస్ పాత్రల్లో చూపించినట్లుగానే, ఇప్పుడు సంపూ లోని యాక్షన్ యాంగిల్‌ను బయటకు తీయబోతున్నారు. "హైదరాబాద్ నేపథ్యంలో సాగే కథలో 'బిర్యానీ' లేకుండా ఉండదు" అంటూ ఈ పాత్రను ఇంట్రడ్యూస్ చేసిన తీరు వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో నానితో పాటు, మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. ఈ సినిమా 2026 మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా 8 భాషల్లో (తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్) గ్రాండ్‌గా విడుదల కానుంది.

## మట్టి మనుషుల కథతో 'దండోరా'.. ఆకట్టుకుంటున్న ట్రైలర్!

గ్రామీణ నేపథ్యంలో సాగే సందేశాత్మక చిత్రాలకు తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ బ్రహ్మరథం పడతారన్న విషయం తెలిసిందే. తాజాగా అదే కోవలో తెలంగాణ సంస్కృతి, సామాజిక అంశాల కలబోతగా వస్తున్న చిత్రం 'దండోరా'. మురళీకాంత్ దర్శకత్వంలో రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నైజాం ఏరియాలో విడుదల చేస్తుండటం సినిమాపై మరింత అంచనాలను పెంచింది. విదేశాల్లో కూడా ఈ సినిమా భారీ ఎత్తున విడుదల కానుంది. సుమారు 200కు పైగా థియేటర్లలో ప్రదర్శితం కాబోతున్న ఈ చిత్రానికి సంబంధించి, ఈ నెల 23నే అక్కడ ప్రీమియర్స్ పడనున్నాయి. అయితే ఈ సినిమా విడుదలకు ఇంకా వారం కూడా లేకపోవడంతో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. గ్రామాల్లో ఇంకా కులం అడ్డుగోడలు తొలగిపోలేదని ఈ ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతుంది. ప్రారంభంలోనే ఊరి బయట శవాన్ని మోసుకెళ్తున్న దృశ్యాలు, "మన చావు పుట్టుకలన్నీ ఈ ఊరి బయట రాసింద్రా ఆ దేవుడు.." అనే డైలాగ్ ఈ సినిమాలో ఉన్న సామాజిక కోణాన్ని ఎత్తి చూపుతోంది. ఈ చిత్రంలో శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మానికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందుమాధవి, రాధ్య, అదితి భావరాజు వంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషించారు. మార్క్ కె. రాబిన్ అందించిన సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. తెలంగాణ మట్టి వాసనతో కూడిన కథలను ఇష్టపడే వారికి 'దండోరా' ఒక మంచి అనుభూతిని ఇస్తుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.





## డిసెంబర్ 25న థియేటర్లలోకి 'ఈషా'.. వెన్నులో వణుకు పుట్టిస్తున్న కొత్త వార్నింగ్ వీడియో!


ఇటీవల 'లిటిల్ హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి' వంటి వరుస కల్ట్ హిట్స్ అందించిన సక్సెస్‌ఫుల్ జోడీ బన్నీ వాస్, వంశీ నందిపాటి. వీరిద్దరూ కలిసి ఇప్పుడు ప్రేక్షకులకు ఒక క్రేజీ హారర్ అనుభూతిని పంచడానికి సిద్ధమయ్యారు. వీరి సరికొత్త హారర్ థ్రిల్లర్ 'ఈషా' డిసెంబర్ 25న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ చిత్రం గురించి మేకర్స్ తాజాగా 'వార్నింగ్ వీడియో' పేరిట ఒక ఆసక్తికరమైన వీడియోను విడుదల చేశారు. సాధారణంగా హారర్ సినిమాలకు ట్రైలర్లు రావడం సహజం, కానీ ఇలా ప్రత్యేకంగా హెచ్చరిక వీడియో రావడం హారర్ జానర్‌లోనే ఇదే తొలిసారి. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఆత్మలు, దెయ్యాలు లేవని బలంగా నమ్మే కొందరు స్నేహితుల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. సమాజంలోని మూఢనమ్మకాలను, దొంగ బాబాలను ఎండగట్టాలని వారు భావిస్తారు. ఈ క్రమంలో వారికి పృథ్వీరాజ్ (బబ్లూ) నుంచి ఒక సవాలు ఎదురవుతుంది. "ఆత్మలు ఉన్నాయని నిరూపిస్తే..?" అంటూ ఆయన విసిరే ఛాలెంజ్‌తో ఈ స్నేహితుల బృందం ఒక చీకటి ప్రపంచంలోకి అడుగుపెడుతుంది. మనుషుల్లాగే కొన్ని స్థలాలు కూడా పుట్టుకతోనే శాపగ్రస్తమై ఉంటాయి.. కాలక్రమేణా అవి ఆత్మలకు నిలయాలుగా మారుతాయి" అని దర్శకుడు శ్రీనివాస్ మన్నె ఇచ్చిన వార్నింగ్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచుతోంది.

## ఆ రోజులు గుర్తొస్తే ఏడుపొస్తుంది.. హిందీ, సౌత్ ఇండస్ట్రీలపై రాధికా ఆప్టే ఫైర్




బాలీవుడ్‌తో పాటు సౌత్ చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి రాధికా ఆప్టే సినీ రంగంలో తన ఇరవై ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా చేసిన సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. కెరీర్ ఆరంభంలో తాను ఎదుర్కొన్న వివక్ష అలాగే బాడీ షేమింగ్ గురించి ఆమె ఆవేదన వ్యక్తం చేస్తూ, ఆ రోజులు గుర్తుకు వస్తే ఇప్పటికీ తన గుండె ఆగిపోయినంత పని అవుతుందని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా 2000వ దశకం చివరలో ఆర్థిక ఇబ్బందుల వల్ల కొన్ని దక్షిణాది సినిమాల్లో నటించాల్సి వచ్చిందని, అప్పుడు షూటింగ్ సెట్స్‌పై ఉన్న పరిస్థితులు అత్యంత దారుణంగా ఉండేవని ఆమె పేర్కొన్నారు. ఒక చిన్న ఊరిలో జరిగిన షూటింగ్ సమయంలో సెట్ అంతా మగవారే ఉండేవారని, అక్కడ తన శరీరాకృతి గురించి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసేవారని రాధిక వెల్లడించారు. సెట్‌లో ఉన్నవాళ్లు నా బమ్స్ మరియు బ్రెస్ట్స్ దగ్గర ప్యాడింగ్ పెంచమని అడిగేవారు. 'అమ్మా.. మోర్ ప్యాడింగ్' అని పిలిచేవారు. ఆ మాటలు విన్నప్పుడు తనకు నవ్వాలో ఏడవాలో అర్థమయ్యేది కాదని రాధికా వాపోయింది. అప్పట్లో తనకు రక్షణగా మేనేజర్లు, ఏజెంట్లు ఎవరూ లేకపోవడంతో ఒంటరిగా ఆ మానసిక వేదనను అనుభవించానని, ఆ పరిస్థితులు తనను ఇప్పటికీ మానసిక గాయానికి (%ట్రీఖబఝ%) గురిచేస్తాయని ఆవేదన చెందారు. హిందీ పరిశ్రమలో కూడా కొందరు ప్రభావవంతమైన వ్యక్తుల ప్రవర్తన నచ్చక తానంతట తానే పెద్ద ప్రాజెక్టుల నుంచి తప్పుకున్నానని, ఒకవేళ వారి పేర్లు బయటపెడితే ప్రపంచమంతా షాక్ అవుతుందని ఆమె తెలిపింది. పరిశ్రమలో ఉన్నత స్థాయిలో ఉన్న మహిళలు కూడా వ్యవస్థను మార్చడానికి ప్రయత్నించకపోవడం విచారకరమని అభిప్రాయపడిన రాధికా ఆప్టే, ప్రస్తుతం తన తాజా చిత్రం 'సాలీ మొహబ్బత్' జీ5లో స్ట్రీమ్ అవుతున్న సందర్భంగా ఈ విషయాలను పంచుకుంది.

# 'శాంతి' బిల్లుకు రాష్ట్రపతి ఆమోద ముద్ర



అణు రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని అనుమతించే సస్టెయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. 'శాంతి' బిల్లుకు ఇటీవల రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారని కేంద్రం తాజాగా ఓ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ బిల్లు పౌర అణు రంగాన్ని నియంత్రించే ప్రస్తుత చట్టాలన్నింటినీ విలీనం చేయడం సహా ప్రైవేట్ భాగస్వామ్యానికి మార్గం సుగమం చేయనుంది. దీంతో దేశంలో అణు అభివృద్ధికి అడ్డంకిగా ఉన్నాయని కేంద్రం భావిస్తోన్న 1962 నాటి అణుశక్తి చట్టం, 2010 నాటి అణు బాధ్యత సంబంధిత చట్టాలు రద్దయాయి. కొత్త చట్టం ప్రకారం.. ప్రైవేట్ కంపెనీలు సహా జాయింట్ వెంచర్లు ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా నూతన అణు విద్యుత్ ప్లాంట్లను నిర్మించవచ్చు. అంతేకాకుండా వాటిని నిర్వహించుకునే వెసులుబాటు సహా సొంతం చేసుకునే లేదా తొలగించే అవకాశం కూడా ఉంటుంది. అయితే.. వ్యూహాత్మక, సున్నితమైన కార్యకలాపాలు మాత్రం రాష్ట్ర నియంత్రణలోనే ఉంటాయనే విషయాన్ని ఈ బిల్లు స్పష్టం చేస్తుంది. యురేనియం థోరియం వంటి తవ్వకాలు, ఐసోటోపిక్ విభజన పునరుత్పాదక ఇంధనాలు, అధిక స్థాయి రేడియోధార్మిక వ్యర్థాల నిర్వహణ, భారీ నీటి ఉత్పత్తిని కేంద్ర ప్రభుత్వం లేదా ప్రభుత్వ యాజమాన్య సంస్థలు నిర్వహిస్తాయి. ఈ శాంతి బిల్లు అమలు దేశ పౌర అణు వ్యవస్థలో కీలక భూమిక పోషించనుంది. ప్రభుత్వం.. అణు ఇంధనానికి సంబంధించిన కీలక అంశాలను నియంత్రిస్తూనే విద్యుత్ ఉత్పత్తికి ప్రైవేట్ భాగస్వామ్యం కల్పించేందుకు వీలుంటుంది. ఈ బిల్లు ద్వారా.. ప్రైవేట్ రంగాలు సహా యువతకు అనేక అవకాశాలు కల్పిస్తాయని ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ(రావీ వీశీఉఱ) చెప్పిన విషయం తెలిసిందే. భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు, నవకల్పనల మార్గంలో ముందడుగు వేసేందుకు, నిర్మాణాలు చేపట్టేందుకూ అత్యంత అనుకూలమని కూడా అన్నారు మోదీ.

# మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ



ఇప్పటికే ఆపరేషన్ కగార్‌తో కకావికలమైన మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. సుక్మా జిల్లాలోని మావోయిస్టుల ఆయుధ కర్మాగారాన్ని భద్రతాబలగాలు, పోలీసులు సంయుక్తంగా ధ్వంసం చేశారు. దాంతో అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కుట్రను భగ్నంచేశారు. సుక్మా జిల్లా మీనాగట్టా అటవీ ప్రాంతంలో భద్రతాబలగాలతోపాటు పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మావోయిస్టులు నిర్వహిస్తున్న ఆయుధ తయారీ కేంద్రాన్ని భద్రతాబలగాలు గుర్తించాయి. అందులో భారీ ఎత్తున ఉన్న ఆయుధాలను, సింగిల్ షాట్ రైఫిల్స్‌ను, డిటోనేటర్లను, భారీ పేలుడు పదార్థాలను పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నారు. అలాగే భద్రతాదళాలే లక్ష్యంగా బాంబుల తయారీకి సంబంధించిన మెటీరియల్‌ను సైతం వారు పేల్చేశారు. 2026 మార్చి నెల ఆఖరులోపు దేశంలో మావోయిస్టులను నిర్మూలించాలనే లక్ష్యంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందుకోసం మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉన్న ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో కేంద్ర భద్రతా బలగాలతోపాటు ఆ రాష్ట్ర పోలీసులు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జరుగుతున్న వరుస ఎన్‌కౌంటర్లలో వందలాది మంది మావోయిస్టులు మరణించారు. అలాగే వందల సంఖ్యలో మావోయిస్టులను భద్రతా బలగాలు అరెస్ట్ చేశాయి. ఇక జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రభుత్వాల ఎదుట పలువురు మావోయిస్టులు లొంగిపోయారు.

## హైదరాబాదులో ముగిసిన శీతాకాల విడిది...

# ఢిల్లీ పయనమైన రాష్ట్రపతి ముర్ము



హైదరాబాదులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఐదు రోజుల శీతాకాల విడిది సోమవారంతో ముగిసింది. ఈ సాయంత్రం హైదరాబాద్ పర్యటనను ముగించుకుని ఆమె ఢిల్లీకి తిరుగుపయనమయ్యారు. హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితరులు ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ బి. శివధర్ రెడ్డితో పాటు పలువురు ఉన్నత స్థాయి సివిల్, రక్షణ శాఖ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రపతి ప్రయాణం సందర్భంగా బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం నుంచి హకీంపేట ఎయిర్‌బేస్ వరకు పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి, పలుచోట్ల ట్రాఫిక్‌ను మళ్లించారు. శీతాకాల విడిది కోసం డిసెంబర్ 17న హైదరాబాద్ వచ్చిన రాష్ట్రపతి, బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డిసెంబర్ 19న రామోజీ ఫిల్మ్ సిటీలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్‌పర్సన్‌ల జాతీయ సదస్సును ప్రారంభించారు. 20న బ్రహ్మకుమారీల శాంతి సరోవర్ 21వ వార్షికోత్సవ సభలో ప్రసంగించారు. 21న రాష్ట్రపతి నిలయంలో 'ఎట్ హోమ్' విందును ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా రాష్ట్రపతి శీతాకాల విడిది కోసం హైదరాబాద్ రావడం ఆనవాయతీ. ఈ సమయంలో రాష్ట్రపతి నిలయం నుంచే అధికారిక కార్యకలాపాలు నిర్వహిస్తారు. 1860లో నిర్మించిన ఈ భవనం, 1948లో హైదరాబాద్ భారత్‌లో విలీనమైన తర్వాత రాష్ట్రపతి విడిది కేంద్రంగా మారింది.

## హోంగార్డ్ సెలక్షన్స్‌కు 8,000 మందికిపైగా హాజరు..

## ఏకంగా రన్‌వేపై పరీక్ష

**భువనేశ్వర్:** హోంగార్డ్ సెలక్షన్స్‌కు 8,000 మందికిపైగా అభ్యర్థులు హాజరయ్యారు. దీంతో అంత మందికి పరీక్ష నిర్వహించడం పోలీసులకు సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో ఏకంగా రన్‌వేపై వారికి రాత పరీక్ష నిర్వహించారు. (రాంఱంష్ట్ను వ×ఖుఎ ష్ట్రవశ్రీన శీఅ ఖఱతీర్‌తీఱజూ) ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఒడిశాలోని సంబల్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సుమారు 200లోపు ఉన్న హోంగార్డుల పోస్టుల భర్తీకి అభ్యర్థులు అసాధారణ సంఖ్యలో దరఖాస్తు చేశారు. నియామక పరీక్ష కోసం 8,000 మందికిపైగా హాజరయ్యారు. కాగా, ఇంత భారీ సంఖ్యలో అభ్యర్థులకు పరీక్ష నిర్వహించడం పోలీస్ అధికారులకు సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 16న ఉదయం వేళ ఏకంగా జమదర్‌పాలిలోని రన్‌వేపై అభ్యర్థులకు రాత పరీక్ష నిర్వహించారు. దీంతో ఆ రన్‌వే పొడవునా వేలాది మంది అభ్యర్థులు వరుసగా కూర్చొని పరీక్ష రాశారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లు, భద్రత కోసం భారీగా పోలీస్ అధికారులు, సిబ్బందిని మోహరించారు. అలాగే అభ్యర్థుల పరీక్షను డ్రోన్ల ద్వారా పర్యవేక్షించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మరోవైపు 187 హోంగార్డుల పోస్టుల భర్తీకి కనీస అర్హత 5వ తరగతి ఉత్తీర్ణత. అయితే ఉన్నత విద్యావంతులు వేల సంఖ్యలో దరఖాస్తు చేశారు. సంబల్‌పూర్ జిల్లాకు చెందిన గ్రాడ్యుయేట్లు, ఇంజినీర్లు, కంప్యూటర్ సైన్స్, ఎంసీఏ, ఎంబీఏ చదివినవారు, డిప్లొమా హోల్డర్లు, ఐటీఐ శిక్షణ పొందిన అభ్యర్థులు హోంగార్డు ఉద్యోగం కోసం పోటీ పడ్డారు.

## శబరిమలలో ఫుడ్ సేఫ్టీ డ్రైవ్



కేరళ శబరిమల సన్నిధానం పర్యవేక్షణకు అధికారులు పటిష్ఠ చర్యలు చేపడుతున్నారు. సన్నిధానం పరిసరాల్లోని షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఫుడ్ కాంప్లెక్స్‌లు ఇతర వ్యాపార సముదాయాలలో అధికారులు సేఫ్టీ డ్రైవ్ చేపట్టారు. పరిశుభ్రత లేకపోవడంతో పాటు సరైన నిబంధనలు పాటించిన వ్యాపార సముదాయాలకు జరిమానా విధించారు. అయ్యప్ప సన్నిధాన పవిత్రతను కాపాడడానికి దేవస్థానం బోర్డు కఠిన చర్యలు తీసుకుంటుంది. ఇది వరకే శబరిమలలో ప్లాస్టిక్ వాడకంపై పూర్తిగా నిషేదం విధించారు. ఈ నేపథ్యంలో శబరిమలలోని హోటళ్లు, ఫుడ్‌కోర్టులు, ఇతర వ్యాపార సముదాయాలలో అధికారులు సేఫ్టీ డ్రైవ్ చేపట్టారు. పరిశుభ్రత లేకుండా నిబంధనలకు అనుగుణంగా లేని వాటిపై దాదాపు రూ. 98 వేల జరిమానా విధించారు. భక్తులు రద్దీని దృష్టిని ఉంచుకొని అధిక ధరలకు వస్తువుల అమ్మడం, సరైన పరిశుభ్రత పాటించకపోవడం తదితర అంశాలను ఆరా తీశారు. ఆహార పదార్థల ధరలను పట్టికలో పొందుపర్చాలని వాటిని ఎట్టి పరిస్థితుల్లో అధిక ధరలకు అమ్మకూడదని తెలిపారు. చలి తీవ్రత దృష్ట్యా భక్తులకు కచ్చితంగా వేడినీటినే సరఫరా చేయాలని కూల్ వాటర్ ఇవ్వకూడదని తెలిపారు. అదే విధంగా దేవస్థానం ఉద్యోగస్థుల పేరుతో మోసం చేసే వారిపై నిఘా ఉంచాలని పేర్కొన్నారు.

## సోనియా, రాహుల్ గాంధీలకు


## ఢిల్లీ హైకోర్టు నోటీసులు



నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలతో ఈడీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకోవడానికి ట్రయల్ కోర్టు నిరాకరించింది. ఈ తీర్పును ఈడీ ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసింది. దీంతో రాహుల్, సోనియా గాంధీతో పాటు ఈ కేసులోని ఇతరులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. నేషనల్ హెరాల్డ్ పత్రికను నడిపే ఏజేఎల్‌కు కాంగ్రెస్ పార్టీ రూ.90 కోట్ల రుణం అందించింది. అందుకు బదులుగా ఏజేఎల్ కంపెనీ ఆస్తులను తమ ఆధీనంలోకి తీసుకుంది. అయితే ఈ వ్యవహారంలో సోనియా, రాహుల్, ఇతర కాంగ్రెస్ నేతలు మో తీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండేజ్, సుమన్ దూబే తదితరులు మనీలాండరింగ్‌కు పాల్ప డినట్లు ఈడీ ఆరోపిస్తోంది. ఏజేఎల్ కంపెనీ ఆస్తులను స్వాధీనం చేసుకున్న యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ప్రధాన వాటా దారులుగా ఉన్నారు. ఈ సంస్థ కేవలం రూ.50 లక్షలు చెల్లించి ఏజేఎల్‌కు చెందిన సుమారు రూ.2 వేల కోట్ల విలువైన ఆస్తులు పొందారని ఈడీ తన ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది.

## అటవీ భూముల ఆక్రమణ..

## సుమోటో కేసుగా స్వీకరించిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ:** ఉత్తరాఖండ్‌లో భారీ స్థాయిలో అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. ఆ అంశంపై దాఖలైన పిటీషన్‌ను ఇవాళ సుప్రీంకోర్టు స్వీకరించింది. అటవీ భూముల్ని ఆక్రమిస్తుంటే, స్థానిక రాష్ట్ర ప్రభుత్వం మూగ ప్రేక్షకుడిలా కూర్చున్నదని సుప్రీం ధర్మాసనం పేర్కొన్నది. అటవీ భూముల ఆక్రమణ కేసును సుమోటోగా స్వీకరిస్తున్నట్లు కోర్టు చెప్పింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం ఈ పిటీషన్‌ను విచారించింది. ఎంక్వైరీ కమిటీ వేసి, ఆ రిపోర్టును సమర్పించాలని ఉత్తరాఖండ్ చీఫ్ సెక్రటరీని ధర్మాసనం ఆదేశించింది. కండ్ల ముందే అటవీ భూమిని లాగేసుకుంటుంటే, ఉత్తరాఖండ్ అధికారులు మూగ ప్రేక్షకుల్లా ఉండడం షాక్‌కు గురి చేస్తున్నదని, అందుకే దీన్ని సుమోటో కేసుగా స్వీకరిస్తున్నట్లు కోర్టు చెప్పింది. చీఫ్ సెక్రటరీ, ప్రిన్సిపల్ కన్జర్వేషన్ సెక్రటరీ నివేదిక ఇచ్చే వరకు థార్డ్ పార్టీ ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దు అని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. నివాసిత ఇండ్ల మినహా ఖాళీ భూములను అటవీశాఖ తమ ఆధీనంలోకి తీసుకోవాలని కోర్టు తన ఆదేశాల్లో వెల్లడించింది. అనితా ఖండ్వాల్ దాఖలు చేసిన పిటీషన్‌పై కోర్టు వాదనలు చేపట్టింది.

## కర్ణాటకలో సీఎం మార్పును డిసైడ్ చేసేది ఆయనే



కర్ణాటకలో ముఖ్యమంత్రి మా ర్పుపై కొనసాగుతున్న ఊహాగా నాలకు తెరదించేలా సీఎం సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర సీఎం మార్పు రగడపై అగ్రనేత నేత రాహుల్ గాంధీ నిర్ణయం తీసుకుంటారని అన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకునే నిర్ణయానికే తామంతా కట్టుబడి ఉంటామని ఆయన స్పష్టం చేశారు. సోమవారం తన సొంతూరు మైసూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం మార్పుపై మీడియా పదేపదే చర్చించడంపై సిద్ధరామయ్య అసహనం వ్యక్తం చేశారు. "ఈ విషయంపై ఇన్ని ప్రశ్నలు ఎందుకు? నేను ఇప్పటికే శాసనసభలో దీని గురించి మాట్లాడాను. మళ్ళీ చర్చ అనవసరం" అని అన్నారు. తాను పూర్తికాలం సీఎంగా కొనసాగుతానని ఇటీవల అసెంబ్లీ వేదికగా ప్రకటించిన సిద్ధరామయ్య, తాజా వ్యాఖ్యలతో బంతిని అధిష్ఠానం కోర్టులోకి నెట్టారు. గతవారం మంత్రి కేఎన్ రాజన్న, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో భేటీ అయిన విషయంపై అడిగిన ప్రశ్నకు సిద్ధరామయ్య స్పందిస్తూ.. "డీకే శివకుమార్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు. ఆయన్ను కలవడంలో తప్పేముంది?" అని ప్రశ్నించారు. మరోవైపు, సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య ఆధిపత్య పోరుపై ప్రతిపక్ష బీజేపీ విమర్శలు గుప్పిస్తోంది. కాంగ్రెస్ అధిష్ఠానానికి ఈ సమస్యను పరిష్కరించే సత్తా లేదని ఎద్దేవా చేస్తోంది. ఈ వారంలో డీకే శివకుమార్ ఢిల్లీ పర్యటనకు వెళ్లనుండటం, శనివారం జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి సిద్ధరామయ్యకు ఆహ్వానం అందే అవకాశం ఉండటంతో.. కర్ణాటక రాజకీయాలు మరింత వేడెక్కాయి.

## బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న హింస

బంగ్లాదేశ్‌లో హింసాకాండ కొనసాగుతూనే ఉంది. ప్రముఖ విద్యార్థి నేత ఉస్మాన్ హాదీ హత్యోదంతం మరిచిపోక ముందే, అదే పార్టీకి చెందిన మరో నాయకుడిపై హత్యాయత్నం జరిగింది. సోమవారం ఉదయం ఖుల్నా నగరంలో నేషనల్ సిటిజన్ పార్టీ (ఎన్‌సీపీ) నేత మహమ్మద్ మొతాలెబ్ షిక్దర్‌పై గుర్తుతెలియని దుండగులు కాల్పులు జరిపారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం, ఉదయం 11:45 గంటల సమయంలో దుండగులు షిక్దర్‌ను లక్ష్యంగా చేసుకుని కాల్చడంతో బుల్లెట్ ఆయన తలలోకి దూసుకెళ్లింది. వెంటనే ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని, చికిత్స అందిస్తున్నామని దర్యాప్తు అధికారి అనిమేష్ మోండల్ తెలిపారు. ఘటనపై విచారణ ప్రారంభించినట్లు వెల్లడించారు. గతవారం డిసెంబర్ 12న ఢాకాలో ఎన్‌సీపీకే చెందిన ప్రముఖ నేత షరీఫ్ ఉస్మాన్ హాదీని ముసుగులు ధరించిన దుండగులు కాల్చి చంపిన విషయం తెలిసిందే. భారత వ్యతిరేక వ్యాఖ్యలతో గుర్తింపు పొందిన హాదీ, మాజీ ప్రధాని షేక్ హసీనాను గద్దె దించడానికి కారణమైన విద్యార్థి ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ఆయన మరణం తర్వాత దేశవ్యాప్తంగా నిరసనలు, హింసాత్మక ఘటనలు చెలరేగాయి. ముఖ్యంగా మైనారిటీలపై దాడులు పెరిగాయి. గతేడాది జరిగిన భారీ విద్యార్థి నిరసనల నుంచి ఎన్‌సీపీ ఆవిర్భవించింది. 2026 ఫిబ్రవరిలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఈ పార్టీ పోటీ చేయనుంది.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137